మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 36 | శనివారం | 20-07-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## సిడిపిఒ పరీక్షలు రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సిడిపిఒ),ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఇఒ) ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షలను రద్దు చేస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షల ప్రశ్నపత్రాలపై సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ (సిఎఫ్ఎస్ఎల్), స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) నివేదికలపైన చర్చించి, వీటి ఆధారంగానే పరీక్షలను రద్దు చేయాలని నిర్ణయించినట్టు టిజిపిఎస్‌సి ఒక ప్రకటనలో పేర్కొంది.



# సర్కార్ స్కూళ్లు మరింత పటిష్టం

**మూడేళ్లలో బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి**

**సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లపై దృష్టిపెట్టండి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని విద్యాశాఖ కారదర్శి బుర్రా వెంకటేశంకు ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ తో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 'ప్లే స్కూల్' తరహాలో 3వ తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాలలోనే విద్యాబోధన చేసేలా, విద్యాబోధనకు అదనంగా ఒక టీచర్‌ను నియమించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలలను పటిష్టపర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలైన విద్యాబోధన కోసం త్వరలోనే సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుపైన దృష్టి సారించాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పై ఆర్కిటెక్ట్స్‌తో

తరువాయి 2లో



## త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లు

విద్య, వ్యవసాయ రంగాల సమస్యల పరిష్కారానికి త్వరలోనే విద్యా, వ్యవసాయ కమిషన్‌లను ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. విద్యా కమిషన్ ద్వారా విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దశలవారీగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని,కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టు

తరువాయి 2లో

# గ్రూప్-2 వాయిదా

**డిసెంబర్‌లో నిర్వహిస్తామని టిజిపిఎస్‌సి ప్రకటన**

**సచివాలయంలో గ్రూప్2 అభ్యర్థులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమావేశం**



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్2 పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఆగస్టు 7,8న నిర్వహించాల్సిన పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహిస్తామని టిజిపిఎస్‌సి శుక్రవారం వెల్లడించింది. డిసెంబర్‌లో ఏ తేదీలో పరీక్షలను నిర్వహిస్తామనేది తర్వాత ప్రకటిస్తామని ప్రకటించింది. కాగా అంతకుముందు గ్రూప్ 2 అభ్యర్థులతో హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రూప్ 2 పరీక్ష వాయిదా అంశంపైన వారితో చర్చించారు. గ్రూప్2 అభ్యర్థుల విన్నపం మేరకు పరీక్షలను డిసెంబర్ చివరి వారానికి వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని టిజిపిఎస్‌సి ఛైర్మన్ మహేందర్ రెడ్డితో భట్టి విక్రమార్క ఫోన్‌లో కోరారు. గ్రూప్ 2 అభ్యర్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించినట్టు భట్టి విక్రమార్క తెలిపారు. ఆ తర్వాత సాధ్యాసాధ్యాలను పరిశీలించిన టిజిపిఎస్‌సి, గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు టిజిపిఎస్‌సి కార్యదర్శి డాక్టర్ ఇ. నవీన్ నికోలాస్ ప్రకటించారు. 2022డిసెంబర్‌లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో టిజిపిఎస్‌సి 783 గ్రూప్2పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. వివిధ కారణాలతో అప్పటి నుంచి పరీక్షలు వాయిదా పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన తర్వాత గ్రూప్ 2 పరీక్షల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్2 పరీక్షలు నిర్వహించాలని టిజిపిఎస్‌సి నిర్ణయించింది. గ్రూప్2లో మొత్తం 783 పోస్టులకు రీ షెడ్యూల్ జారీ చేశారు. కాగా డిఎస్‌సి పరీక్షలకు ఆగస్టు 5వ తేదీ వరకు జరుగుతున్న

తరువాయి 2లో




## బ్యాంకుల ప్రైవేటీకరణ బిల్లు తెస్తే

# ఉద్యమం తప్పదు

- ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గం
- దేశ ప్రగతి, ఆర్థికాభివృద్ధి, ప్రజా ప్రయోజనాల కోసం బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
- అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నడం దుర్మార్గమని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఎపిటిబిఇఎఫ్) ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ప్రైవేటీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే దేశవ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బ్యాంకు ఉద్యోగులు, దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని చూడడం అన్యాయమన్నారు. దేశ ప్రగతి, ఆర్థికాభివృద్ధి, ప్రజా ప్రయోజనాల కోసం బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఎపిటిబిఇఎఫ్) ఆధ్వర్యంలో సచివాలయం యూనియన్ బ్యాంకు శాఖ నుంచి నెక్లెస్ రోడ్ ఇందిరాగాంధీ విగ్రహం వరకు శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రదర్శన నిర్వహించారు. వివిధ బ్యాంకులకు చెందిన వందలాది మంది ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని" వారు ప్లకార్డులు చేతబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ గతంలో 26 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉండగా, ప్రస్తుతం అవి 12కు తగ్గడం విచారకరమన్నారు. దేశ ప్రజల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తొలగించడంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయని వివరించారు. గతంలో వ్యవసాయ రంగానికి కేవలం లక్ష కోట్ల రూపాయల రుణాలను అందించిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రస్తుతం దాదాపు రూ.25 లక్షల కోట్ల రుణ సదుపాయాన్ని కల్పించి, ప్రజల ఆర్థిక అవసరాలను తీరుస్తుండడం గర్వకారణమన్నారు. వందలాది ఏళ్లుగా కేవలం వ్యాపారవేత్తలకు వారి ఆర్థిక,

తరువాయి 2లో

# 'ఇంటర్నెట్' అంతరాయం

**సాంకేతిక సమస్యలు.. నిలిచిన సేవలు**

**సైబర్ దాడి కాదంటున్న ఐటి సెక్యూరిటీ సంస్థలు**



**వెల్లింగ్టన్ (న్యూజిలాండ్):** భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో శుక్రవారం ఇంటర్నెట్‌కు గుర్తుతెలియని కారణాలవల్ల అంతరాయం ఏర్పడడంతో, శుక్రవారం పలు రకాల సేవలు నిలిచిపోయాయి. ప్రధానంగా బ్యాంకులు, విమానాశ్రయాలు ఈ ఇంటర్నెట్ బ్రేక్‌డౌన్ కారణంగా సమస్యలు ఎదుర్కొన్నాయి. ఈ హఠాత్ పరిణామాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నామని, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిసుత్తున్నామని వివిధ ఐటి కంపెనీలు ప్రకటించాయి. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన పలు యాప్‌లపై దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. కాగా, దీనిని సైబర్ దాడిగా అనుమానించడానికి వీల్లేదని క్రౌడ్‌స్ట్రయిక్ వంటి సైబర్ సెక్యూరిటీ సంస్థలు స్పష్టం చేశాయి. అయితే, సాంకేతిక సమస్యలు తలెత్తడానికి గల కారణాలు తెలియరాలేదని పేర్కొన్నాయి. మొత్తం మీద సాంకేతికత అంతరాయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పలు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. బ్యాంకులు ఆఫ్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మీడియా అవుట్‌లెట్లు సైతం సరైన సేవలు అందించలేకపోయాయి. ప్రపంచం మొత్తం మీద వివిధ కంపెనీలు, అవి అందించే సేవలను ఈ సాంకేతిక అంతరాయం ప్రభావితం చేసింది. సాఫ్ట్‌వేర్ల కోసం అతి కొద్ది సర్వీస్ ప్రొవైడర్లపై ఆధారపడడం వల్ల తలెత్తే సమస్యలను ఈ సమస్య తెరపైకి తెచ్చింది. కొద్దిపాటి సర్వీస్ ప్రొవైడర్లు మాత్రమే సాఫ్ట్‌వేర్‌లను అందిస్తున్న నేపథ్యంలో, వాటిలో చోటు చేసుకునే సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రంగాలపై పడుతుంది. వేలాది సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. తాజా ఘటనే ఇందుకు నిదర్శనం. సాంకేతిక సమస్యల వల్ల

తరువాయి 2లో

## వాయుగుండంగా అల్పపీడనం..

**ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్**



ప్రజాపక్షం/హైదరాబాద్

ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శుక్రవారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఒడిశా పూరీకి ఆగ్నేయంగా 70 కిలోమీటర్ల, ఏపీలోని కళింగపట్నం తూర్పుఈశాన్యంగా 240 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. శనివారం తెల్లవారు జామున వాయువ్య దిశగా పయణించి, పూరీ ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమవాయువ్య దిశగా కదిలి 24గంటల్లో క్రమంగా బలహీనపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో రాగల రెండురోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో పలు ప్రాంతాల్లో శుక్రవారం అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ,

తరువాయి 2లో



# తాలిపేరు గేట్లు ఎత్తివేత

**పెరుగుతున్న గోదావరి**

**భద్రాచలం వద్ద 28 అడుగుల వరద**

**ఖాళీ అయిన పెద్దవాగు ప్రాజెక్టు**

**నిలిచిన బొగ్గు ఉత్పత్తి**

**ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో స్తంభించిన జన జీవనం**

**ఉప్పొంగి ప్రవహిస్తున్న బోగత జలపాతం**

ప్రజాపక్షం/ ఖమ్మం/భద్రాచలం/వాజేడు

ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎడ తెగని వర్షానికి తడిసి ముద్దయింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు, మధ్యతరహా ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఎడతెగని వర్షం కురిసింది. పలు చోట్ల భారీ వర్షం నమోదైంది. అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది. ఏర్లు, నదులు, వాగుల పరివాహక ప్రాంతంలో ముంపుకు గురయ్యే ప్రజలకు హెచ్చరిక చేయడంతో పాటు అవసరమైన చోట్ల సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరినదికి వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి భద్రాచలం వద్ద 28 అడుగుల వరద నీరు ప్రవహిస్తోంది. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాల్లో కూడా వర్ష పడుతుండటంతో ఆ నీరంతా పల్లాన ఉన్న గోదావరి నదిలో చేరుతోంది. ప్రాణహిత, ఇంద్రావతి నదులతో పాటు తాలిపేరు పొంగి పొర్లుతూ గోదావరిలో కలుస్తోంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు 24వేల 65 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నప్పటికీ 24379 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరద ప్రాజెక్టులోనికి చేరుతోంది. రాగలరోజుల్లో సైతం వర్ష సూచన ఉండటంతో నదికి మరింత వరద తాకిడి పెరిగే అవకాశం ఉంది. భద్రాచలం స్నానఘట్టాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టడంతో పాటు లాంఛీలు సిద్ధం చేశారు. భద్రాచలం నుండి వెంకటాపురం, వాజేడు రహదార్లు జలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారు పునరావాస కేంద్రాలకు తరిలిపోయేందుకు సిద్ధంగా ఉండాలని

తరువాయి 2లో

## వియత్నాం కమ్యూనిస్టుపార్టీ అధినేత త్రోంగ్ మృతి



**హనోయ్ :** వియత్నాం కమ్యూనిస్టుపార్టీ అధినేత, దేశ మాజీ అధ్యక్షుడు గుయేన్ ఫూ త్రోంగ్ శుక్రవారం మధ్యాహ్నం మరణించారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. దేశంలోనే అత్యంత శక్తిమంతమైన ఈ పార్టీ పదవిని పది సంవత్సరాలపాటు ఆయన సమర్థవంతంగా నిర్వహించారని వియత్నాం ప్రభుత్వ మీడియా ప్రకటించింది. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారనీ, ఆయన మరణించినట్లు ఆయన వ్యక్తిగత వైద్యబృందం ప్రకటించిందనీ

తరువాయి 8లో

## ప్రాంతీయ పార్టీల ఆదాయంలో బిఆర్ఎస్ టాప్

**రూ. 737 కోట్లతో అగ్రస్థానం**

**న్యూఢిల్లీ:** ఎన్నికల సంస్కరణలకు కృషి చేస్తున్న అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తాజా నివేదికను అనుసరించి, ప్రాంతీయ పార్టీల ఆదాయ పట్టికలో బిఆర్ఎస్ నెంబర్ వన్‌గా నిలిచింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసిన ఈ నివేదికలో, బిఆర్ఎస్ మొత్తం ఆదాయాన్ని రూ. 737.67 కోట్లుగా చూపింది. ఆ పార్టీ మొత్తం ఆదాయంలో ఇది 42.38 శాతం. ఇదే ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా ఖర్చు చేసిన మొదటి ఐదు పార్టీల జాబితాలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిఎంసి) మొదటి స్థానంలో ఉంది. ఆ పార్టీ రూ. 181.18 కోట్లు లేదా 37.66 శాతం ఖర్చు చేసింది. ఆ తర్వాత వైఎస్ఆర్‌సిపి (రూ. 79.32 కోట్లు లేదా 16.49 శాతం), బిఆర్ఎస్ (రూ. 57.47 కోట్లు లేదా 11.94 శాతం), డిఎంకె (రూ. 52.62 కోట్లు లేదా 10.94 శాతం), సమాజ్‌వాది పార్టీ

తరువాయి 8లో

## పునర్విభజన హామీల అమలుపై కేంద్ర మంత్రులు స్పందించాలి

**బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలి**

**షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి**

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీల అంశాలను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన హామీలు ఉన్నప్పటికీ అమలు చేయలేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్ ఉన్నదని, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు

తరువాయి 2లో

## ఆర్టికల్ 361 రాజ్యాంగ నిబంధనను పరిశీలిస్తాం

**నేర విచారణ నుంచి గవర్నర్లకు రక్షణపై సుప్రీం కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ గవర్నర్‌పై ఇటీవల ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో అత్యున్నత న్యాయస్థానం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. నేర విచారణ నుంచి గవర్నర్‌కు మినహాయింపు కల్పించే ఆర్టికల్ 361 రాజ్యాంగ నిబంధనను పరిశీలించేందుకు అంగీకరించింది. బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ తనను లైంగిక వేధింపులకు గురిచేశారంటూ అక్కడి రాజ్‌భవన్‌లో తాత్కాలిక సిబ్బందిగా పని చేస్తున్న

తరువాయి 8లో

# కోటాహింస రావణకాష్టం

## ప్రధానమంత్రి ప్రతిపాదనకు విద్యార్థుల తిరస్కృతి





**ఢాకా:**బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం మరింత ఉధృతరూపం దాల్చి చివరకు శుక్రవారంనాడు మరోసారి హింసాకాండకు దారితీసింది. ఘర్షణలు, అల్లర్లు, పలు వాణిజ్యసంస్థల దహనాలతో దేశం అట్టుడికిపోయింది. స్కూళ్ళు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రిజర్వేషన్ వ్యతిరేక విద్యార్థులకు, పోలీసులకు, అధికార అవామీలీగ్ పార్టీకి చెందిన రిజర్వేషన్ అనుకూల విద్యార్థి మూకలకుమధ్య ఢాకాతో సహా దేశవ్యాప్తంగా అనేకచోట్ల ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలలో 50 మంది మరణించారు. పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు కూడా కర్రలు, రాళ్ళతో దాడులకు దిగారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరిస్తామని, విద్యార్థులు ఉద్యమం విరమించాలనీ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా చేసిన విజ్ఞప్తులను ఎవరూ పట్టించుకోలేదు. సమస్య పరిష్కారానికి ఆమె చేసిన ప్రతిపాదనలను విద్యార్థి సంఘాలు తిరస్కరించాయి. రిజర్వేషన్లను రద్దుచేసి, విద్యార్థులందరికీ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు ఇస్తేతప్ప ఆందోళన విరమించేదిలేదని విద్యార్థులు స్పష్టం చేశారు.దీంతో బంగ్లాదేశ్‌అంతటా ఆందోళనలు,హింస చెలరేగాయి.గురువారంనాడు కూడా దేశంలో హింస చెలరేగింది.

# యూరోపియన్ యూనియన్ చైర్మన్‌గా ఉర్సులా వోండర్ లేయన్ తిరిగి ఎన్నిక



**స్ట్రాస్‌బర్గ్ :** యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలుగా ఉర్సులా వోండర్ లేయన్ తిరిగి ఎన్నికయ్యారు. మరో ఐదు సంవత్సరాలు ఆమె ఆ పదవిలో కొనసాగుతారు. శుక్రవారం జరిగిన యూరోపియన్ యూనియన్ పార్లమెంటు సమావేశంలో సభ్యులు ఉర్సులాను తిరిగి ఆ పదవికి ఎన్నుకున్నారు. ఆ పదవికి ఆమే తిరిగి ఎన్నిక అవుతారని ముందునుండీ అందరూ ఊహించారు. నాయకత్వలోపం లేకుండా ఆమె మాత్రమే సమర్థవంతమైన కార్య నిర్వహణ కొనసాగిస్తారని సభ్యులు భావించారు. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు సమావేశంలో పార్లమెంటు అధ్యక్షుడు రోబెర్టో మెట్సోలా ఆమెకు వచ్చిన ఓట్లశాతం, ఫలితాల వివరాలు ప్రకటించిన వెంటనే ఉర్సులా వోండర్ లేయన్ లేచి నిలబడి తన పిడికిలి బిగించి అందరికీ అభివాదాలు తెలియజేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తన విజయం యూరోపియన్ యూనియన్ అనుకూల, ఉక్రేన్ అనుకూల, యూరప్ చట్టానికి అనుకూలమైన విజయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. వాతావరణ మార్పుల సంక్షోభం, ఉక్రేన్‌లో యుద్ధం, వలసలు, ఇళ్ళ కొరత వంటి అనేక సమస్యల మధ్య నాయకత్వలోపం లేకుండా 27 దేశాలతో కూడిన యూరోయన్ యూనియన్ కూటమికి సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగుతుందని ఆమె అన్నారు. ప్రగతి, భద్రత, సంపూర్ణ రక్షణ సాధించేందుకు తనతోపాటు తన బృందం కూడా ఐదేళ్ళపాటు యూరోపియన్ యూనియన్ అభివృద్ధికి అవిశ్రాంతంగా పాటుపడుతుందని ఉర్సులా వోండర్ లేయన్ అన్నారు. "అన్నింటికంటే ముఖ్యంగా మన ప్రజాస్వామ్యాన్ని మనం పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది, ఎందుకంటే యూరోపియన్ యూనియన్ దేశాల ప్రజాస్వామ్యంపై ఇంటా, బయటా కూడా దాడి జరుగుతున్నది, అందువల్ల ఈ దాడిని ఎదుర్కోవడానికి ప్రజాస్వామ్యశక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలి" అని ఆమె పిలుపు ఇచ్చారు. వోండర్ లేయన్ ఎన్నికకు ముందుగా వాతావరణ సంక్షోభ సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని గట్టి వాగ్దానం చేసిన తర్వాతే గ్రీన్స్‌యూరోపియన్ ఫ్రీ ఎలయన్స్ గ్రూప్ వోండర్ లేయన్‌కు పార్లమెంటులో తన పూర్తి మద్దతు తెలియజేసింది.

# రాబోయే నాలుగేళ్ళూ అమెరికాకు స్వర్ణయుగం

## వలసల్ని, ఉత్తర కొరియాను అడ్డుకుంటా : ట్రంప్ వెల్లడి



**మిల్వాయుకీ :** ఇక రాబోయే నాలుగు సంవత్సరాలూ అమెరికాకు స్వర్ణయుగమేనని రిపబ్లికన్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థి, మాజీ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. మిల్వాయుకీలో మూడు రోజులుగా జరిగిన రిపబ్లికన్‌పార్టీ జాతీయ సదస్సు ముంగింపు సందర్భంగా శుక్రవారంనాడు ట్రంప్ ప్రసంగించారు. రాబోయేకాలంలో అధ్యక్షుడుగా తాను ఎలాంటి చర్యలు తీసుకునేదీ ఆయన తన భవిష్యత్ ప్రణాళికను వివరించారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దులను మూసేస్తానన్నారు. ద్రవ్యోల్బణం పెరిగిపోయిన కారణంగా ప్రజలు దాచుకున్న సొమ్ము కరిగిపోయిందని, సమాజంలో ఏర్పడిన అంతరాలను భర్తీ చేయవలసి ఉందని అన్నారు. డెమోక్రాట్లు అధికారంలోకి వచ్చాక దేశం అన్నివిధాలా దిగజారిపోయిందని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చాక ఉత్తర కొరియాను క్షిపణి పరీక్షలు చేయకుండా అడ్డుకుంటామని అన్నారు. చైనా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆయన విరుచుకుపడ్డారు. ఐదురోజుల క్రితం గడచిన శనివారంనాడు ఆయనపై హత్యాయత్నం జరిగిన తర్వాత ట్రంప్ పార్టీ సదస్సులో పాల్గొని ఉత్సాహం నింపారు. అధ్యక్ష అభ్యర్థిగా తనను నిర్ణయిస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారంనాడు తనపై జరిగిన హత్యాయత్నం ఘటనను ఆయన గుర్తుచేసుకున్నారు. ఆనాడు బుల్లెట్ తన కుడి చెవిని తాకగానే తలవంచి దాక్కుని ఉండకపోయి ఉంటే ఈనాడు తాను ఇక్కడ ఇలా ప్రసంగించి ఉండేవాడిని కాదని అన్నారు.

# వాల్‌స్ట్రీట్ జర్నలిస్టుకు18 ఏళ్ళు జైలు శిక్ష?



**ఎకటరింబర్గ్ :** గూఢచర్యానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై రష్యాలో కేసు విచారణ ఎదుర్కొంటున్న వాల్‌స్ట్రీట్ జర్నల్ పాత్రికేయుడు ఎవాన్ గెర్ష్‌కోవిచ్ (32)కు 18 సంవత్సరాలు జైలుశిక్ష విధించాలని రష్యా ప్రాసిక్యూషన్ న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. గెర్ష్‌కోవిచ్‌ను అరెస్టు చేసిన 15 నెలల తర్వాత కోర్టులోకి ఎవరినీ అనుమతించకుండా తలుపులు మూసేసి విచారణ జరిపారు. తాను గూఢచర్యానికి పాల్పడలేదని గెర్ష్‌కోవిచ్ వాదించగా, ఆయన ఆయజమాన్యం వాల్‌స్ట్రీట్ జర్నల్ కూడా అతడికి మద్దతుగా అదేవాదన వినిపించింది. గెర్ష్‌కోవిచ్‌కు నున్నగా గుండు కొట్టించి తలకు మొఖానికి నల్లటి గుడ్డలు కట్టి బోనులో నిలబెట్టారు. ఉరల్ మౌంటెన్స్‌లో ఉన్న ఎటకరెంబర్గ్‌లో అమెరికా ప్రభుత్వంకోసం రహస్య సమాచారం సేకరిస్తున్నాడన్నఆరోపణలపై గెర్ష్‌కోవిచ్‌ను 2023 మార్చి 29న అరెస్టు చేశారు. బుధవారంనాడు రెండు గంటలసేపు ఈ కోర్టు విచారణ జరిగింది. ఐతే మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయం నుండి ఇద్దరు న్యాయవాదులను మాత్రమే అనుమతించారు. కొద్దిసేపు మాత్రమే గెర్ష్‌కోవిచ్‌ను బోనులో నిలబెట్టారు. ఆయనతో అమెరికా తరపు న్యాయవాదులను మాట్లాడేందుకు అనుమతించలేదు. తదుపరి విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేశారు.




# సీక్రెట్ సర్వీసెస్‌పై ఒత్తిడి రాజీనామాకు డిమాండ్

**వాషింగ్టన్ :** ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన తర్వాత ఇంతవరకూ సరైన కారణాలు తేల్చకపోవడంతో అమెరికా సీక్రెట్ సర్వీసెస్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. అంత సమీపానికి వెళ్ళి ఒక యువకుడు ఏ విధంగా కాల్పులు చేయగలిగాడనీ, దానికి కారణాలు ఏమిటో వెలికితీయడంలో సీక్రెట్ సర్వీసెస్ విఫలమైందని రిపబ్లికన్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నది. తక్షణం సీక్రెట్ సర్వీసెస్ డైరెక్టర్ కింబర్లీ ఛీట్లే తన పదవికి రాజీనామా చేయాలని రిపబ్లికన్ పార్టీ నాయకులు కార్యకర్తలు దేశవ్యాప్తంగా డిమాండ్లు చేస్తున్నారు. కమిటీ ఎదుట ఆయన జవాబు చెప్పాలని రిపబ్లికన్‌పార్టీ సెనేటర్ జేమ్స్ కోమర్ డిమాండ్ చేశారు. ఈ దర్యాప్తులో, ప్రజలకు సమాచారం ఇవ్వడంలో బాహాటత్వ విధానం కొనవడిందని ఆయన విమర్శించారు .

# ఇజ్రాయెల్‌పై హౌతీల డ్రోన్ దాడి



**టెల్‌అవీవ్ :** ఇజ్రాయెల్ నగరం టెల్ అవీవ్‌పై హౌతీ ఉగ్రవాదులు డ్రోన్ దాడి చేశారు. ఈ దాడిలో ఒక ఇజ్రాయెల్ పౌరుడు మరణించగా మరో పదిమంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతంలో ఈ డ్రోన్‌దాడికి తామే కారణమని, తామే దాడి చేశామని హౌతీ ఉగ్రవాదులు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు.

యెమెన్‌లోని తమ కేంద్రం నుండి 2,500 కి.మీ దూరంలో ఉన్న ఇజ్రాయెల్ లక్ష్యాన్ని దెబ్బతీశామని హౌతీల నాయకుడు ప్రకటించారు.

**యుఎన్ఆర్‌డబ్ల్యుఎకు**
**21 పౌండ్లు బ్రిటన్ సహాయం**

బ్రిటన్‌లో కొలువుతీరిన స్టార్‌మర్ కొత్త ప్రభుత్వం పాలస్తినాపట్ల తటస్థ వైఖరి అనుసరిస్తామని ప్రకటించింది. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ (ఐక్యరాజ్యసమితికి చెందిన పాలస్తినా శరణార్థుల సహాయ సంస్థ) కు 21 మిలియన్‌పౌండ్లు (27 మిలియన్ డాలర్లు) సహాయంగా ఇస్తున్నట్లు బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లామ్మీ శుక్రవారం చెప్పారు. అత్యున్నతస్థాయి ప్రమాణాలను బ్రిటన్ పాటిస్తుందని ఆయన అన్నారు. గత ఏడాది అక్టోబరు నుండి ఇప్పటివరకూ ఇజ్రాయిల్ జరిపిన దాడులలో 16,700 మందిపైగా పాలస్తీనా పిల్లలు మరణించారు. మరో 21,000 మంది పిల్లలు జాడతెలియకుండాపోయారు. 158 మంది జర్నలిస్టులు, మరో 197 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది మరణించారు.

# బైడెన్ ఏకాంతవాసం



**డెలవేర్ :** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కష్టకాలం వెంటాడుతున్నది. లాస్‌వేగాస్ పర్యటనలో ఉండగా ఆయనకు కొవిడ్ వైరస్ సోకిందని గురువారం జరిపిన పరీక్షల్లో బయటపడింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ జీన్ పైర్రే ఈ విషయం చెప్పారు. దీంతో ఆయన డెలవేర్‌లో ఉన్న తన నివాసంలో ఏకాంతవాసంలోకి వెళ్ళారు. ఐతే ఆయన అధికారిక కార్యకలాపాలను, విధులను అక్కడినుండే పూర్తిస్థాయిలో కొనసాగిస్తారని వాషింగ్టన్‌లోని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. గతంలో రెండుసార్లు బైడెన్‌కు కొవిడ్ సోకింది. ఇప్పటికే ఆయనకు రెండుసార్లు కొవిడ్ వ్యాక్సిన్ వేశారు కూడా. ఐతే కొవిడ్ వచ్చిందని నిర్ధారించిన తర్వాత బైడెన్ ఒక ప్రకటన చేస్తూ, తాను ఎంతో ఉత్సాహంతో ఉల్లాసంతో ఉన్నానని, తన ఆరోగ్యానికి ఢోకాలేదని అన్నారు. బైడెన్ మానసికస్థితిపై అమెరికా ప్రజల్లో రోజు రోజుకూ సందేహాలు పెరుగుతున్నాయి. 58 శాతంమంది ట్రంప్ మానసికంగా శారీరకంగా చాలా షార్ప్‌గా, యాక్టివ్‌గా ఉన్నారని చెప్పగా, 24 శాతం మంది మాత్రమే బైడెన్ బాగానే ఉన్నారని అభిప్రాయపడ్డారు.

## వాయుగుండంగా అల్పపీడనం..

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, నిజామాబాద్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రెడ్ అలెర్ట్ ప్రకటించారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

## 'ఇంటర్నెట్' అంతరాయం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నెట్ సేవలకు ఆటంకం కలగడంవల్ల, మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన 365 యాప్‌లు ప్రభావితమయ్యాయి. సమస్యను గుర్తించామని, అంతరాయాన్ని దశల వారీగా పరిష్కరిసున్నామని ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, వివరాలను వెల్లడించలేదు. ఇంటర్నెట్ అంతరాయలను ట్రాక్ చేసే డౌన్‌డిక్టెక్టర్ వీసా, ఎడిటి సెక్యూరిటీ, అమెజాన్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థల కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడిందని ప్రకటించింది. ఈ కారణంగా పలు విమానయాన సంస్థల సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఇజ్రాయెల్, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో కొన్ని విమన సర్వీసులు నిలిచిపోగా, మరికొన్నింటికి అంతరాయం ఏర్పడింది. న్యూజిలాండ్‌లో విమాన సర్వీసులతోపాటు రైళ్ల రాకపోకలకు కూడా విఘాతం ఏర్పడింది. దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో సాధారణ వ్యాపార కార్యకలాపాలు కూడా వివిధ సాఫ్ట్‌వేర్లు మొరాయించిన కారణంగా తాత్కాలకంగా నిలిచిపోయాయి. అటు యజమానులు, ఇటు కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఉద్యమం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపార అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉన్న బ్యాంకులను దేశ ప్రగతి, ఆర్థికాభివృద్ధి కోసం, ప్రజలకు ఉపయోగపడేలా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జాతీయకరణ చేశారని ఆయన గుర్తు చేశారు. బ్యాంకుల జాతీయకరణను ప్రైవేటురంగ పెట్టుబడిదారులు వ్యతిరేకించి సుప్రీంకోర్టుకు వెళ్ళి అడ్డుకున్నప్పటికీ, వామపక్ష, ప్రగతిశీల పార్టీలు, శక్తుల మద్దతు, పోరాటాలతో ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణను ముందుకు తీసుకెళ్ళారని తెలిపారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు బిజెపికి తక్కువ స్థానాల్లో గెలిపించినప్పటికీ, ప్రధాని మోదీ దేశ ఆర్థిక వ్యవస్థలో, ప్రజల ఆర్థిక అవసరాలలో క్రియాశీలపాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తుండం గర్హనీయమన్నారు. ప్రస్తుత ప్రైవేటు బ్యాంకులను కూడా జాతీయం చేసి ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ చేసిన రోజు దేశ ఆర్థిక చరిత్రలో ముఖ్యమైన రోజని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యానంతరం బ్యాంకుల జాతీయకరణ వల్ల అనేక మంది చిన్న వ్యాపారులకు ఆర్థిక ఊతం లభించి వారి జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు.ప్రస్తుతం దేశంలో కుప్పలు తెప్పలుగా వెలుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ బ్యాంకులు ప్రజలను మోసం చేస్తూ వారి కష్టార్జితమైన డబ్బును లూటీ చేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎపిటిబిఇఎఫ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణ రావు, ఉప ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, బ్యాంక్స్ రిటైరీస్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రముఖ విద్యావేత్తలు, రిటైర్డ్ ఐఎఎస్ అ ధికారులతో సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తోపాటు ప్రముఖ విద్యావేత్తలు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు,ఆకునూరి మురళీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సమస్యలను, విద్యావ్యవస్థలో లోపాలను వారు సిఎం దృష్టికి తీసుకువచ్చారు.పదేళ్లుగా యూనివర్సిటీల్లో రిక్రూట్‌మెంట్ లేదని, యూనివర్సిటీలకు డెవలప్‌మెంట్ గ్రాంట్స్ కేటాయించాలని విద్యావేత్తలు సిఎంను కోరారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించామని, విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నామని స్పష్టం చేశారు. అంగన్ వాడీలను ప్లే స్కూల్ తరహాలో మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్లే స్కూల్ తరహాలో 3వ తరగతి వరకు అంగన్ వాడీలలో విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతీ అంగన్ వాడీలలో విద్యాబోధనకు ఒక టీచర్ ను నియమించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నదని సిఎం రే వంత్ రెడ్డి తెలిపారు. 4వ తరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని,సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కు వెళ్లేందుకు విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించేందుకు యోచిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్ తో సమాంతరంగా సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ కొనసాగించనున్నామన్నారు.

## గ్రూప్–2 వాయిదా (మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో ఆగస్టు 7,8 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహిచడం పట్ల అభ్యర్థులు వ్యతిరేకించారు. గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గ్రూప్ 2 అభ్యర్థులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని గ్రూప్2 పరీక్షలను వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ మహేందర్ రెడ్డిని ఫోన్‌లో కోరారు.

**మూడు నెలల్లోనే 54 వేల ఉద్యోగాలకు మోక్షం : భట్టి విక్రమార్క**

మూడు నెలల కాలంలోనే 54 వేల ఉద్యోగాలకు మోక్షం కల్పించామని, ఉద్యోగ ఖాళీలు వెతికి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని, ఓవర్ లాపింగ్ లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గ్రూప్2 అభ్యర్థులతో సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెదిరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడితే కేసుల పాలైతే నష్టపోతారని , కొందరు వారి స్వలాభాల కోసం చేసే ప్రయత్నాల్లో నిరుద్యోగులు ఇబ్బందులు పడవద్దని సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసమన్నారు. గత ప్రభుత్వం మొదటి పది సంవత్సరాల్లో ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే లక్షలాది కుటుంబాలు స్థిరపడేవన్నారు. సిఎల్‌పి నేతగా తాను, పిసిసి అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు నిరుద్యోగులు లేవనెత్తిన అంశాలనే తమపార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోగా పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ బిడ్డలకు ఎంత తొందరగా ఉద్యోగాలు ఇస్తే అంత మంచిదని, ఎన్నికల్లో హామీ ఇచ్చామని, మనస్సాక్షికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పిన విషయాన్ని భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం చేస్తే ప్రభుత్వానికే జీతాల భారం తగ్గుతుందని, కానీ తాము అలా ఆలోచించడం లేదని, తమ బిడ్డలు స్థిరపడాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలని తాము మనసారా కోరుకుంటున్నామని వివరించారు. విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాలని వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించబోతున్నామని, అధునాతన టెక్నాలజీతో వీటిని నిర్మిస్తున్నామని, పోటీ పరీక్షలకు ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని చెప్పారు. పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు దేశంలోనే ఉన్నతమైన సబ్జెక్టు నిపుణులను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తారని, ప్రిపేర్ అయ్యేవారు ఆయా కేంద్రాల నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశ్నలు వేయవచ్చని, తమ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని భట్టి విక్రమార్క సూచించారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారు ఇకనుంచి అశోక్ నగర్ లో ఐదు రూపాయల భోజనంతో ఇబ్బంది పడాల్సిన పనిలేదని భట్టి తెలిపారు.

**విద్యార్థుల అభ్యర్థన పరిగనణలోకి తీసుకుని వాయిదా : ఎంపి మల్లు రవి**

గ్రూప్ 2, 3 అభ్యర్థుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని పరీక్షలను వాయిదా వేశామని నాగర్ కర్నూలు కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. గ్రూప్ 2 విద్యార్థులతో కలిసి సచివాయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం విద్యార్థుల ప్రభుత్వం అని , పరీక్షల వాయిదా విషయంలో డిప్యూటి సిఎం బట్టి విక్రమార్క మల్లు చొరవ తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపి బలరాం నాయక్ మాట్లాడుతూ గ్రూప్స్ పరీక్షలు వాయిదా వెయ్యాలని విద్యార్థుల నుంచి తమ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టిజి పిఎస్‌సి చైర్మన్‌తో మాట్లాడి సిఎం రేవంత్ రెడ్డి చొరవతో వాయిదా వేశామన్నారు. మరోసారి చర్చించి గ్రూప్స్ పరీక్షల పోస్టులను పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

**త్వరలోనే మరోసారి నోటిఫికేషన్ : ఎంపి అనిల్ కుమార్ యాదవ్**

గ్రూప్స్ పరీక్షలను వాయిదా వెయ్యాలని గత కొన్ని రోజులుగా విద్యార్థులు నిరసన చేస్తున్నారని రాజ్యసభ ఎంపి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. విద్యార్థుల మనోవేదన అర్థం చేసుకున్నామని, ఇది ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. శుక్రవారం రోజు డిప్యూటి సిఎం బట్టి విక్రమార్కతో భేటి అయి ఓ నిర్ణయానికి వచ్చామన్నారు. విద్యార్థులకు ఎలాంటి కష్టం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు.

## స్పందించాలి (మొదటి పేజీ తరువాయి)

జాతీయ హోదా ఇచ్చారని, తెలంగాణ ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కెసిఆర్ అనేక తప్పులు చేశాడని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును విస్మరించాడని, జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమయ్యాడన్నారు. ఇప్పుడున్న రాష్ట్రప్రభుత్వంతో పాటు రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని లేనిపక్షంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన సింగరేణి బొగ్గు గనుల వేలం వేసే అంశం తీవ్రంగా చర్చ జరుగుతోందని, ప్రైవేటీకరణ చేస్తే వేలం వేసినట్లే అవుతుందన్నారు.27న గ్లోబల్ టెండర్లు పిలుస్తున్నందున తక్షణమే టెండర్ పిలుపును రద్దుచేయాలని కేంద్రప్రభుత్వాన్ని చాడ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి నిన్నటి నుంచి ఆప్రక్రియ మొదలుపెట్టిందని, రైతులందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకుల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో పెట్టి చేస్తామని చెబుతున్నారని, ఎకరానికి 7,500 ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యేడాది రూ.15వేలు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలులో రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డు ఇవ్వాలని, ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలకు వారానికోసారి కూలీ డబ్బులు చెల్లించాలని కోరారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు జిల్లా కలెక్టర్లు ఏసి గదులకు కాకుండా ప్రజాక్షేత్రంలో ఉండాలని చెప్పడం మంచిదేనని, అందరూ ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడే ప్రజల కొరకు ప్రజల చెంత ఉంటేనే ప్రజాప్రభుత్వం అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గూడెం లక్ష్మి, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బ్రాహ్మండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

## పటిష్టం (మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మాస్టర్ ప్లాన్, ఇతర అంశాలపై చర్చించారు.ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు ప్రభుత్వం సరికొత్త విధానంతో ముందుకెళ్లనుంది. కాగా కొడంగల్,మధిర నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్ట్ ను చేపట్టనున్నారు. సొంత గ్రామాల్లోనే విద్యార్థులు చదువుకునేలా వీలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 4వతరగతి నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. గ్రామాల నుంచి సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు వెళ్లేందుకు ప్రభుత్వమే రవాణా సదుపాయం కల్పించేలా చూడాలని, విద్యా వేత్తల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఒకటి,రెండు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌ను చేపట్టేలా ప్రణాళికలను ఉండాలని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు సిఎస్ఆర్ ఫండ్స్ తో విద్యార్థులకు అన్ని వసతులూ ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## తాలిపేరు గేట్లు ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో ఆర్‌డిఓ దామోదర్ రావు తిరిగారు. లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉంటూ అధికార యంత్రాగానికి సహకరించాలని కోరారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 710 సె.మీ వర్షపాతం నమోదైంది. భారీ వనడటంతో అశ్వారావుపేట పరిధిలోని పెద్దవాగుకు గండి పడి పరిస ప్రాంతాలు జలమయం అయ్యాయి. రైతులు, కూలీలు వరదలో చిక్కుకోవడంతో ఏపి, తెలంగాణ ప్రభుత్వాలు చొరవచూపి హెలీకాప్టర్ సహాయంతో వారిని రక్షించారు. వర్షం కారణంగా వాగులు పొంగి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 152 .4 మి.మీటర్లు. పాల్వంచ మండలంలో 9.6 మిల్లీ మీటర్ల అత్యల్ప వర్షపాతం నమోదైంది. గోదావరికి గంట గంటకు పెరుగుతుంది. తాలిపేరుకు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో పలు చోట్ల వరద పోటెత్తింది. కిన్నెరసాని నుండి నీటిని విడుదల చేయడంతో కిన్నెరసాని నది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ఖమ్మంజిల్లాలో సైతం భారీ వర్షం నమోదు కావడంతో జన జీవనం స్తంభించింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. సత్తుపల్లి, ఇల్లందు, కోయగూడెం, మణుగూరు, కొత్తగూడెం లో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. అశ్వారావుపేట మండల పరిధిలోని పెద్దవాగు ప్రాజెక్టు గండిపడి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. శుక్రవారం ఖమ్మం జిల్లాలో అత్యధికంగా వేంసూరులో 64.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యవసర పని ఉంటే తప్ప బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తెగిపోయిన పెద్దవాగు ప్రాజెక్టును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ సందర్శించారు. కిన్నెరసాని లోతట్టు ప్రాంతాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ పరిశీలించారు.

**వాజేడు వద్ద గోదావరి పరవళ్లు**

ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, తెలంగాణలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలంలో కొంగల, చీకుపల్లి, గుండ్లవాగు, మర్రివాగులు పొంగి పొర్లుతున్నాయి. దీనితో గోదావరిలోకి వరద నీరు అత్యధికంగా చేరడంతో గోదావరి పరవళ్లు తొక్కుతుంది. వాజేడు మండలం పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి 12.760 మీటర్లకు చేరుకుంది. దీనితో గోదావరి పూసూరు బ్రిడ్జి వద్ద నిండుగా ఉధృతంగా ప్రవహిస్తుంది. మరోవైపు చీకుపల్లి బోగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తూ వరద నీరు క్రిందకి జాలువారుతుండడంతో ఆ వరద నీరు మొత్తం గోదావరిలో కలుస్తుంది. దీనితో గోదావరి మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. తుపాకులగూడెం సమ్మక్క సారక్క బ్యారేజ్ గేట్లు మొత్తం ఎత్తివేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు.

# త్వరలోనే పంటల బీమా పథకానికి రూపకల్పన

- రైతుల సూచనల మేరకే రైతు భరోసా అమలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- కరీంనగర్‌లో రైతు భరోసా అమలుపై మంత్రి వర్గ ఉపసంఘం అభిప్రాయ సేకరణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణలోని రైతు లందరి సూచనలు అభిప్రాయాలను క్రోడీకరించి రైతు భరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడిం చారు. రైతు సంక్షేమానికే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ బైపాస్ రోడ్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో రైతు భరోసా పథకం అమలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి రైతుల నుంచి మంత్రి వర్గ ఉపసంఘం అభిప్రాయాలు సేకరిం చింది. ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి ఎమ్మెల్యేలు, కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మంత్రుల బృందం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజ రైన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతు భరోసాను అందించేందుకు రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. వారి సూచనలు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రైతు భరోసాను పకడ్బందీగా అమలు చేస్తామని, వ్యవ సాయ రంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎంత కష్టమొచ్చినా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుం దని స్పష్టం చేశారు. అతి త్వరలో పంటల బీమా పథకం అమలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. పంట నష్టపో యిన రైతులను పంటల బీమా ద్వారా సాయం అందిం చి ఆర్థికంగా ఆదుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వమే బీమా డబ్బులను చెల్లించి పంటల బీమా అమలు చేస్తుం దని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

**రైతును రాజు చేయడమే లక్ష్యంగా: శ్రీధర్‌బాబు**

తమ ప్రభుత్వం రైతును రాజు చేయడమే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతుందని రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రైతుల సూచనల అభిప్రాయా లను పరిగణలోకి తీసుకునేందుకు రైతు భరోసాపై సమా వేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారి అభిప్రాయా లను తీసుకుని విధానపరమైన నిర్ణయం తీసుకుంటా మని పేర్కొన్నారు.

**రైతు రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది: ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

రైతు రుణమాఫీ పథకం చరిత్రలో నిలిచిపోతుందని సాగునీటి పౌరసరఫరాల శాఖ మంత్రి జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18న ఒక్క రోజే 11 లక్షల మంది రైతుల ఖాతాల్లో 7 వేల కోట్లు జమ చేసిందన్నారు. కరీంనగర్ జిల్లా సమగ్ర అభి వృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

**ప్రతిపక్షాల గ్లోబెల్ ప్రచారాన్ని నమ్మొద్దు : పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

రైతు భరోసాపై ప్రతిపక్షాలు చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని రెవెన్యూ, హౌజింగ్, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, వారి సూచనల ప్రకారమే రైతు భరోసా అందిస్తామని తెలిపారు. ఐటి శాఖలు చేసే రైతులకు రైతు భరోసా అందిస్తామని , దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశా రు. ప్రతిపక్షాలు చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. 25 రోజుల్లో 31 వేల కోట్ల రుణమాఫీ చేయడం దేశంలో ఎక్కడ జరగలేదని పేర్కొన్నారు. రైతు ల గురించి మాట్లాడే నైతిక హక్కు గత పాలకులకు లేదన్నారు.

**రైతుల ఆకాంక్షలకనుగుణంగా రైతు భరోసా: పొన్నం ప్రభాకర్**

రైతుల ఆకాంక్షలకనుగుణంగా రైతు భరోసా పథకం అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. వ్యవసాయం, రైతులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పా రు. రైతులను రాజులు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయ కులు, మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు అందరి సూచనలు తీసుకొని రైతు భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. 70 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తించడం లేదంటున్న బండి సంజయ్ అది నిరూపించకపోతే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. రైతులకు రుణమాఫీ చేస్తుంటే భరించలేకపోతున్నారని మండిపడ్డారు. సమా వేశంలో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, మానకొండూర్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, చింతకుంట విజయ రమ ణారావు, మక్కాన్ సింగ్ ఠాకూర్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్, సత్య ప్రసాద్, కోయ శ్రీహర్ష, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.



నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ 89వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందచేసి, శుభాకాంక్షలు తెలిపిన నవ చేతన పబ్లిషింగ్ పాలకవర్గ సభ్యులు. ఏటుకూరి ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో నవ చేతన పబ్లిషింగ్ హౌస్ పాలకవర్గ సభ్యులు ఎస్.వి. సత్యనారాయణ, కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, ఎన్. మధుకర్, పి. నారాయణ రెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



డ్రగ్స్‌ను తరిమేద్దాం.. అంటూ సీనియర్ జర్నలిస్ట్ ఎ.కొండల్ గౌడ్ పాడిన పాట పోస్టర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. సిఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కోడూరు శ్రీనివాస్ రావు, పాట రచయిత కొండల్ గౌడ్ తదితరులు ఉన్నారు.



## మహంకాళి బోనాల జాతరకు సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ మహంకాళి బోనాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని ఆలయ అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని అర్చకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బోనాల జాత రకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవా దాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కూడా**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలకు సకుటుంబ సప రివార సమేతంగా హాజరుకావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క మల్లుకు శుక్రవారం సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి ఛాంబ ర్‌లో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ జీ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంత రావు, ఆలయ ఈ.ఓ మనోహర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రామతీర్థ శర్మ, వేద పండితులు వేణుమాధవ్ శర్మలు ఆహ్వాన పత్రికను అందచేశారు.

## విద్యుత్ సిబ్బందిపై దాడిచేస్తే చర్యలు : ముషారఫ్ ఫారూఖీ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ అధికారుల పైనా, సిబ్బందిపైనా దాడి చేయడం, విధులు నిర్వర్తించకుండా అడ్డగిం చడం పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ హెచ్చరించారు. మొన్న గురువారం హైదరాబాద్ బంజా రాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీ నగర్‌లో జరిగిన సంఘట నలో గాయపడిన సిబ్బంది గణేష్, శ్రీకాంత్ , భాస్కర్‌లను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



వైద్య పరంగా అవసరమైన సహాయాన్ని అందించాలని సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజినీర్ చంద్ర శేఖర్ ను, గ్రీన్ ల్యాండ్స్ డివిజనల్ ఇంజినీర్ సుధీర్‌లను సిఎండి ఆదేశించారు. విద్యుత్ సిబ్బందిపై జరిగిన దాడికి సంబంధించిన వివరాలను మీడియాకు విడుదల చేశారు. '' ఎర్రగడ్డ సెక్షన్ పరిధిలోని మోతి నగర్ లో టి.రాములు సర్వీస్ కనెక్షన్ నెంబర్ : ఎస్‌జడ్ 104823 /యూఎస్‌సి నెంబర్ 100124620 పై రూ.6,858/బిల్లు పెండింగ్ ఉన్నది. గత ఫిబ్రవరి నెల నుండి విద్యుత్ బిల్లు చెల్లించలేదు. ప్రతి నెలా బిల్లు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది అడుగుతున్నా దాట వేత సమాధానా లు ఇస్తూ పెండింగ్ బిల్లులు చెల్లించట్లేదు. సుమారుగా ఐదు నెలలుగా చెల్లించక పోవడంతో, మొన్న గురువారం 18వ తేదీన విద్యుత్ సిబ్బంది మీటర్ పక్కన ఉన్న ఎంబిసి విద్యుత్ కనెక్షన్‌ను నిలిపివేశారు. దీనితో ఆగ్ర హం, ఆవేశానికి గురైన నివాసితుడు మురళీధర్ అక్కడ ఉన్న విద్యుత్ సిబ్బంది పై ఒక్క సారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధి తుడు హెచ్. శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో దాడి చేసిన వ్యక్తి మురళీధర్‌ను అదుపులోకి తీసుకుని విద్యుత్ సెక్షన్లను అనుసరించి కేసు నమోదు చేశారు''అని తెలిపారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలు పెంచాలి

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారానికి వచ్చి ఏడు నెలలు అవు తున్నా ప్రభుత్వ, ప్రభుత్వేర సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనా లను సవరించి పెంచకుండా ప్రభుత్వం గత ప్రభు త్వాలలాగానే దాటవేట ధోరణినే కనబరుస్తోందని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం, హిమాయత్‌నగర్‌లో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు యం.డి. యూసుఫ్ అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా ఎస్. బాల్‌రాజ్ మాట్లాడు తూ ఎన్‌డిఏ ప్రభుత్వం అనేక పోరాటాల వల్ల సాధిం చిన 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసి కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్, పెట్టుబడిదారులకు మేలు చేస్తున్నార న్నారు. ఆ కోడ్‌లను, 4 లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని ప్రకటించటం ఎన్‌డియే ప్రభు త్వ విధానాలను కూడా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామనడం హాస్యాస్ప దంగా ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశా లల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు చెల్లిస్తున్న రూ.3 వేల వేతనాన్ని రూ.10వేలకు పెంచి అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మరవ డాన్ని ఆయన నిశితంగా విమర్శించారు. ప్రభు త్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం, 2వ ఏఎన్ ఎంలు వేలాదిమంది శ్రమ దోపిడికి గురవుతూ పేద ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి పనిచేస్తుం టే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకుండా కాలయాపన చేయటాన్ని ఆయన విమర్శించారు.

తెలంగాణ సివిల్ సప్లయి స్ కార్పొరేషన్‌లో ఎగు మతి, దిగుమతి చేస్తున్న హమాలీ కార్మికులకు జన వరి 2024 నుండి హమాలీ రేట్లు ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం 7 నెలలు అవుతున్నా కనీ సం చర్చలకు అయినా పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు అడ్డాల లో పను లకు నిలబడితే వారికి చట్టం ప్రకారం కనీసం విశ్రాంతి గదులు, మూత్రశాలలు నిర్మించాలన్న చట్టాన్ని తుంగలో తొక్కారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జులై 24 నుండి జరుగు తున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతి రోజు ఒక యూనియన్ వారి సమస్యల పరిష్కారాని కై ఇందిరాపార్కు వద్ద ధర్నాలు నిర్వహించి మంత్రు లకు, అధికారులకు మెమోరాండాలు ఇవ్వాలని నిర్ణ యించామన్నారు. అంతే కాకుండా ఈ ధర్నాలలో సిరిసిల్ల ప్రాంత చేనేత కార్మికులు వందలాదిగా ఇందిరాపార్కు వద్ద ధర్నాలో పాల్గొని తమ సమస్య లను ఎలిగెత్తి చాటేందుకు సమాయత్తం అవుతున్నా రని ఆయన అన్నారు. 1948 కనీస వేతనాల చట్టం, సమాన పనికి పనికి సమాన వేతనం కొరకై కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి మెమోరాండం ఇవ్వటం జరుగుతుం దని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులు, మున్సిపల్ వర్కర్స్, సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులు, భవ న నిర్మాణ కార్మికులు, ఆటో యూనియన్ల డ్రైవర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఇందిరాపార్కు వద్ద ధర్నాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికై హైదరాబాద్‌కు తరలివస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఆయా కార్మికుల సమస్యలు పరిష్కరించి ధర్నాలను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, ఉపాధ్య క్షులు పి. ప్రేంపావని, కె.ఏసుర త్నం, రాష్ట్ర కార్యద ర్శులు ఎన్. కరుణ కుమారి, వై.ఓమయ్య, నరాటి ప్రసాద్, బి.వెంకటేశం, యం. డి.ఇమ్రాన్,ఎస్. విలా స్, ఓరుగంటి యాదయ్య, కడారి రాములు, యం. ప్రవీణ్ కుమార్, గన్నారపు రమేష్, జి. రాములు, కమతం యాదగిరి లు సమావేశంలో మాట్లాడారు.

## ప్రజాభవన్‌లో దరఖాస్తులు స్వీకరణ

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మజ్యోతి బా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 545 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధిం చి 95, పౌరసరఫరాల శాఖకు సంబం ధించి 84, విద్యుత్ శాఖకు సంబంధించి 82, హౌజింగ్‌కు సంబంధించి 79 దరఖా స్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 47, ఇతర శాఖలకు సంబంధించి 158 దరఖాస్తులు అందినట్లు అధి కారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షులు చిన్నా రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని, దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## రైతుల సమస్యలు చిరంజీవి పట్టించుకోవడం లేదు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెగాస్టార్ చిరంజీవిపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సంచ లన వ్యాఖ్యలు చేశారు. రైతులకు జరుగుతున్న నష్టా లపై సినిమాలు తీసిన చిరంజీవి, ఢిల్లీలో ధర్నాలు చేసిన రైతులకు ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నిం చారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ రైతుల పక్షాన అన్నట్లు చిరంజీవి ఖైదీ నెంబర్ 150 సినిమా తీశారన్నారు. సినిమాల తో కోట్లు సంపాదిస్తున్న మీరు రైతు సమస్యలను ఎందు కు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రైతుల పేరు తో తీసిన సినిమాలతో డబ్బులు సంపాదిస్తూ, ప్రధాని మోదీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. మోదీకి, పవన్‌కు మాత్రమే ఎందుకు మద్దతిస్తున్నా రని, రైతులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీకి ఎందుకు సపోర్ట్ చేయడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండి ఉంటే చిరంజీవి సక్రమ మార్గంలో ఉండేవారన్నారు. ఇప్పుడు పక్కదారి పట్టా రని అన్నారు.

**ఆరునెలల్లోనే రూ.31 వేల కోట్లు ఇచ్చాం..** కెసిఆర్ గత పదేళ్లలో రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసి రైతు లకు కేవలం రూ. 26 వేల కోట్లు మాత్రమే ఇచ్చార న్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం 6 నెలల్లోనే రూ. 31 వేల కోట్లు ఇచ్చిందని జగ్గారెడ్డి చెప్పారు. ఇప్పటి దాకా బిజెపి ఎన్ని వేల కోట్ల రూపాయల రైతు రుణ మాఫీ చేసిందని ప్రశ్నించారు. కెటిఆర్ ట్విట్టర్ కే పనికొస్తాడని, పనికి పనికిరాడని విమర్శించారు.

**రుణమాఫీతో బిజెపి, బిఆర్‌ఎస్ వాళ్లకు నిద్రపట్టడం లేదు...** సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ రూ.2లక్షల రుణమాఫీ మొద లైందన్నారు. లక్ష వరకు రుణాలు ఉన్న వారికి మాఫీ అయ్యిందని, ఆగస్టు 15 వరకు రూ. 2 లక్షల రుణ మాఫీ అవుతుందన్నారు. రుణమాఫీతో బిజెపి, బిఆర్ ఎస్ వాళ్లకు నిద్రపట్టడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ చేయగానే రైతుల ఇళ్లల్లో సంబరాలు జరిగాయన్నారు. ప్రతిపక్ష నేతల ఇళ్లలో ఆందోళన లు మొదలయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం రైతు నల్ల చట్టాలు తెచ్చి, రైతు హత్యలు చేశారని విమర్శిం చారు. దీని మీద చర్చకు వస్తారా అని కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు సవాల్ విసిరారు. ఢిల్లీలో రైతులు నిరసనలు తెలిపితే, మంత్రుల పిల్లల వాహనాలతో మర్డర్లు చేశారని మండిపడ్డారు.

## రుణమాఫీతో రైతు బాంధవుడిగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఎంపిలు మల్లు రవి, బలారాం నాయక్, రఘురామి రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతుల రుణమాఫీ చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రైతు బాంధవుడిగా మారడని ఎం.పి. మల్లు రవి అన్నారు. గాంధీ భవన్‌లో ఎంపిలు బలారాం నాయక్, రఘురామి రెడ్డిలతో కలిసి మల్లు రవి మాట్లా డారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణలో రుణమాఫీ చేశారన్నారు. రేవంత్ రెడ్డి సేవలను ఇతర రాష్ట్రా ల్లోనూ ఉపయోగించుకునేలా అధిష్ఠానం దృష్టికి తీసుకువె ళ్తామని మల్లు రవి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఐదు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. గత ప్రభుత్వం రైతులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శిం చారు. 10 సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్న బిఆర్‌ఎస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతు రుణ మాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని గ్లోబల్ ప్రచారం చేశా రన్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో కొన్ని సీట్లు ఓడిపో యామని, ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ ఆగస్ట్ 15 లోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తారన్నారు. 69 లక్షల మంది రైతులకు 31 వేల కోట్ల రోపాయలు

భారత ఉదేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా నిలిచిందన్నారు. యుపిఎలో మన్మోహన్ సింగ్ హయంలో రైతు రుణమాఫీ చేసిన చరిత్ర అన్నారు. ఇప్పుడు తెలంగాణలో 31 వేల కోట్ల చేయడం, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిలు అన్ని నియో జక వర్గాలలో ధన్యవాద కార్యక్రమాలు చేపడుతున్నామ న్నారు. బిఆర్‌ఎస్ హయాంలో 7లక్షల కోట్లు అప్పు చేస్తే తాము తీర్చుకుంటు వస్తున్నామన్నారు. ఎం.పి. బలారాం నాయక్ మాట్లాడుతూ ఆదివాసుల, గిరిజనులకు ఏమి ఇచ్చారో కెటిఆర్ చెప్పాలన్నారు. తనతో కెటిఆర్ చర్చకు రావాలన్నారు.

యుపిఎ ప్రభుత్వం, సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ హయాంలో దేశంలో 85 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తెలం గాణలో 31 వేల కోట్ల రుణమాఫీ చేసి దేశంలోనే రేవంత్ రెడ్డి నెంబర్ వన్ ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. ఖమ్మం ఎం.పి. రఘురామి రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో 69 వేల రుణ ఖాతాలు ఉన్నాయని, 300 కోట్లు విడుదల అయ్యా యని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం 3756 రోజులు అధి కారంలో ఉండి ఏమి చేశారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చిందని, రుణమాఫీ చేయరని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించాయని, పార్లమెంట్ ఎన్ని కల కంటే ముందే రుణమాఫీ ప్రక్రియ మొదలైందన్నారు. రైతుల అభిప్రాయలు తీసుకొని రైతు భరోసా కూడా అమలు చేస్తామన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయండి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రైతుల రుణాలు మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యార్థులకు సంబంధిం చిన పెండింగ్ స్కాలర్‌షిప్ రూ. 8వేల కోట్ల నిధులను కూడా విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్య క్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్య దర్శి పుట్ట లక్ష్మణ్ కోరారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయి లను విడుదల చేస్తే గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇబ్బందులు తొలిగిపోతాయని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. కెసిఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్న రేళ్ల పాటు విద్యార్థులను విస్మరించిం దని విమర్శించారు. కాంగ్రెస్ అధికా రంలోకి రాగానే ఫీజు బకాయిలు విడుదల చేస్తామన్న హామీని వారు గుర్తు చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ నిధులను కూడా విడుదల చేస్తే విద్యార్థులత పాటు కళాశాలల యాజ మాన్యాలు, సిబ్బందికి కూడా ఇబ్బం దులు తొలగిపోతాయని పేర్కొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ విభాగం, సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, పిఆర్ సర్కిల్, సూర్యాపేట.

''ఇ'' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

e-Proc.T.N.No. PR/SRPT/12/2024-25 (2nd Call) & PR/SRPT/13/2024-25 (2nd Call) & PR/SRPT/14/2024-25 (2nd Call) & PR/SRPT/15/2024-25 (2nd Call), తేది: 18.07.2024

సూర్యాపేట జిల్లాలో **పనుల సంఖ్య:** (04). **1.** సూర్యాపేట - దంతాలపల్లి పిడబ్ల్యుడి రోడ్ @9/0 కి.మీ. ఆత్మకూర్(ఎస్)(ఎం)లోని ఏనుబాముల వరకు ఆర్‌ఎఫ్ (ఎస్‌సి రిజర్వ్‌డ్ కొరకు). **అంచనా విలువ:** రూ.27.80 లక్షలు, **2.** సూర్యాపేట - దంతాలపల్లి పిడబ్ల్యుడి రోడ్ @17/3 కి.మీ. ఆత్మకూర్(ఎస్)(ఎం)లోని ఇస్తాలపురం వరకు ఆర్‌ఎఫ్. **అంచనా విలువ:** రూ.21.80 లక్షలు, **3.** చివ్వెంల - ముకుందాపూర్ పిడబ్ల్యుడి రోడ్ @5/7 కి.మీ. ఆత్మకూర్(ఎస్)(ఎం)లోని బోత్యతండా వరకు ఆర్‌ఎఫ్. **అంచనా విలువ:** రూ.19.50 లక్షలు, **4.** వికె పహాడ్ వద్ద 1 కి.మీ. చివ్వెంల మండలంలో జగనతండా వరకు, **అంచనా విలువ:** రూ.36.80 లక్షలు. **టెండర్ల డౌన్‌లోడ్ ప్రారంభ & ఆఖరి తేది:** 25.07.2024@10:00AM నుండి తేది: 12.08.2024@04.00PM, ప్రతి నిట్/బిడ్ అందుబాటులో ఉంటుంది. ప్రచురణ తేది నుండి (14) స్పష్టమైన పని దినాలు అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు ''ఇ'' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in లో పొందవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ సర్కిల్, సూర్యాపేట.

DIPR R.O. No. : 326-DP/CL/ADVT/1/2024-25 Date: 19-07-2024



తెలంగాణ ప్రభుత్వం
రహదారుల మరియు భవనాల శాఖ

టెండరు నోటీసు

ఎన్.ఐ.టి.నం: షార్ట్ ఎన్.ఐ.టి.నం. 1/ఈ.ఈ/డి.బి /హెచ్.డి/2024-2025, తేది: 15.07.2024, **ఎన్ని పనులు:** 16 పనులు, **పనుల పేర్లు:** నిజామాబాదు జిల్లాలోని రోడ్డు మరమత్తుల పనుల గురించి, **అంచనా మొత్తం:** రూ.57.0 లక్షలు, **వేలం వేయుటకు ప్రారంభ తేది మరియు చివరి తేది:** 23.7.2024 నుండి 30.07.2024 వరకు 3.30 PM, **టెక్నికల్ బిడ్ ప్రారంభ తేది:** 30.07.2024 @3.30PM, **బిడ్ ప్రారంభ తేది:** 30.07.2024 @4.00PM, పైన తెలుపబడిన పనులు ''ఇ-ప్రొక్యూర్‌మెంట్'' వెబ్‌సైట్లో తేది: 23.07.2024 నుండి 30.07.2024 వరకు లభించును. ఇతర వివరములకు @www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహక అభియంత (ర.మ.భ) పరిధి, నిజామాబాదు

DIPR R.O. No. : 338-DP/CL/ADVT/1/2024-25 Date: 19-07-2024



తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) విభాగము
ఫారం-VII
(డిక్లరేషన్/రూఢి ప్రకటన)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైనపరిహారాన్ని పొందే హక్కు చట్టం- 2013, (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రూల్ 25 సబ్ రూల్ (1) ను అనుసరించి)

**కలెక్టర్ ఫైల్ నం. G1/1895/2019** **తేది: 11.07.2024**
**ప్రత్యేక ఉప కలెక్టర్ గారి ఫైల్ నం. B/50/2023** **తేది: 04.07.2024**
**గజిట్ నెం. 101/2024** **తేది: 11.07.2024**

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన సిద్దిపేట జిల్లా, మిరుదొడ్డి మండలములోని చెప్యాల గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ. 8.08 గుంటల** ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణములో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ యొక్క ప్యాకేజ్-13లోని కుడి ప్రధాన కాలువ యొక్క D-11 డిస్ట్రిబ్యూటర్ నిర్మాణ నిమిత్తము ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 19(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది.

కావున సిద్దిపేట జిల్లా, మిరుదొడ్డి మండలములోని చెప్యాల గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణము **ఎ. 8.08 గుంటల** గల భూమి ఈ క్రింది అనుబంధములో చూపిన వానిని పైన చూపబడిన ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైనందున భూసేకరణ నిమిత్తము ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: చెప్యాల మండలము: మిరుదొడ్డి జిల్లా: సిద్దిపేట

| క్ర. సం. | నోటిఫికేషన్ క్రమ సంఖ్య | సర్వే నం. | భూమి రకం | భూమి వర్గం | భూసేకరణ చేయు విస్తీర్ణం | భూమి పట్టాదారు / అనుభవదారు / ఆసక్తిదారు పేరు | హద్దులు: తూర్పు | పడమర | ఉత్తరము | దక్షిణము | భూమిపై ఉన్న చెట్లు / పైపులు / డ్రిప్పులు / బావి / బోర్ ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 | 772 | పట్టా | మెట్ట | 0.21 | మిద్దె రామకృష్ణ తండ్రి నారాయణ | 777 | రోడ్ | 772 &774 | రోడ్ | బోరు-1 |
| 2 | 2 | 772 | పట్టా | మెట్ట | 1.05 | మిద్దె ఆంజనేయులు తండ్రి నారాయణ (అ) | 774 | రోడ్ | 764 | 773 | |
| 3 | 2 | 772 | పట్టా | మెట్ట | 0.04 | మిద్దె రామకృష్ణ తండ్రి నారాయణ | 774 | రోడ్ | 764 | 773 | |
| 4 | 2 | 772 | పట్టా | మెట్ట | 1.04 | కంకణాల నర్సింలు తండ్రి వెంకటయ్య(పట్టా) కంకణాల యాదయ్య తండ్రి గోపయ్య అను) | 774 | రోడ్ | 764 | 773 | పైప్‌లైన్ |
| 5 | 3 | 771 | పట్టా | మెట్ట | 0.02 | కంకణాల నవనీతం తండ్రి గోపయ్య | రోడ్ | 768 | 770 | రోడ్ | |
| 6 | 4 | 764 | పట్టా | మెట్ట | 0.05 | బెజ్జనబోయిన శ్రీనివాస్ (అ) | 762 &763 | రోడ్ | 765 | 772 | |
| 7 | 5 | 770 | పట్టా | మెట్ట | 1.17 | బెజ్జనబోయిన శ్రీనివాస్ | రోడ్ | 769 | రోడ్ | 771 | |
| 8 | 5 | 770 | పట్టా | మెట్ట | 0.32 | బెజ్జనబోయిన జగతవ్వ భర్త నర్సింహులు | రోడ్ | 769 | రోడ్ | 771 | మామిడి -2 |
| 9 | 5 | 770 | పట్టా | మెట్ట | 0.02 | రోడ్ | | | | | |
| 10 | 6 | 766 | పట్టా | మెట్ట | 0.01 | రోడ్ | 765 | రోడ్ | 750 | రోడ్ | |
| 11 | 6 | 766 | పట్టా | మెట్ట | 2.00 | గాడిపల్లి తిరుపతిరెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | 765 | రోడ్ | 750 | రోడ్ | మామిడి -58 |
| 12 | 6 | 766 | పట్టా | మెట్ట | 0.32 | గాడిపల్లి లక్ష్మి నరసింహ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | 765 | రోడ్ | 750 | రోడ్ | మామిడి -17 |
| 13 | 6 | 766 | పట్టా | మెట్ట | 0.02 | అమ్మ నర్సింహులు తండ్రి గోపయ్య (అ) | 765 | రోడ్ | 750 | రోడ్ | |
| 14 | 6 | 766 | పట్టా | మెట్ట | 0.01 | రోడ్ | 765 | రోడ్ | 750 | రోడ్ | |
| మొత్తం విస్తీర్ణం | | | | | 8.08 | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై ఎలాంటి అభ్యంతరములు రానందున ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణములో భాగంగా శ్రీ కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ యొక్క ప్యాకేజ్-13లోని కుడి ప్రధాన కాలువ యొక్క D-11 డిస్ట్రిబ్యూటర్ నిర్మాణము కొరకు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలములోని చెప్యాల గ్రామ పరిధిలోని ఇట్టి భూసేకరణ వారి వారి కమతాలలో అతి స్వల్ప విస్తీర్ణమునకు పరిమితమైనందున మరియు ఇట్టి కాలువ నిర్మాణము వలన వారి వారి మిగిలిన భూములకు నీటి సరఫరా పెరిగి, జీవనోపాధులు మెరుగు అవుతున్నందు వలన మరియు ఇట్టి భూసేకరణ వలన ఎలాంటి ఇతర కుటుంబాలు జీవనోపాధులు గాను, ఆవాసాలు గాని ఎలాంటి ప్రభావితం కానందున, పునరావాస మరియు పునరుపాధి వర్తించదు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొండ భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ భూసేకరణ యొక్క ప్రత్యేక ఉప-కలెక్టర్, భూసేకరణ విభాగము-1, సిద్దిపేట గారి కార్యాలయము పనివేళలో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- **తహశీల్దార్, మిరుదొడ్డి మండలం**
సం/- **ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), కాళేశ్వరం ప్రాజెక్ట్, యూనిట్-1, సిద్దిపేట**
సం/- **అదనపు కలెక్టర్, సిద్దిపేట జిల్లా**
సం/- **జిల్లా కలెక్టర్, సిద్దిపేట జిల్లా.**

DIPR RO NO. 134/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం
శనివారం, జులై 20

# యుపి ఉపఎన్నికలు – యోగీకి కీలకం

జూన్ 4న వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బిజెపిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. గత ఎన్నికల్లో స్వయంగా 62 సీట్లు గెలుచుకున్న ఉత్తరప్రదేశ్‌లో సగానికి సగం కోల్పోయి కేవలం 33 సీట్లకే పరిమితం కావటం, దేశం మొత్తంగా చూస్తే లోక్‌సభలో కనీస మెజారిటీని అందుకోలేకపోవటం, ప్రభుత్వం ఏర్పాటుకు ఎన్‌డిఎ పక్షాలపై ఆధార పడవలసి రావటం బిజెపి నాయకులు, కార్యకర్తలకు ఊహకందని విషయం. ''240 సీట్లతో పాలించే హక్కును కోల్పోయాం'' అనేది నిత్యం వెక్కిరిస్తూనే ఉంది. ఆ బాధను కప్పి పుచ్చుకునేందుకే మోదీ వరుసగా మూడవసారి ప్రధానమంత్రి అయ్యారనేదానికి అధిక ప్రచారం ఇస్తున్నారు. ఆయన కూడా పాత పద్ధతిలోనే పెత్తందారీ ధోరణితోనే వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుపట్ల ఆర్‌ఎస్‌ఎస్ కూడా అసంతృప్తితో ఉంది. దాని అధినేత మోహన్ భాగవత్ జార్ఖండ్‌లో వికాస్ భారతి అనే సంస్థ ఏర్పాటు చేసిన గ్రామస్థాయి కార్యకర్తల సమావేశంలో గురువారం ప్రసంగిస్తూ బలమైన మాటల తూటా వదిలారు. దానికి ఎటువంటి భాష్యమైనా చెప్పవచ్చు. అయితే అది మోదీని ఉద్దేశించిందనేది స్పష్టం : ''మనిషి తాను సూపర్ మాన్, దేవత(దేవుడు) లేక విశ్వరూపుడు కావాలని ఆకాంక్షించవచ్చు. అయితే ఆ తర్వాత ఏమి ఉందో, ముందు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు.'' ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం చివరిరోజుల్లో తాను 'సహజాతుణ్ణి కాదని, దేవుడు పంపిన దూతనని'' తన తల్లి మరణానంతరం తనకు అనిపిస్తోందని చెప్పటం ఈ సందర్భంగా గుర్తు చేసుకోదగింది. మాతృసంస్థ కన్నా తాను ఎత్తు ఎదిగినట్లు మోదీ ప్రవర్తిస్తున్నాడని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తున్నట్లుంది. సరిదిద్దటమా – తొలగించటమా అనే సున్నిత సమస్యను అది ఎజండాలోకి తీసుకోకపోదు.

ఈ పూర్వరంగంలో ఉత్తరప్రదేశ్‌లో 10 అసెంబ్లీ స్థానాలకు రాబోవు ఉప ఎన్నికలు ఆ పార్టీకి, ముఖ్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు, నరేంద్రమోదీకి కీలకమైనవి. 5 స్థానాలు సమాజ్‌వాది పార్టీకి బలమైనవి. మెజారిటీ స్థానాలు గెలిచి పరువు నిలుపుకోవటం బిజెపికి అవసరం. ఈ పరిస్థితుల్లో, ఆదివారం జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి యోగి వ్యవహారశైలి కారణంగా ఉపముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య నాయకత్వంలో పలువురు ధ్వజమెత్తారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సహా జె.పి.నడ్డాను విడిగా కలిసి తమ ఉద్దేశం తెలియచేశారు. యోగి పార్టీ నాయకులు, కార్యకర్తలకన్నా అధికారులపై ఆధారపడుతున్నారని, ఈ వైఖరి ఎమ్మెల్యేలు సహా నాయకులకు పార్టీని దూరం చేసిందని, వారు ఫిర్యాదు చేశారు. వారి అంతరార్థంగా యోగి ఆదిత్యనాథ్‌ను తొలగించాలని చెప్పకనే చెప్పారు. ఆగస్టులో 10 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు ఉన్నాయని నడ్డా ప్రస్తావనగా అన్నారట. అంటే ఉప ఎన్నికలకు యోగికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి, ఫలితాలనుబట్టి నాయకత్వ మార్పును ఆ తర్వాత పరిశీలిద్దామన్నది దాని భావం. వాస్తవానికి, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కూడా యోగికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. ''పార్టీ నాయకుల అతిశయించిన విశ్వాసం, ప్రజల్లో వ్యతిరేకత ఉన్న అభ్యర్థులను తిరిగి పోటీకి నిలపటం'' పార్టీ పరాజయాలకు కారణమన్నది యోగి ప్రత్యారోపణ. ఇందులో తొలి ఆరోపణ రాష్ట్ర పార్టీలోని తన వ్యతిరేకులపై, రెండోది బిజెపి కేంద్ర నాయకత్వంపై ఎక్కుపెట్టబడినట్టివి. అంతేగాక మోదీ తనను చూసి ఓటేయమని ప్రజలను అడిగినందున అభ్యర్థులు చొరవ చూపలేదు. కాబట్టి ఓటమికి మోదిదే బాధ్యత అనేది యోగి భావన. ఉపముఖ్యమంత్రి కెపి మౌర్యకు కేంద్ర నాయకత్వం అండవున్నదని వినిపిస్తున్నప్పటికీ ప్రజల్లో బలం యోగి ఆదిత్యనాథ్ దే. ఒకటి, గోరఖ్‌పూర్ మఠాధిపతిగా ప్రజల అభిమానం, రెండు, తాను జన్మతా రాజ్‌పుత్రుడైనందున క్షత్రియుల అండ ఉంది. అందువల్ల పార్టీ అధిష్టానం ఆచితూచి అడుగేస్తోంది. 2021లో ఒకసారి యోగి ప్రధానమంత్రి తో ఢీకొన్న విషయం గుర్తు చేసుకోదగింది. యోగి ప్రధానమంత్రి పదవికి పోటీదారుల్లో ఒకరన్నది మోదీకి తెలుసు. కాబట్టి ఉప ఎన్నికల ఫలితాలు ఆయన భవిష్యత్‌కు అత్యంత కీలకం.

## బొగ్గుగనుల ప్రైవేటీకరణ దేశానికి ప్రమాదకరం

# మోదీ మిత్రులకే ప్రయోజనకరం



జె.సీతారామయ్య
IFTU రాష్ట్ర ఉపాధ్యక్షులు

చావుతప్పి కండ్లు లొట్టబోయినట్లు ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం బొగ్గు గనుల అమ్మకాలకు నవ్విపోదురుగాక నా కేమిటి సిగ్గు అన్నట్లుగా ఎలాంటి శషభిశలు లేకుండా కొనసాగిస్తున్నది. మంత్రివర్గ విస్తరణలో తెలంగాణ రాష్ట్రం నుండి బొగ్గుగనుల శాఖమంత్రిగా బాధ్యతలు కిషన్ రెడ్డి చేపట్టిన వెనువెంటనే బొగ్గు గనుల వేలానికి ముహూర్తం పెట్టి ప్రకటనలు చేశాడు. మొట్టమొదటి ప్రకటనలోనే సింగరేణికి చెందిన గనులను వేలం వేస్తామన్న ప్రకటనను మంత్రి కిషన్ రెడ్డి చేశాడు. మోదీ ప్రభుత్వం గత రెండు సార్లు అధికారంలో ఉన్నప్పుడు దేశ సంపదను, వనరులు, పరిశ్రమలను, అడవులను తన అప్తమిత్రులైన అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టింది. ప్రజలు ఈసారి ఎన్నికల్లో బిజెపికి మెజారిటీ ఇవ్వకుండా ఓడించినా తగిన గుణపాఠం తీసుకొనకుండా పనిలో పనిగా మిగిలిన దేశ సంపదలను సంపూర్ణంగా కార్పొరేట్లకు అప్పగించడమే లక్ష్యంగా తీసుకున్నట్లు అర్థం అవుతున్నది.

**బొగ్గుగనుల అమ్మకం అత్యంత ప్రమాదకరం**

దేశవ్యాప్తంగా 260బొగ్గు గనులను మోదీ..2 ప్రభుత్వం అమ్మకానికి సిద్ధం చేసింది. ఇందుకోసం 1952 నాటి బొగ్గు గనుల చట్టా నికి సవరణ చేశారు. అంబానీ,అదానీ,అరబిందో, వేదాంత తదితర బడా కార్పొరేట్ సంస్థలకు అమ్మివేసేందుకు పూనుకుంది. కార్పొరేట్లకు అప్పగించే గనులలో సింగరేణికి సంబంధించిన జేవిఆర్ ఓసి(సత్తుపల్లి) కోయగూడెం ఓసి(టేకులపల్లి) శ్రావణపల్లి(శ్రీరాంపూర్) కళ్యాణఖని (మంచిర్యాల్)లు ఉన్నాయి. కోయగూడెం ఒసిలో అరబిందో కంపెనీ ఇప్పటికే టెండర్లు వేయడం జరిగింది. సింగరేణికి చెందిన 4బొగ్గు బావులను మోదీ ప్రభుత్వం బలిపీఠంపై పెట్టిన దానికి వ్యతిరేకంగా సింగరేణి కార్మిక సంఘాలు ఆందోళనకు పూనుకున్నాయి.సింగరేణి గని కార్మిక సంఘాలకు మద్దతుగా కేంద్రకార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి తదితర సంఘాలు నడుంబిగించాయి. వారికి సంఘీభావంగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా యి.

**తరతరాలకు సరిపడే బొగ్గు సంపద మనది**

తెలంగాణ ప్రాంతంలోని నాటి ఖమ్మం జిల్లాలో సింగరేణి గ్రామ సమీపాన 1871లో బాటసారుల ద్వారా తెలిసిన సమాచారం ఆధారంగా బ్రిటిష్ అధికారి విలియమ్ కింగ్ బొగ్గును కనిపెట్టడంతో ఇల్లందులో 1889లో బొగ్గు తవ్వకాలను బ్రిటిష్ ప్రభుత్వం ప్రారంభించింది. నేడు తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ మొత్తం 6 జిల్లాల కు సింగరేణి విస్తరించి బొగ్గు తవ్వకాలు జరుపుతున్నారు. సింగరేణి లో సర్వేచేసిన ప్రకారం 11,395 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది. 2023మార్చి నాటికి 1686.74 మిలియన్ టన్నుల బొగ్గును తీశారు. అంటే 135 ఏండ్లలో తీసిన బొగ్గు అతి స్వల్పం మాత్రమే. బొగ్గు సమృద్ధిగా ఉన్నందున మరో 804 ఏండ్లు ఇప్పటికే సర్వే చేసి ఉన్న బొగ్గును తీసుకోవచ్చు. 134 ఏండ్లలో సింగరేణిలో తీసిన బొగ్గు కేవలం 1686.74మిలియన్ టన్నులు మాత్రమే అంటే రానున్న ఎన్నో తరాలకు సరిపోయే బొగ్గు నిక్షేపాలు ఇప్పటికే సింగరేణి సంస్థచే సర్వేచేసి రెడీగా ఉంచబడింది.

సింగరేణి బొగ్గును ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, గోవా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాలకు పంపిస్తున్నది. తెలంగాణతో పాటు ఒడిశాలో బొగ్గు ఉత్పత్తిని సింగరేణి సంస్థ తీస్తున్నది. సింగరేణి కార్మికుల కష్టార్జితంతో వచ్చిన లాభాలలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లిస్తున్నది.

2014 నుండి 2023 వరకు 23,446.19 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి 26,207.59కోట్లు కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లించారు. ఒడిశా ప్రభుత్వానికి మరో 12.54కోట్లు మొత్తంగా 49,663. 32కోట్లు పన్నులు చెల్లించారు. ఒక ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న సింగరేణి సంస్థను ఆదుకొనకపోవడమే కాకుండా దాని నుండి ఇంత పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలకు అనేక రాయితీలు కల్పించి ఆదుకుంటున్నారు. తమ సంస్థలపై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారు. ఇదే విధంగా దేశవ్యాప్తంగా కోల్ ఇండియా ఆధీనంలో ఉన్న బొగ్గు ఉత్పత్తి సంస్థలన్నింటిలో అనేక వందల మిలియన్ టన్నుల బొగ్గును కనుగొని ఉన్నారు. 2021 జనవరి నాటికి కోల్ ఇండియా పరిధిలో 666మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిచేసి నిలువ ఉంచారు.



**కార్పొరేట్ మిత్రుల కోసం గనుల అమ్మకాలు**

దేశ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతున్న బొగ్గు గనులను అమ్మకానికి పెట్టాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. దేశ ప్రయోజనాల రీత్యా, ప్రజల ప్రయోజనాల రీత్యా దేశంలో బొగ్గు సంపద ఎన్నో వందల సంవత్సరాల పాటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. అపారమైన బొగ్గు ఉన్నప్పటికీ నూతన గనులకు అనుమతి ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ఆటంకాలు కలిగిస్తున్నది. కేంద్ర ప్రభుత్వరంగంలో ఉన్న బొగ్గుసంస్థలకు నూతన బొగ్గు గనులను తీసేందుకు అనుమతిని ఇవ్వని ఫారెస్టుశాఖ కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్నదే.

ప్రభుత్వరంగంలో ఉన్న బొగ్గు సంస్థ అయిన కోల్ ఇండియాకు అటవీశాఖ అనుమతి ఇవ్వలేకపోతే, ప్రైవేట్ సంస్థలైన అంబానీ, ఆదానీ,అరబిందో తదితరుల ప్రైవేట్ గనుల తవ్వకంకు ఎలా అనుమతి ఇవ్వడం జరుగుతుందనేది ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. కోల్ ఇండియా ఉత్పత్తి చేసిన బొగ్గుకు ధర టన్నుకు మూడు వేల రూపాయలు ఇంతకు మించి రేటు పెంచరాదని ఆంక్షలు పెడుతున్న ప్రభుత్వం మరో ప్రక్కన అదాని బొగ్గును టన్నుకు 30 వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేయాలని విద్యుత్ సంస్థలకు మోడి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందువల్ల దేశంలో ప్రజలు వాడుకునే విద్యుత్తు చార్జీలు ప్రస్తుత రేట్ల కంటే 12 శాతం నుండి 20 శాతం వరకు పెంచుకోవచ్చని విద్యుత్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తున్నది.

**బొగ్గు గనుల అమ్మకాలను మానుకోవాలి**

మోడీ ప్రభుత్వం దేశంలో అత్యంత విలువైన ఖనిజ సంపదగా ఉన్న బొగ్గురంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకునేందుకు సిద్ధపడింది. కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టడం ద్వారా దేశ ప్రయోజనాలు ప్రజల ప్రయోజనాలు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది.

సింగరేణి వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి బొగ్గును కనుగొన్న ప్రాంతంలో ఈ రోజున ఒక్క పైసా ఖర్చు లేకుండా అంబానీ, అదానీ, అరబిందో, వేదాంత తదితర కంపెనీల కు అప్పగించేందుకు సిద్ధపడింది. గత 30 ఏళ్లుగా వరుసగా లాభాల ను సాధించి అందు లో నుండి కార్మికులకు బోనసును ఇస్తున్న సింగరేణికి కొత్త బావులు తీసుకునే అవకాశం లేకుండా చేయడమే కాకుండా ఈ ప్రాంతంలోని నాలుగు బొగ్గు బావులను అమ్మకానికి పెట్టడం టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనాలని నిర్ణయించడం అత్యంత దుర్మార్గమైనది. గతం లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉండగా తాడిచర్ల, పునుకుడు చేలక, పెనుగడప తదితర 7 బొగ్గుబ్లాక్ లను క్యాప్టివ్ మైన్స్ పేరుతో ప్రైవేటీకరణ చేయటానికి నిర్ణయం తీసుకున్నప్పుడు సింగరేణి గనికార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి వెనక్కి నెట్టారు.

**తట్టా సెమ్మాస్ ఎత్తాలి–బొగ్గుగని కార్మికులు భగ్గున మండాలి**

కోలిండియా పరిధిలో 260 బొగ్గుబావులను అమ్మేటందుకు చూస్తున్న మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక చర్యలపై దేశవ్యాప్తంగా బొగ్గుగని కార్మికులు ఉద్యమించాలి. ఇది సింగరేణికి ఒక్క దానికి సంబంధించిన సమస్యగా కాకుండా దేశవ్యాప్త సమస్యగా చూసి అందరిని ఉద్యమంలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు సింగరేణి గనికార్మికు లతో పాటు దేశంలోని కోల్ ఇండియా పరిధిలో ఉన్న అన్ని బొగ్గు సంస్థల కార్మికులను కదిలించి ఉద్యమానికి రూపకల్పన చేయాలి. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులను ఉద్యమానికి సన్నద్ధంచేసే బాధ్యత జాతీయ బొగ్గు గని కార్మిక సంఘాలపై ఉన్నది. ఇందులో ముఖ్యంగా సింగరేణి గుర్తింపు సంఘమైన ఎఐటియుసి, ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఐఎన్టీయుసిలు పూర్తిబాధ్యతగా తీసుకొని బొగ్గుగని కార్మికుల ఆందోళనకు సన్నద్ధం చేయాలి. బొగ్గు గనుల అమ్మకానికి వ్యతిరేకంగా ఇప్పటికే సింగరేణిలో కార్మిక సంఘాలు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నాయి. ఏరియాల వారిగా జనరల్ మేనేజర్ కార్యాలయా ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నారు. అనంతరం సింగరేణి హెడ్ఆఫీసు వద్ద ధర్నా చేయనున్నారు. మరో పక్క కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలను సెంట్రల్ కార్మిక సంఘాల ఆధ్వర్యం లో చేపట్టారు. ఇందులో రాజకీయ పార్టీలు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలిపాయి. కోల్ ఇండియాలో ఉన్న మొత్తం గని కార్మికులను ఉద్యమంలో భాగస్వాములను చేయడం వల్ల తగిన పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# బడ్జెట్‌లో విద్యారంగాన్ని ప్రోత్సహించండి

లేఖ

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వారి ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం బలోపేతం చేయడానికి వారు తీసుకుంటున్న సమీక్షలు, చర్యలు, విశ్లేషణలు అభినందనీయం. ప్రతి ఊరికి, ప్రతి తండాకు ప్రతి ఆవాస ప్రాంతంలో సర్కారు బడి ఉండాలనే ఆశయం, లక్ష్యం గొప్పది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నందుకు రాష్ట్రోపాధ్యాయ సంఘం (STU) ప్రభుత్వానికి అభినందనలు తెలియచేస్తున్నది. అంగన్ వాడి కేంద్రాలను ఆధునీకరించడం, వారికి ప్రైవేటు పాఠశాలలలో మాదిరిగా 'నర్స' విద్యను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగ్గ విషయం. అమ్మ ఆదర్శ కమిటీల ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడానికి నిధులు విడుదల చేయడం, వారితో పాటు, పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడానికి నిధులు విడుదల చేయడం అభినందనీయం. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూసిన ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించి పదోన్నతులు కల్పించడం ఉపాధ్యాయుల తరుపున అభివందనలు తెలియచేస్తున్నాము. నిరుద్యోగులకు 'జాబ్' క్యాలెండర్ ఏర్పాటుచేసి ప్రతి సంవత్సరం రెండు సార్లు 'టెట్ ' నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని నిర్ణయించడం ప్రభుత్వానికి విద్యపై ఉన్న మమకారం గొప్పది. కాని ఎన్నో సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు, బడ్జెట్‌లో విద్యకు సరియైన నిధులు కేటాయించకపోవడం బాధాకరం. విద్యకు ఎక్కువ నిధులు కేటాయించాలని ఎన్ని విద్యాకమిటీలు సూచించినా అది ఆచరణకు నోచుకోవడం లేదు . గత ప్రభుత్వాలు అన్ని అరకొర నిధులనే కేటాయించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014–15 లో మాత్రం బడ్జెట్ లో 10.89%. నిధులు విద్యకు కేటాయించారు. ఆ తరువాత ప్రతి సంవత్సరం దానిని తగ్గించుకుంటూ అది చివరకు 6.5% కు కుదించారు. కావున ఈ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో విద్యకు 30% నిధులు కాకున్నా కనీకం 15% నుంచి 20% వరకు కేటాయిస్తే ప్రభుత్వ విద్య బలపడుతుంది. నిధుల కొరతతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు లేక, స్కావెంజర్లులేక, పారిశుద్ధ్యం లోపించి, విద్యార్థులు అనారోగ్యానికిగురౌతున్నారు.



బాలికలకు ప్రత్యేక మరుగు దొడ్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. త్రాగునీరు సౌకర్యం అభివృద్ధి చేయాలి, డిజిటల్ విద్యను ప్రోత్సహించడానికి నిధులు కావాలి. 'నైట్ వాచ్ మెన్' ల అవసరం ఉంది. మధ్యాహ్న భోజనం నాణ్యతను ఇంకా పెంచాలి, ఉదయం అల్పాహారం కోసం నిధులు మంజూరు చేయాలి.

విద్యార్థులకు బ్యాగ్‌లు, షూస్, బిల్ట్ టైలు, డైరీ వంటివి అందించవలసిన అవసరం ఉంది. అటు కేంద్రప్రభుత్వం కూడ విద్యకు 4% వంటి అరకొర నిధులను మాత్రమే కేటాయిస్తున్నది. ఉచిత విద్యపై కేంద్రానికి చిత్తశుద్ధిలేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వమైనా ఉచిత విద్యను ప్రోత్సహించడానికి, అందించడానికి, రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 15% నుండి 20% విధులు కేటాయించినపుడే ప్రభుత్వవిద్య బ్రతుకుతుంది.



వై. కరుణాకర్ రెడ్డి
9866103202



మేరుగు రాజయ్య
9441440791

# బొగ్గుగని కార్మికుల భద్రతకు చర్యలు అవసరం

రాజ్యాంగంలోని అధికరణం–21ప్రజలకు జీవించే హక్కును కల్పించింది. బొగ్గు గనుల చట్టం 1952, బొగ్గు గనుల నిబంధనలు 2017లు పని స్థలాల్లో భద్రతగా పనిచేయడానికి కార్మికులకు రక్షణ ఏర్పాట్లను కల్పించాలని నొక్కి చెప్పుచున్నవి. కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకంగా చట్టాలను అమలు చేయిం చే అధికారాన్ని ''డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ''(డిజీఎంఎస్)కి ఇచ్చింది. అయినప్పటికీ సింగరేణిలో పరంపరంగా బొగ్గుగని ప్రమాదాల్లో కార్మికులు చనిపోతున్నారు. గతంలో జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్ బాద్ సమీపంలోని ''చస్నాల బొగ్గుబాయిలో 1975 డిసెంబర్ 27న పేలుడుతో పాటుగా వరద నీళ్ల వచ్చి 375 మంది చనిపోయారు. దాదాపు 26 రోజుల పిదప మొదటి శవాన్ని బయట కి తీశారు. క్యాప్ లాంప్, తల టోపికి ఉన్న నంబర్‌తో శవాలను గుర్తించారు. అట్టి ప్రమాద సంఘటనపై న్యాయ విచారణను జరపడానికి పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ నారాయ ణ్ సిన్హాను నియమించారు. అతను తన నివేదికను 1977 మార్చి 24 న సమర్పించారు. అట్టి నివేదిక ఆధారంగా నలుగురు అధికారులను ప్రాసిక్యూట్ చేసి 2012లో తీర్పును వెలువరించారు. అప్పటికి ఇద్దరు అధికారులు చనిపోయారు. ఇక మిగిలిన మేనేజర్ రామానుజ బట్టాచార్య, ఏజెంట్ దీపక్ సర్కార్ కు ఏడాది జైలు శిక్షతో పాటుగా రూ.5 వేలు జరిమానను విధించారు. సింగరేణిలో 2003 జూన్ 16 న జిడికె 7 ఎల్ఇపి(లైఫ్ ఎక్స్ టెన్షన్ ప్రాజెక్ట్)లో బొగ్గు పొరను బద్దలు చేసుకుని ఒక్కసారిగా వచ్చిన నీటి ప్రవాహంలో 17 మంది కార్మికులు చనిపోయారు. జిడికె 8ఎ ఇంక్లైన్ లో 2003 అక్టోబర్ 16 న బొగ్గు పైకప్పు కూలి 10 మంది కార్మికులు చనిపోయారు. అట్టి ప్రమాద సంఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి జస్టిస్ బిలాల్ నజ్కి విచారణ జరిపి ఇచ్చిన నివేదికలపై ఎవరి మీద కూడా కనీస చర్యలు తీసుకోలేదు.

గోదావరిఖని రామగుండం 3 డివిజన్ లోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ 2 లో 2024 జులై 17 న జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు చనిపోయారు. దీనికి ముందురోజు 150 హెచ్.పి ఎలక్ట్రిక్ పంప్ మోటార్ డెలివరీ పైప్ 68 అర్ఎల్ లెవల్ దగ్గర హాలేజీ రోడ్ కింద లీకేజీ అయింది. నీళ్ల లీకేజీని అరికట్టడానికి పైపులైన్ మీద ఉన్న మట్టిని షావెల్‌తో కందకం మాదిరిగా తీసి ప్రక్కన కుప్పపోశారు.ప్రమాదంకు ముందు రోజు కురిసిన వర్షం వలన కుప్పపోసిన మట్టికుప్ప, కందకం సైడ్ వాల్ (కందకం దరి)తడిసి ముద్దయినట్లుంది. ప్రమాదం జరిగిన రోజు సెకండ్ షిఫ్ట్‌లో ఉప్పు ఆంజనేయులు ఫిట్టర్, గాదె విద్యాసాగర్ మరో ఇద్దరు కార్మికులకు పైపులైన్ వాటర్ లీకేజీని అరికట్టేందుకై పురమాయించారు. సాయంత్రం దాదాపు 6 గంటలకు పనిచేస్తున్న నలుగురిపై మట్టి కూలింది. సమ్మయ్య, శ్రీనివాస్ లపై తక్కువగా మట్టి కూలినందున మట్టి తొడి వేసి రక్షించారు. ఉప్పు ఆంజనేయులు, గాదె విద్యాసాగర్ లపై కూలిన మట్టిని తీయడానికి ఆలస్యం అయినందున చనిపోయారు.

ఓపెన్ కాస్ట్ బొగ్గు బావులలో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకునే అవకాశాలు చాల ఉన్నవి. భూమిపై డ్రిల్లింగ్ చేసి బ్లాస్టింగ్ ప్రక్రియతో భూమిని ఒదులు చేసి షావెల్స్ డోజర్స్ బొగ్గుపై ఉన్న మట్టిని, బండరాళ్లను తొలగించి, డంపర్స్ ద్వారా రవాణా చేసి గుట్టలను తలపించే విధంగా కుప్పపోస్తారు. మట్టిని కుప్పపోసే స్థలాలను డంప్‌యార్డ్‌గా పరిగణించుతారు. ఇట్టి డంప్‌యార్డ్‌లు బాహ్యంగా , అంతర్గతంగా ఏర్పాటు చేస్తారు. బొగ్గును తీసిన స్థలాల్లో పోసే మట్టిని ఢీకోల్డ్ లేదా అంతర్గత డంప్ యార్డ్‌గా పరిగణిస్తారు. ఓపెన్ కాస్ట్ బొగ్గు బాయి లోతుకు పోయిన కొలది షావెల్స్, డోజర్స్, డంపర్స్, మొదలగు వాహనాలు ప్రయాణించడానికి బెంచ్ ల వారిగా ఏటావాలుగా బర్మ్ గడ్డల హద్దులతో ''హాల్ రోడ్ల''(మట్టి రోడ్లను)ను ఏర్పాటు చేస్తారు. బొగ్గు బాయి చుట్టూరా సైడ్ వాల్ (దరిని)ను మెట్ల మాదిరిగా మట్టిని తొలగించుచు మట్టిని లోతుగా, గొయ్యిగా తవ్వుతారు. ప్రతి సంవత్సర వర్షాకాలానికి ముందుగానే ప్రణాళిక బద్ధంగా కార్యాచరణను రూపొందించుకోవాలి.

బహుళ సీమ్ బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలను ఏర్పాటు చేసుకోవాలి. వర్షాకాలంలో దిగువ/లోతట్టు సీమ్ నుండి బొగ్గును తీయడం కష్టమవుతుంది. కాబట్టి టాప్ సీమ్ నుండి బొగ్గును వెలికితీసే ఏర్పాట్లు చేసుకోవాలి. బొగ్గును వెలికి తీసే స్థలాలకు/సీమ్ లకు వర్షం నీరు ప్రవహించకుండా మిడ్ వాటర్ సంప్‌లను, పంప్ మోటార్ పైప్ లైన్‌లను, వరద నీటిని దారి మళ్లించే కాలువలను, హాల్ రోడ్లపై నీరు నిలువకుండా, రోడ్లు కోతకు గురికాకుండా డ్రైన్‌లను, కల్వర్ట్ లను ఏర్పాటు చేసుకోవాలి. ప్రధాన బొగ్గు ఉత్పత్తి పనులు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్, లోడింగ్, ట్రాన్స్‌పోర్ట్ పనులతో పాటుగా సైడ్‌వాల్ పై భాగంలో ఏర్పడే పగుళ్లను గమనించాలి. వర్షం కురిసిన పిదప, బ్లాస్టింగ్ పిదప తప్పనిసరిగా తనిఖీలు చేయాలి. సైడ్‌వాల్ లో నిటారుగా ఏర్పడే పగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి.

ఎల్లప్పుడు పనుల నిర్వహణను ప్రణాళిక బద్ధంగా, సరియైన కమ్యూనికేషన్ స్కిల్స్ తో నిర్వహించినట్లయితే ఓపెన్ కాస్ట్ బొగ్గు బావులలో ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉన్నది.

ఓపెన్ కాస్ట్ బొగ్గు బాయిలలో పంప్ సెక్షన్ చాల ముఖ్యమైనది. వర్షాకాలంలో వరద నీటిని, మిగతా కాలాల్లో భూగర్భ (ఊట నీటిని)జలాలను, కిలోమీటర్ల పొడవు,వందల మీటర్ల పొడవు నిటారు పైప్ లైన్‌లతో ఎలక్ట్రిక్ పంప్ మోటార్ ల ద్వారా బయటకు నిరంతరంగా పంపింగ్ చేయాలి.

మైన్స్ ఒకేషనల్ రూల్స్/బొగ్గు గనుల వృత్తి శిక్షణ నిబంధనలు 1986 ప్రకారంగా ప్రతి కార్మికుడికి శిక్షణను ఇవ్వాలి.అలాగే ఎప్పుడు చేస్తున్న వృత్తికి (సెక్షన్ మార్చినప్పుడు)బదులుగా ఇతర విభాగ వృత్తిలో పనిచేయించుకున్నప్పుడు సదరు కార్మికుడికి ''ఛేంజాఫ్ జాబ్'' ట్రైనింగ్‌ను ఇవ్వాలి. ఎలక్ట్రిక్ పంప్ మోటార్‌ను స్థాన భ్రంశం చేసి, పైప్‌లైన్ ను పొడిగించినప్పుడు, కుదించినప్పుడు, లీకేజీని అరికట్టినప్పుడు తప్పకుండా అండర్ మేనేజర్ స్థాయి అధికారి, ఇంజనీర్ పని స్థలంలో ఉండి రక్షణ సూచనలు ఇవ్వాలి. అలాగే పంప్ సెక్షన్‌కు సంబంధించిన పనుల కేటాయింపు, నిర్వర్తించిన పనుల వివరాలు మేనేజర్‌కు కూడా తెలిసి ఉండాలి.

అధికారుల ఒంటెద్దు నిర్ణయాలు, సమీక్షలు, పరిశీలనలు లేకుండానే పనుల కేటాయింపుల వలన, మీరెట్లయినా పనులు చేసి బొగ్గు తీసినోళ్లు కావాలనే తలంపుతో కార్మికులపై చేస్తున్న పనుల ఒత్తిడి వలన, ఉద్దేశ్యపూర్వకమైన నిర్లక్ష్యం వలన సింగరేణిలో ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నారు. ఉప్పు ఆంజనేయులు మిగతా కార్మికులకు కూడా ఛేంజాప్ జాబ్ ట్రైనింగ్ ఇప్పించకుండా పంప్ సెక్షన్‌లో విధులకు నియోగించుకుంటున్నట్లుగా ఆరోపణలు వస్తున్నవి. అండర్ మేనేజర్ స్థాయి పర్యవేక్షణతో కందకం గోతి పగుళ్లను పరిశీలించిన పిదప పైప్ వాటర్ లీకేజీ పనులను కేటాయించినట్లయితే ప్రమాదం జరిగి ఉండేది కాదని పలు సూచనలు వస్తున్నాయి. మేనేజుమెంట్ అంటే మనుషుల నిర్వహణగా, అధికారుల నిర్వహణగా పరిగణించి అధికారులు మానవీయంగా విధుల నిర్వహణను అలవర్చుకోవాలి. అలాగే చట్టాలను అమలు చేయించే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు కూడా సమయానుకూలంగా తనిఖీలు, సమీక్షలు చేసి బొగ్గు గని ప్రమాదాలను నివారించి కార్మికులకు రక్షణగా నిలవాలని, ప్రమాద సంఘటనపై విచారణ జరిపి భాద్యులపై చర్య లు తీసుకుని, మృతులైన ఉప్పు ఆంజనేయులు, గాదె విద్యాసాగర్ కుటుంబాలను ఆర్థికంగా, హార్థికంగా ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

# ఫోర్ వాటర్ ద్వారా నీటిని ఒడిసి పట్టాలి

సుప్రసిద్ధ భారతీయ పర్యావరణవేత్త నీటి సంరక్షణావేత్త అనుపమ్ మిశ్రా అభివృద్ధి చేసిన వినూత్న నీటి నిర్వహణ వ్యూహం 'ఫోర్ వాటర్స్' భావన. ఈ భావన నాలుగు రకాల నీటి వనరుల స్థిరమైన నిర్వహణను నొక్కి చెబుతుంది, ఈ వ్యూహాన్ని మన ఆంధ్రప్రదేశ్ కు చెందిన నీటి పారుదల ఇంజినీర్ శ్రీ హనుమంతరావు విస్తృత ప్రచారం చేశా రు. ముఖ్యంగా కాలానుగుణ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తులో ఉపయోగం కోసం వర్షపు నీటిని సంగ్రహించడం, నిల్వ చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్, ట్యాంకులు కుంటలు తలపిరి చెరువులు వంటి వివిధ పద్ధతుల ద్వారా దీనిని సాధించవచ్చు.

వర్షపు నీటిని మట్టిలోకి చొచ్చుకుపోయేలా చేయడం, జలాశయాల ను తిరిగి నింపడం ద్వారా భూగర్భజల వనరుల ను రీఛార్జ్ చేయడం నిర్వహించడం. చెక్ డ్యామ్‌లు, రీఛార్జ్ వెల్స్ కాంటూర్ ట్రెంచ్‌లను నిర్మించ డం వంటి సాంకేతికతలు భూగర్భ జలాల రీఛార్జ్ ను పెంచడానికి ఉపయోగించబడతాయి. నదులు, సరస్సులు, రిజర్వాయర్‌ల వంటి ఉపరితల నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వా రా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక అవసరాలకు స్థిరమైన నీటి సరఫరాను నిర్ధారించడం. ఇందులో నీటి వనరులను కాలుష్యం నుండి రక్షించడం, నీటి ప్రవాహాన్ని నిర్వహించడం ఆనకట్టలు, ట్యాంకుల వంటి నిల్వ నిర్మాణాలను నిర్మించడం వంటివి ఉంటాయి. మల్చింగ్, కాంటూర్ దున్నడం అడవుల పెంపకం వంటి తగిన భూ నిర్వహణ పద్ధతుల ద్వారా నేల తేమను సంరక్షించడం. ఈ పద్ధతులు నేలలో నీటిని నిలుపుకోవడానికి, వ్యవసా య ఉత్పాదకతను మెరుగుపరచడానికి, నేల కోతను తగ్గించడానికి సహాయపడతాయి. 'ఫోర్ వాటర్స్' భావన నీటి నిర్వహణకు సమగ్ర విధానా న్ని ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా శుష్క మరియు పాక్షికశుష్క ప్రాంతాల్లో కమ్యూనిటీలు, వ్యవసా యం పర్యావరణ వ్యవస్థలలో మద్దతునిచ్చే స్థిరమై న స్థితిస్థాపక నీటి సరఫరా వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోని వెనుకబడిన ప్రాంతాలలో కరువు పీడిత ప్రాంతం అయిన రాయలసీమ, ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో 'ఫోర్ వాటర్స్' భావన కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భావనను అమలు చేయడంలో వర్షపు నీరు, భూగర్భ జలాలు, ఉపరితల జలాలు, నేల తేమను నిర్వహించడానికి సమగ్ర వ్యూహం ఉంటుంది, తద్వారా నీటి లభ్యతను మెరుగుపరచడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించవచ్చు. రెయిన్వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భవిష్యత్ ఉపయోగం కోసం వర్షపు నీటిని సంగ్రహించడం, నిల్వ చేయడం. పైకప్పుపై వర్షపు నీటి నిల్వ వ్యవస్థల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. పైకప్పుల నుండి సేకరించిన వర్షపు నీటిని ట్యాంకులలో నిల్వ చేయవచ్చు లేదా భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడానికి మళ్లించవచ్చు.

కమ్యూనిటీ లెవల్ హార్వెస్టింగ్ ద్వారా వర్షపు నీటి ప్రవాహాన్ని సంగ్రహించడానికి పెద్ద కమ్యూనిటీ ట్యాంకులు లేదా చెరువులను నిర్మించాలి. పొడి కాలంలో ఈ నిర్మాణాలు కీలకమైన నీటి వనరుగా ఉపయోగపడతాయి. కాలానుగుణ ప్రవాహాలు, నదులపై చెక్ డ్యామ్‌లను నిర్మిస్తే తరచుగా మట్టి లేదా కాంక్రీటు అడ్డంకులు నీటి ప్రవాహాన్ని నెమ్మదిస్తాయి, ఇది భూమిలోకి చొచ్చుకుపోయేలా చేస్తుంది. పెర్కొలేషన్ పిట్స్, రీచార్జ్ వెల్స్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చేయడానికి జలాశయాలను తిరిగి నింపడానికి వ్యూహాత్మక ప్రదేశాలలో పెర్కొలేషన్ పిట్స్ రీఛార్జ్ బావులను తవ్వించాలి. ప్రవాహాన్ని తగ్గించడానికి, భూగర్భజలాల రీఛార్జ్‌ను పెంచడానికి వ్యవసాయ భూమిపై కాంటౌర్‌ట్రెంచ్‌లు, బండ్‌లను నిర్మించాలి. సాంప్రదాయ ట్యాంకులు, చెరువులు పునరుద్ధరించాలి.

ఇంటర్‌లింకింగ్ వాటర్ బాడీస్ ద్వారా ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన ట్యాంకులు, చెరువుల నెట్‌వర్క్‌ను రూపొందిస్తే, ఒక ప్రాంతం నుండి మిగులు నీటిని మరొక ప్రాంతానికి మళ్లించడం ద్వారా నీటి కొరత తగ్గుతుంది. వాటర్‌షెడ్ అభివృద్ధి ద్వారా ఉపరితల నీటి లభ్యత నేల సంరక్షణను మెరుగుపరచడానికి వాటర్‌షెడ్‌లను అభివృద్ధి చేయలి. ప్రవాహాలు, కోతను తగ్గించడానికి అటవీ పెంపకం, నేల సంరక్షణ చర్యలు ఇందులో ఉన్నాయి.

వ్యవసాయానికి, నేల కోతను తగ్గించడానికి నేల తేమను నిలుపుకోవాలి. నేల ఉపరితలాన్ని కవర్ చేయడానికి సేంద్రీయ మల్చ్‌లను ఉపయోగిస్తే, తేమను నిలుపుకోవడం లో సహాయపడుతుంది, బాష్పీభవనాన్ని తగ్గిస్తుంది అలాగే నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేల భంగం తగ్గించి నేల తేమను నిలుపుకోవడంలో సహాయపడే పరిరక్షణ సాగు పద్ధతులను రైతులు అనుసరించాలి. అగ్రో ఫారెస్ట్రీ మెరుగుపరుచుకోవాలి, కమ్యూనిటీ ఇన్వాల్వ్‌మెంట్, కెపాసిటీ బిల్డింగ్, రైతులు, స్థానిక నివాసితులకు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, నేల తేమ సంరక్షణ పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించినప్పుడే వ్యవసాయం మనుగడ, సాగునీరు, తాగునీరు ఎద్దడిని నిర్మూలించవచ్చు.

డా ఎం సురేష్ బాబు,
అధ్యక్షుడు, ప్రజాసైన్స్ వేదిక

# కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం సాధ్యం

## దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/చింతపల్లి :** కాంగ్రెస్ పార్టీతోనే రైతు రాజ్యం సాధ్యమనేది మరోసారి రుజువయిందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. రైతురుణ మాఫీ సంబురం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వందలాది మంది రైతులు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ పాల్గొని ప్రసంగిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతులను రుణవిముక్తులను చేయడంలో తెలంగాణ ప్రభుత్వం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రుణమాఫీ చేయడంతో సన్న, చిన్నకారు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. గ్రామాల్లో నేడు ఏ రైతు నోటి వెంటకూడా రుణమాఫీ గురించే చర్చించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. దశల వారీగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, మాజీ ఎంపిపి కొండూరు భవాని పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, ఎరుకల వెంకటయ్యగౌడ్, భాస్కర్, నర్సిరెడ్డి, శతృజ్ఞరాజు, నర్సింహ్మ, గిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను నాటి పరిరక్షించాలి

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పర్యావరక్షణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పరిరక్షించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రారంభం అయ్యాక రానున్న రోజుల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున భవిష్యత్తులో నియోజకవర్గంలో వేసవిలో ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ప్రతి ఒక్కరు మొక్కలను నాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమీషనర్ యూసుఫ్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, కోశాధికారి చిల్లంచర్ల శ్రీనివాస్, మాశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలి

## ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** శాతవాహన యూనివర్సిటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ కమిటీ వేయడాన్ని ఏఐఎస్‌ఎఫ్ పక్షాన స్వాగతిస్తున్నామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీలో పరీక్ష పత్రాల టెండర్‌లో అవకతవకలు, రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి ఇష్టానుసార నియామకాలు, ఉద్యోగ ప్రమోషన్లలో, కొత్త భవనాల నిర్మాణంలో, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో పూర్తి అవకతవకలు జరిగాయని, గతంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అనేక సార్లు యూనివర్సిటీ ముందు ధర్నా, పై అధికారులకు విన్నవించగా నేడు విజిలెన్స్‌తో విచారణకు ఆదేశించడం సరైనదేనన్నారు. ఈ విచారణ జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి విచారణ చేసి యూనివర్సిటీ సొమ్ము తిన్న అధికారులను, సహకరించిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** ఎన్నికల్లో సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు.శుక్రవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో జరిగిన బిజెపి పట్టణ కార్యవర్గ సమావేశం లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలోమొత్తం423 హామీలు ఉన్నాయని ఇందులో మహిళలకు స్కూటీలు, నిరుద్యోగ భృతి,గృహలక్ష్మి గురించి మరచిపోయిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను మభ్య పెట్టడానికి సంబరాలు చేస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ పూర్తి చేయకుండానే సంబరాలు చేసి రైతులకు రైతు బంధు కోత పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్,మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర,మైనార్టీ మో ర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి అబిద్, జిల్లా కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పేర్వాల లక్ష్మ ణ్‌రావు,జిల్లా అధికార ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థికి చేయూత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉన్నత విద్య కోసం తపన పడుతున్న నిరుపేద విద్యార్థికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయూతగా నిలిచింది. మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన అడారి వినయ్ కోల్‌కత్తా నీట్‌లో మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య విద్యార్థికి ఆర్థిక చేయూతనిచ్చారు. శుక్రవారం ట్రస్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థికి రూ. 20వేల చెక్కును ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మనువరాలు కుంచకురి పోశ్యసాయి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. తన వంతుగా సమాజ సేవలో భాగం కావాలని సూచించారు. పరిశ ఝాన్సీ కుమారి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు జలకళ

- వరుస వర్షాలతో నిండుతున్న జలాశయాలు
- ఎగువ నుండి ప్రియదర్శిని జూరాలప్రాజెక్టుకు వరద
- ఇటు భద్రాచలం వద్ద 26 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- మేడిగడ్డ బ్యారేజీకి భారీగా జల సంపద
- హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌కు 513.21 అడుగులకు వరదనీరు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :**రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ముఖ్యంగా విస్తృతంగా కురుస్తున్న వర్షాలకు చెరువులు,కుంటలు, వాగులు వంకలు నిండుకుండలా మారాయి. ఈ భారీ వర్షాలతో తెలంగాణలోని పలు ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు, భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరగడంతో నీటి మట్టం 26 అడుగులకు చేరింది. గురువారం 20 అడుగులు ఉండగా ప్రస్తుతం 26 అడుగులకు చేరుకుంది. ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.రాష్ట్రంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తుతోంది. తెలంగాణ ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీరాంసాగర్ (ఎస్ఆర్‌ఎస్‌పి) ప్రాజెక్టులోకి 21వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతనీటి మట్టం 1,065 అడుగులుగా ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 20 వేలు, ఔట్ ఫ్లో 22,877 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 4.951 టిఎంసిలుగా ఉంది. అటు భద్రాచలం వద్ద గోదారి ప్రవాహం పెరుగుతుండడంతో చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరద వస్తోంది. ఎగువన వస్తున్న ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి 59 వేల 330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దుమ్ముగూడెం మండలంలోని సీత వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి స్నాన ఘట్టాల వరకు నీరు చేరింది.

**ప్రాజెక్టుల వారీగా పరిస్థితి ఇదీ :** ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు మొదలు కొని నిజామాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు భారీ వరద చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1065.7 అడుగులుగా ఉంది. మొత్తం నీటినిల్వ సామర్థ్యం 16.405 టిఎంసిలు అయితే అయితే వరద నీరు చేరినందుకు 80.5 టిఎంసిలుగా ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద జలకళ ఉట్టిపడుతోంది. ఈ త్రివేణి సంగమం వద్ద ఉద్ధృతంగా గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం త్రివేణి సంగమం వద్ద 7 మీటర్ల పైగా ఎత్తులో వరద కొనసాగుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది.గురు, శుక్రవారాల్లో రెండు రోజుల్లోనే 22,877 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం నీటి మట్టం 315.850 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సామర్థ్యం 9.657 టిఎంసిలు ఉండగా శుక్రవారం ఉదయానికి 4.951 టిఎంసిలకు చేరింది.

**మేడిగడ్డ బ్యారేజీకి వరద :** మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద పెరుగుతోంది. ఎండాకాలం నుండి పలు సమస్యలను ఎదుర్కొంటున్న మేడిగడ్డ ప్రస్తుతం నీటి ప్రవాహంతో కళకళ లాడనుంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం 1,93,550 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టుల పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. నీటి మట్టం ప్రస్తుతం 513.21 అడుగులకు చేరింది. అటు సంగారెడ్డిని బాగారెడ్డి సింగూరుకు వరద నీరు స్వల్పంగా చేరుతోంది. 749క్యూసెక్కుల వరదవస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 29.917 టిఎంసిలు అయితే ప్రస్తుతం నీటిమట్టం 13.586 టిఎంసిలుగా ఉండడం విశేషం.

### అధికారులు..అప్రమత్తంగా ఉండాలి

* ఈఎన్‌సి అనిల్ కుమార్ ఆదేశం

రానున్న 48 గంటలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న హైదరాబాద్ వాతావరణ శాఖా చేసిన సూచనల మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖా ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (ఈఎన్‌సి) జి.అనిల్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల శాఖాధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. శుక్రవారం ఉదయం నుండి ఆయన ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను ఈఎన్‌సి, చీఫ్ ఇంజనీర్లు, యస్.ఇ అండ్ ఇ.ఇ లతో మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలపై పలు ఆదేశాలు జారీ చేశారు. భద్రా ద్రి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోనూ వరద ప్రవాహం పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు విపత్తు నిర్వహణ బృందాలతో సమన్వయం చేసుకుంటూనే భద్రతా చర్యల పట్ల ప్రజలను అప్రమత్తం చేయ్యాలన్నారు. రిజర్వాయర్లు, కాలువలు, నీటి మట్టాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తూనే స్పిల్ వే లు, వరద గేట్లు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎటువంటి నష్టం వాటిల్ల కుండా అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఈఎన్‌సి అనిల్ కుమార్ ఆదేశించారు. అదే సమయంలో నీటి మట్టాలు, ప్రవాహం ఉధృతి ఎప్పటికప్పుడు సమగ్ర స మాచారం తెలుసుకోవాలని ఆయన సూచించారు. అంతే గాకుండా అత్యాయక పరిస్థితుల సమాచారం అప్పటికప్పుడే కంట్రోల్ రూమ్ కు అందించాలని ఇ.ఎన్.సి అనిల్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# నమ్మకానికి మారుపేరు సుధాబ్యాంక్

## చైర్మన్ మీలా మహదేవ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలోని సుధా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుకు 25వ వాటదారుల సర్వసభ్య సమావేశం స్థానిక త్రివేణి గార్డెన్‌లో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో బ్యాంక్ వాటదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ మాట్లాడుతూ 25 సంవత్సరాల నుండి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుధాబ్యాంక్ కష్టమర్లకు నమ్మకమైన సేవలను అందిస్తుందని అన్నారు. స్వర్గీయ మీలా సత్యనారాయణ స్థాపించిన సుధా బ్యాంక్ ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి సంవత్సరం లాభాలతో షేర్ హోల్డర్లకు, డివిడెండ్లు చెల్లిస్తు oదన్నారు. కాలానుగుణంగా వస్తున్న ఆధునిక టెక్నాలజీని కష్టమర్లకు అందుబాటులోకి తీసుకవస్తుందని, ఎటిఎంలతో పాటు, యూపిఐ సేవలను అందిస్తుందని అన్నారు. సైబర్ సెక్యూరిటితో కష్టమర్లకు భద్రతను కల్పిస్తుందన్నారు. బ్యాంక్ ఎండి పెద్ది రెడ్డి గణేష్ మాట్లాడుతూ డిపాజిట్ల సేకరణతో పాటు రుణాల వసూల్లో కూడా బ్యాంక్ మంచి స్థాయిలో ఉందన్నారు. రిజర్వ్ బ్యాంకు నియమించిన ఆడిటర్లచే జరిపిన ఆడిట్‌లో బ్యాంక్ ఏ గ్రేడ్ సాధించిందని ఈ సందర్భంగా వారు తెలియ జేశారు. రిజర్వ్ బ్యాంకు నియామాల ప్రకారం బ్యాంక్ నిరర్ధక ఆస్తులు ఉన్నాయన్నారు. ప్రస్తుత సంవత్సరంలో వాటదా రులకు 20శాతం డివిడెండ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పొనుగోటి నిర్మల, డైరెక్టర్లు కక్కిరేణి చంద్ర శేఖర్, భువనగిరి భాస్కర్, ఏపూరి శ్రావణ్‌కుమార్, మీలా సందీప్, కమాలకర్, శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు పాదర్శకంగా పనిచేయాలి

## కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** జిల్లాలోని అధికారులందరూ పారదర్శకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.శుక్రవారం ఎన్నెస్పీ కెనాల్, మునగాల రెగ్యూలేటర్, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించారు. అనంతరం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎంపిడివో కార్యాలయంలో నీటిపారుదల,పురపాలక,రెవిన్యూశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెల చివరి నాటికి ఎన్నెస్పీ కెనాల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ప్రతిపాదించిన నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో నీటిపారుదలశాఖ పరిధిలో జరుగుతున్న పనులను, పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. జరుగుతున్న పనులు వేగంగా, నాణ్య తతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. మున్సిపాలిటీలలో ట్యాక్స్ కలెక్షన్ వేగం పెంచాలని సూచించారు. టియూఎఫ్ఐడిసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని చెప్పారు.ఆర్డీవో కార్యాలయంలో అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.పారిశుద్ధ్యంపై మున్సిపల్,శానిటేషన్ అధికారులతో చర్చించి ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత కాపాడేలా శానిటైజేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేష్ ఎస్ఈ నర్సింహారావు,తహసీల్ధార్ నాగార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ఇంచార్జి ఎంపిడివో గిరిధర్, డిఈలు రమాకాంత్, భిక్షం, రఘు, స్వామి,అమరేందర్, డిపివో శివ, మేనేజర్ యాకూబ్‌పాషా, మున్సిపల్ ఏఈ మీరా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించిన కలెక్టర్





* హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/ హాలియా:** జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీలతో అధికారులను హాడలెత్తిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విధుల్లో నిర్లక్ష్యం వహించి విధులకు గైర్హాజరైన హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసి స్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసి తన మార్కు పాలనను చూపించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి శుక్రవారం హాలియా మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు. ఇందులో ముందుగా హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ ప్రాథమిక కేంద్రంలో సిబ్బంది వివరాలు తెలుసుకొని ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ ఎందుకు రాలేదని సమాచారం ఇచ్చారా అని వైద్యాధికారిని అడిగారు. ఆయన నుంచి సరైన సమాధానం లేకపోవడంతో కలెక్టర్ నారాయణ రెడ్డి విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వైద్యం కోసం వచ్చే ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ఉన్నందున ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్య సేవలు సరైన సమయంలో అందించాలని సూచించారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలను భర్తీ చేయాలి

## ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయ పరిధిలోని ఎన్ హెచ్‌ఎం ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. ఈ యేడాది ఫిబ్రవరి 27న ఎన్‌హెచ్‌ఎం కింద 8 రకాల వివిధ పోస్టులకు కరీంనగర్ జిల్లా వైద్యశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని, దీనికి సంబంధించిన ప్రొవిజినల్ లిస్టును 2024 మార్చి 13న ప్రకటించారని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా మెరిట్ లిస్టును ప్రకటించలేదన్నారు. ఎన్నికల అనంతరం 2024 జూన్13న ప్రొవిజినల్ మెరిట్ లిస్టును ప్రకటించారని పేర్కొ న్నారు. ఇతర జిల్లాల్లో మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపా లపల్లి జిల్లాల్లో ఉద్యోగుల భర్తీని పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య శాఖ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఉద్యోగాలను బేరానికి పెట్టి అమ్మకుంటున్నట్లు చర్చలు జరు గుతున్నాయని ఆరోపించారు. అధికా రులు కాలయాపన చేయకుండా ఉద్యోగులను ఎన్ఎచ్ఎం గైడ్‌లైన్స్ ప్రకారం అర్హులందరికీ మెరిట్, వ యస్సు ఆధారంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరు ద్యోగుల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

# సమాజస్థాపన సిపిఐ లక్ష్యం

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** ఆర్థిక అసమానతలు లేని సమాజ స్థాపన సిపిఐ లక్ష్యమని, ఎర్రజె ండా పేద ప్రజల ప్రాణవాయువు అని సిపిఐ జి ల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సిపిఐ నేరేడుచర్ల,పాలకవీడు మండలాల కౌన్సిల్ సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఇచ్చిన భూ మిపై అందరికి హక్కు ఉండాలని, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు పేదప్రజల దరిచేరకుండా బూర్జువా పార్టీల నేతలు తన్నుకుపోతున్నారన్నారు.దేశ సంపద కేవలం 10శాతం మంది వద్ద ఉండి పోతున్నదని కేంద్రంలో గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం పెట్టుబడివర్గాలకు తొత్తులుగా మారి దేశ సంపదను అంబానీ,ఆదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్నారన్నారు. వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారని, దేశంలో నిరుద్యోగసమస్య పోవాలన్నా, దేశ ప్రజలందరికి ఉచిత విద్య, వైద్యం, న్యాయం కావాలంటే ఎర్రజెండా నాయ కత్వంలోకి నూతన యువత రావాలన్నారు. ఎర్రజెండా నాయకత్వం లోనియువకులు,విద్యార్థులు, మహిళలు, రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాడితేనే అంతిమ విజయం కమ్యూనిస్టులదేనని ఆయన అన్నారు. సమావేశానికి రావుల సత్యం అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు,సిపిఐ మండల,పట్టణ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి,కత్తి శ్రీనివాసరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటియూసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న, సిపిఐ నాయకులు ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవిందుగౌడ్, కటికోటల వెంకన్న, కొండ అంజయ్య, బొల్లం అశోక్,నీలం రాంబాబు, అయిల నాగేశ్వరరావు, సోమగాని వెంకటేశ్వర్లు, నూతనగంటి నరసమ్మ,రావిరాల భ్రమరాంబ, మంగ,అరుణ పాల్గొన్నారు.

**మునగాల:** ప్రజా సమస్యల పరిష్కా రం ప్రజా ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మున గాల పరగాణ చరిత్ర మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంక టేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చిల్లంచర్ల రఘునాధ స్మారక భవనంలో జరిగిన సిపిఐ విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలు ఉన్నంత కాలం కమ్యూ నిజం సజీవంగా జీవిస్తూందని గుర్తు చేశారు. ప్రభుత్వం రైతు రుణమాఫి రెండు లక్షలు తెల్లరేషన్ కార్డు అనే ఆంక్షలు లేకుండా అందించాలన్నారు. రైతులు ఆందోళనలు చేయకుండానే ప్రభుత్వం తగిన భరోసా ఇవ్వాలన్నారు.

# చైతన్య కరదీపికలు నారాయణపురం ప్రజలు

## - సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు) :** కమ్యూనిజ చైతన్య కరదీపికలు నారాయణపురం ప్రజలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురంలో నిర్వహించిన సిపిఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతవాసుల పాత్ర చిరస్మరణీ యమైందన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టు నాయకులు,కార్యకర్తలు ఈ ప్రాంతంలో పాలు పంచుకున్నారన్నారు.దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా బూర్జువా రాజకీయ పార్టీలు,నాయకులు చరిత్రను వక్రీకరించి సాయుధ పోరాటాన్ని తక్కువగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేదలప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటంలో ఎంతో మంది కమ్యూనిస్టు నాయకులు,కార్యకర్తలు అమరులైన విషయాన్ని గుర్తు చేశారు.దేశస్వాతంత్ర్య పోరాటంలో,ప్రజల కోసం జరిగిన ఉద్యమాలలో పాల్గొనని రాజకీయ పార్టీలు,నాయకులు ఈరోజు ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. దేశంలో నేటికి సంపద అతి కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైనదన్న విషయా న్ని మరవరాదన్నారు. అభివృద్ధి అని మాటలు చెప్తున్న నాయకులు పేదరికం,నిరుద్యోగిత, ఆకలి చావులకు కారణాలు ఏం చెప్తారని ప్రశ్నించారు.పేద ప్రజలు ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని సామాన్యుల సమస్యలపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గసభ్యులు మందవ వెంకటేశ్వర్లు,జిల్లా గీతపనివారల సంఘం కార్యదర్శి కొండా కోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, జెర్రిపోతుల గూడెం మాజీ సర్పంచ్ నంద్యాల రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి కందుకూరి వెంకటి,శాఖ కార్యదర్శి మీసాల శ్రీను, మండల కార్యవర్గసభ్యులు కీసర కొం డలు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కిన అవినీతి చేప



**ప్రజాపక్షం/ సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో అవినీతి నిరోధకశాఖ అధికారులకు ఒకఅవినీతి చేప చిక్కిం ది.జిల్లా మత్స్యశాఖ అధికారి టాగూ ర్ రూపేందర్‌సింగ్ ఒక చేప సొ సైటీ సభ్యుడి నుండి 25వేల లం చం తీసుకుంటుండగా నల్లగొండ ఏసిబి డిఎస్ పి జగదీశ్ చందర్ ఆధ్వర్యంలో ఏసిబి అధికారులు రెడ్ హ్యా ండెడ్‌గా పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కేం ద్రంలో గల చెరువులలో చేపలు పట్టుకొనుటకు సొసైటీకి అనుమతి ఇవ్వాల్సిందిగా సొసైటీ సభ్యులు జిల్లా మత్స్యశాఖ అధికారికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఫిషింగ్‌కి అనుమతి ఇవ్వకుండా రూపేందర్‌సింగ్ గత కొన్ని రోజులుగా సొసైటీ సభ్యులు తిప్పుతున్నాడు.25వేల లంచం ఇస్తేనే ఫిషింగ్ ఆర్డర్ ఇస్తానంటూ చెప్పటంతో సొసైటీ సభ్యులు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు శుక్రవారం ఉదయం రూ.25వేలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కి తరలించారు.

# ఉక్కు, హోదాల కోసం పోరు

దళితులను మోసం చేసిన కెసిఆర్

సీనియర్ కాంగ్రెస్, మాజీ ఎంపి వి.హన్మంతరావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తున్నాం.. త్వరలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపి వి.హన్మంత్‌రావు అన్నారు. కొంత మంది రైతులకు ఆధార్‌కార్డు అప్‌డేట్ కాకపోవటం వల్ల రుణమాఫీ కాలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రుణమాఫీ కాని అర్హులైన రైతును గుర్తించి వారికి రుణమాఫీ అయ్యేలా చూడాలన్నారు. ఆగస్టు 15 లోగా రెండు లక్షల రుణ మాఫీ ఖచ్చితంగా చేస్తామని విహెచ్ స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు యుపిఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ ఉన్నప్పుడు 70వేల కోట్ల రూపాయలను రైతుల కోసం మాఫీ చేసినట్లు తెలిపారు. కెసిఆర్ దళిత సిఎం చేస్తానని చెప్పి దళితులను మోసం చేసినట్లు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బట్టి విక్రమార్కను డిప్యూటి సిఎం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పదేండ్ల కాలంలో ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని. తాను వచ్చిన ఏడు నెలల్లో ఉద్యోగాల భర్తీని మొదలు పెట్టినట్లు తెలిపారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చినప్పుడే ఆ పార్టీ పని ఖతమైందన్నారు. వద్దన్న వినకుండ కెసిఆర్ పేరు కోసం ప్రాజెక్టులను కట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఆ ప్రాజెక్టులు అన్ని ఇప్పుడు నేలలోకి కూరుకపోతున్నాయన్నారు. అప్పట్లో ప్రగతి భవన్ సెక్రటేరియట్‌కు ఎవ్వర్ని రానిచ్చేవారు కాదన్నారు. తమ ప్రజాపాలనలో అందరికి అనుమతి ఉందన్నారు. కేంద్రంలో మోడీకూడ రెండు కోట్ల ఉద్యోగాల పేరిట జనాలను మోసం చేశారన్నారు. 25కోట్ల మందికి సహాయం చేశానని చెప్పుకుంటున్న మోడీ ఎవరికి చేశారో బయట పెట్టాలన్నారు. ఆంధ్రాలో విశాఖ ఉక్కు కోసం మేం పోరాడుతాం.. ప్రత్యేక హోదా కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. ఆనంతరం మాజీ ఎంపి హన్మంత్ రావును సిద్దిపేట కాంగ్రెస్ నాయకులుసన్మానించారు. సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడుఅత్తుఇమామ్, నాయకులు రాజబహదూర్‌రెడ్డి, కలీమోద్దీన్, గుర్రం అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద శుక్రవారం గోదావరి ఉధృత రూపం దాల్చి ప్రవహిస్తోంది. రాష్ట్రంలో అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి చేరుతున్న వరద ఉధృతితో పాటు ప్రాణహిత వరద తాకిడి పెరిగి గోదావరి నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. పుష్కర్ ఘాట్ తీరం వద్ద వరద నీరు స్నాన ఘట్టాలను ముంచెత్తగా గోదావరి పుష్కర ఘాట్ తీరం వద్ద శుక్రవారం సాయంత్రం వరకు నీటిమట్టం 8.320 మీటర్ల ఎత్తుకు చేరుకుని ప్రవహిస్తుంది. గోదావరి వరద ఉధృతి భారీగా పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## ముంపు ప్రాంతాల పరిశీలన



**ప్రజాపక్షం/వాజేడు:** వాజేడు మండలంలోని ముంపు ప్రాంతాలను ములుగు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం సందర్శించారు. తెలంగాణ, ఛత్తీస్‌గడ్ సరిహద్దు ప్రాంతమైన 163వ జాతీయ రహదారిపై గోదావరి వరదల కారణంగా ముంపుకు గురై రహదారిని పరిశీలించారు. అనంతరం గుమ్మడిదొడ్డి ప్రభుత్వ పాఠశాలను ముంపు ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అలాగే వాజేడు మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గుమ్మడిదొడ్డి, కొంగల గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మలేరియా బారిన పడ్డ వారికి తగిన వైద్యం అందేలా చర్యలు చేపట్టి ముంపు ప్రాంతాలలో శానిటేషన్ చేపట్టాలని మలేరియా బారిన పడ్డ వారికి తగిన వైద్యం అందేలా చర్యలు చేపట్టి ముంపు ప్రాంతాలలో శానిటేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం బొమ్మనపల్లి ఏడ్జెర్లపల్లి గ్రామాల్లో పర్యటించి భారీ వర్షాల వలన ముంపు ప్రాంతాలలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని అధికారులకు చెప్పారు. అదనపు కలెక్టర్ వెంట మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఓ విజయ, ఎంపిఓ శ్రీకాంత్, డిటి రాహుల్ చంద్ర వర్మ, ఆర్ఐ కుమారస్వామి, సత్యేంద్ర, తదితరులు ఉన్నారు.

## అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** అధికారులు నిబద్ధతతో పనిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆరు మండలాల ఎంపిడిఓలు, ఎంపిలు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులతో తెలంగాణ పంచాయితీరాజ్ యాక్ట్ 2018పై శిక్షణ కార్యక్రమం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారు వయసుకు తగిన ఎత్తు, బరువు, కొలతలను, కేంద్రాలకు వచ్చే పప్పు, గుడ్లు తదితర ఆహార సరుకుల్ని పరిశీలించాలని సూచించారు. ప్రతి గురువారం పాఠశాలలను తనిఖీ సందర్శించాలని, మద్యాహ్న భోజన పథకంపై ఆరా తీయాలని, విద్యార్థులకు అందించే ఆహారం, మెనూ ప్రకారం అందిసున్న విధానం, వంట గదిలో పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. జడ్పి సిఈఓ అనిల్‌కుమార్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## సిసిరోడ్డు తనిఖీ



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లి పార్శికుంట కట్ట సీసీ రోడ్డును క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం తనిఖీ చేసింది. నాణ్యత లోపంతో, నిబంధనలు పాటించకుండా సీసీ రోడ్డు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారనే ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డిఈ శ్రీకాంత్, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విజయరాజ్ లు సిసి రోడ్డు నిర్మాణ శాంపిల్స్ సేకరించారు. కాగా తాము సేకరించి సీసీ రోడ్డు శాంపిల్స్ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

## గంగదేవిపల్లిలో ఐదు దేశాల ప్రతినిధులు



**ప్రజాపక్షం/గీసుకొండ:** గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గంగదేవిపల్లి గ్రామాన్ని ఇటలీ, సిసిలియా, ఏరిత్రియా, లితీజ, అనుమ్యూల్ దేశాలకు సంబంధించిన ప్రతినిధుల బృందం సభ్యులు గంగదేవిపల్లి గ్రామాభివృద్ధిని పరిశీలించారు. క్యాథలిక్ యూనివర్సిటీ, ఇందిగాంధీ నేషనల్ యూనివర్సిటీ నుంచి వచ్చిన సభ్యులకు మాజీ సర్పంచ్ రాజమౌళి గ్రామం జాతీయ ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చెందిన తీరు తెన్నులను సభ్యులకు వివరించారు. గ్రామంలో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం, అక్షరాస్యత, బిల్లుల చెల్లింపులు, స్వయం సహాయక సంఘాల పనితీరు, గ్రామాభివృద్ధి గురించి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** నిషేధిత గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో మండల కేంద్రంలో హనుమాన్ పాన్ షాప్‌లో తనిఖీలు నిర్వహించగా రూ.2200 విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనపరుచుకున్నామని ఎస్ఐ అయ్యాల శ్వేత తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బానోతు అనిల్ (24) సోమ్లు తండాకు చెందిన వ్యక్తి ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అమ్ముతున్నందున వారిపై కేసు నమోదుచేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి నెక్కొండ మండలంలోని మారుమూల గ్రామాలలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని బొల్లికొండ, నెక్కొండ లోని ప్రాథమిక వైద్యశాల,అలాగే అప్పారావుపేట పాఠశాల అంగన్‌వాడీ సెంటర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లు తనిఖీ చేశారు. కలెక్టర్ అధికారులతోమాట్లాడుతూపాఠశాలలకు అంగన్‌వాడీ సెంటర్లకు మౌళిక వసతులు కల్పించాలని, పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. తోపనపల్లి రైతు వేదికలో మహిళా సంఘాల సమావేశానికి హాజరై వారి పొదుపు తీరును పరిశీలించారు. ఆర్థికంగా మహిళలు ఎదగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాధుల నివారణకు ప్రతి కుటుంబంలో మహిళే కీలక పాత్ర పోషించాలని ఆమె సూచించారు.

# పనిచేస్తున్న చోటే చోరీ.. దొంగ అరెస్టు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** బంగారం కరిగించే షాపులో నమ్మకం అనే ముసుగులో పని చేస్తూ అదును చూసి భారీ మొత్తంలో బంగారన్ని చోరీ చేసిన ఘరానాదొంగను సిసిఎస్, మట్వాడా పోలీసులు కలిసి అరెస్టు చేశారు. దొంగ నుండి 52 లక్షల విలువగల 700 గ్రాముల బంగారు బిస్కెట్లతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారంవిలేకరుల సమావేశంలో కమిషనర్‌అంబర్‌కిశోర్‌ఝా మాట్లాడుతూ మహారాష్ట్ర సాంగ్లీ జిల్లా ,సాల్సింగే తాలుక, భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన 30 సంవత్సరాల సురేష్ లక్ష్మ న్‌బాద్ ఒంటరిగా జీవిస్తూ బంగారం వ్యాపారం నిర్వహిస్తుండేవాడని, వచ్చే అదాయంతో నిందితుడు తాగుడు, సట్టా, మట్కా లాంటి జూదాలకు బానిసగా మారి అప్పుల పాలైనాడని, కొద్దిరోజులుఉపాధికోసం ప్రయత్నించగా ఉపాధి దొరకకపోవడంతోస్వంతంగా పిజ్జా వ్యాపారాన్ని కొద్దిరోజులునిర్వహించిజల్సాలకారణంగా నిందితుడు మరోమారు వ్యాపారంలో నష్టపోయాడన్నారు. తాను చేసిన అప్పులు తీర్చాలంటే ఎదైనా బంగారం దుకాణంలో కొద్ది రోజులు నమ్మకంగా పనిచేసి అదును చూసి షాపులలో పెద్ద మొత్తంలో చోరీచేసిదానిని అమ్మగా వచ్చే డబ్బుతో అప్పులు తీర్చి జల్సాలు చేయాలని నిందితుడు నిర్ణయించుకున్నాడన్నారు. ఇందులో బాగంగా తనుకు పరిచయస్తుడి ద్వారా వరంగల్ నగరంలోని విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించేబట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న సంజయ్ వద్ద నిందితుడు గత మే 24న పనిలో చేరాడని, కొద్దిరోజులు నిందితుడు నమ్మకంతో పనిచేస్తూ దుకాణ యజమానిని నమ్మకస్తుడిగా మారడంతో బట్టి దుకాణం యజమాని సంజయ్ నిందితుడిపై నమ్మకంతో షాపు తాళాలు ఇచ్చి బయటికి వెళ్ళేవాడన్నారు. ఈక్రమంలో నిందితుడు పనిచేస్తున్న దుకాణంలో కరిగించేందుకు పెద్ద మొత్తంలో బంగారం షాపులోకి రావడంతోనిందితుడు షాపులో వున్న బంగారాన్ని చోరీ చేసేందుకు సిద్దపడ్డాడు. గత నెల 14న షాపు యజమాని సంజయ్ పనిపై బయటకి వెళ్ళడంతో నిందితుడు షాపులోని సిసి కెమెరాలను అపివేసి దుకాణంలో వున్న ఎనిమిది వందల గ్రాముల బంగారాన్ని చోరీ చేసిఅక్కడి నుండి పారిపోయినట్లు సిపి వివరించారు. జరిగిప దొంగతనంపై షాపు యజమాని ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి సెంట్రల్ జోన్ డిపిని షేక్ సలీమా, అదనపు డిసిపి రవి ఆధ్వర్యంలో సిసిఎస్,మట్వాడా ఇన్స్‌పెక్టర్‌తో దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.టెక్నాలజీ వినియోగించుకోని నిందితుడి కదలికలపై నిఘా కొనసాగించారు. నిందితుడు చోరీ సోత్తును అమ్మేందుకు జూలై18న సికింద్రబాద్ నుండి విజయవాడకు రైలులో ప్రయాణిస్తున్నట్లుగా సమాచారం రావడంతో గురువారం సాయంత్రం 6.30 గంటలకు వరంగల్ రైల్వే స్టేషనలో ప్లాట్‌ఫారంపై మంచి నీటి బాటిల్ కోనుగోలు చేస్తూండగా పోలీసులు నిందితుడిని అదుపులోకితీసుకొని తనీఖీ చేయగా చోరీ సోత్తును గుర్తించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని సకాలంలో పట్టుకుని బంగారాన్ని స్వాదీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ డిసిపి షేక్ సలీమా, సిసిఎస్, మట్వాడా సిఐలు అబ్బయ్య,గోపి, ఏఏఓ సల్మాన్‌పాషా, మట్వాడా క్రైమ్ ఎస్ఐ విఠల్, ఏఎస్ఐ శివకుమార్‌చ హెడ్‌కానిస్టేబుళ్లు నజీం పాషా, అహ్మద్‌చ జంపయ్య, కానిస్టేబుళ్లు మధుకర్‌చ చంద్రశేఖర్, ఐటి కోర్ సిబ్బంది ప్రవీణ్, నగేష్ లను కమిషనర్ అభినందించారు.

# అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** నాగల్ గిద్ద పోలీస్ అవుట్ పోస్ట్‌ను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించారు. వీరు నారాయణ ఖేడ్ సబ్‌డివిజన్ పోలీసు అదికారులతో రివ్యు మీటింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నాగల్ గిద్ద పోలీసు అవుట్ పోస్ట్ నందు విధులు నిర్వహించే సిబ్బందిక పూర్తి రక్షణతో పాటు అన్ని రకాల వసతులు ఉండే విధంగా ఆధునీకరించడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగాఉండాలన్నారు. అనంతరం డిఎస్పీ కార్యాలయం నందు సభ్ డివిజన్ పోలీసు అధికారులతో మాట్లాడుతూ సభ్‌డివిజన్ పరిదిలో ఉన్నటువంటి హిస్టరీ ఫీటర్లు అయిన రౌడీ కడీలు, సస్పెక్ట ల కదలికలను వారి జీవన విదానాన్ని పరిశీలించాలని సూచించారు. యాక్టీవ్‌గా ఉన్న వారు కార్యకలాపాలు చేస్తున్నారో చెక్‌చేయాలన్నారు. అలవాటు పడిన నేరస్తుల హిస్టరీ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలని ఎసహెచ్ ఓలకు సూచించారు. ఇతర జిల్లా రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం మూలాన గంజాయి, మాదక ద్రవ్యా ల అక్రమణ రవాణా జరగడానికి అవకాశం ఉందన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# బస్తీ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు



**ప్రజాపక్షం/కాజీపేట:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కాజీపేట దర్గాలోని బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. బస్తీ దవాఖానకు సంబంధించిన గదులను, వైద్యులు, సిబ్బంది, ప్రజలకు వైద్య సేవలు అందించేరికార్డులను తనిఖీ చేసారు. వైద్యులు, సిబ్బంది హాజరు గురించి కలెక్టర్ ఆరాతీసారు. వైద్య సేవల కోసం అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను, మందుల లభ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, బస్తీ దవాఖానాల నోడల్ అధికారి ఇష్తేకారు అహ్మద్, మెడికల్ అధికారి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 15 లోగా కాళోజీ కళాక్షేత్రం పూర్తి



**హనుమకొండ:** కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఆగస్టు 15కల్లా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ బాల సముద్రంలోని నిర్మాణంలో ఉన్న కాళోజీ కళాక్షేత్ర పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు కొనసాగుతుండగా ఆయా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని, ఆగస్టు 15 నాటికి అన్ని పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. నిబంధనల మేరకు నిర్మాణ పనులు ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంపు



**ప్రజాపక్షం/కొడకండ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాకాల గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి మండల ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని, రెసిడెన్షియల్ స్కూల్‌లను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు

స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో తహశిల్దార్ పురం యుగందర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందించారు. అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.5లక్షల 23వేల చెక్కులను 22 మందికి పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లక్షలోపు రైతు మాఫీ చేసి అప్పులబారి నుండి రైతులను రుణవిముక్తులను చేడయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆగష్టు చివరి నాటికి రూ.2లక్షల పంట రుణాలు తీసుకున్న రైతులందరికి ప్రభుత్వం మాఫీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలో మోదీ మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా ఈనాడు కూడా రైతులను ఆదుకోవాలన్న ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలందరి భాగస్వామ్యంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. జనగామ ఆర్డీవో కొమురెల్లి, ఆర్ఐ బలరాం, మాజీ జెడ్పీటీసీలు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మారుజోడు రాంబాబు, బొల్లం అజయ్, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, రఘునాథపల్లి, లింగాలఘణపురం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కావటి భాస్కర్ యాదవ్, నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, బోనాసి క్రాంతికుమార్, నీలం యువరాజ్, లోనె శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గత నెలలో రాంపూర్ అడవిలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం హత్యకు సంబం ధించిన ముగ్గురి నిందితులను పట్టుకొని రిమాండ్ కు తరలించినట్లు భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్లో పత్రికసమావేశంలోవివరాలువెల్లడించారు. డిఎస్పీ మాట్లాడుతూ సమాచారం మేరకు భూపాల్ పల్లి సిఐ ఆదేశాలతో ఎస్సై ప్రసాద్ సిబ్బంది భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఫైవ్ ఇంక్లైన్ ఆర్చ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలోని ముగ్గురు వ్యక్తులు పోలీసులనుచూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పోలీస్‌లు వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లుగాతెలిపారు. పర్వతగిరి మండలంతురకల సోమవారం గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, బానోత్ సిద్దు, బానోత్ శీను అనే ముగ్గురు వ్యక్తులు గత ఏప్రిల్ 23న రాంపూర్ అడవి ప్రాంతంలో గూగుల్ ప్రభాకర్ (29 వర్ధన్నపేట మండలం రాందాన్ తండా కు చెందిన అతన్ని గొల్ల బుద్ధారం తండాకు పెళ్లి సంబంధం గురించి వెళ్దామని తీసుకువచ్చి రాంపూర్ అటవీ ప్రాంతంలో మద్యం సేవించి అతని తలపై బండరాయి తో కొట్టి చంపేశారని పేర్కొన్నారు. ముందే పథకం ప్రకారం వారి వెంట తెచ్చుకున్న పెట్రోలు అతనిపై పోసి నిప్పు అంటించి చంపి పారి పోయామని ఒప్పుకున్నారని డీఎస్పీ వివరించారు. మృతుడు ప్రభాకర్ తన చెల్లెకు ఇవ్వాల్సిన 20 గుంటల భూమి ఇవ్వకుండా మృతుడి తల్లిదండ్రులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ కొడుతూ చంపుతా అని బెదిరించినాడని,ఈ విషయం మృతుడి తండ్రి నరసింహా స్వామి మృతుడిని చంపుటకు 50వేల రూపాయలు ఇస్తానని ఎలాగైనా చంపమని తన బావమరిది బానోత్ బాలాజీకి చెప్పగా భానోత్ బాలాజీ అతని కొడుకు సిద్దు అతని తమ్ముని కొడుకు సీను లు పథకం ప్రకారం పెళ్లి సంబంధం చూసేది ఉందని గుగులోతు ప్రభాకర్ ను రాంపూర్ అడివి ప్రాంతంలోకి తీసుకు వచ్చి మద్యం తాగిపించి హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చినామని నేరం ఒప్పుకోవడంతో ముగ్గురిని అరెస్టు చేసి జుడిషియల్ రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

# భూ కబ్జాకు యత్నం.. న్యాయం చేయండి

పిఏసిఎస్ చైర్మన్ దౌర్జన్యానికి పోలీసుల అండదండలు

కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్ర హన్మంతరెడ్డి, మల్లికాంబ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తాము కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసేందుకు పిఏసిఎస్ ఛైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని, ఆయనకు పోలీసులు, కాంగ్రెస్ నాయకుల అండదండలున్నాయని బాధితుడు చిర్ర హన్మం తరెడ్డి ఆయన భార్య మల్లికాంబ ఆరోపించారు. శుక్రవారం తన జనగామలోని తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 154 క్యూ,ఆర్,ఎస్‌లోని రెండు ఎకరాల భూమి తాను కొనుగోలు చేసి సాగు చేస్తున్నానన్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకం తమ పేరనే ఉందని, చెట్లు, రాళ్ల రప్పలు ఉన్న భూమిని చదును చేసి పొలంగా మార్చి వరి పంట దిగుబడి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన పెసరు పంట కూడా వేశానని వివరించారు. పిఏసిఎస్ ఛైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి కొందరు రౌడీలు, రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో తాను కొనుగోలు చేసి కబ్జాలో ఉన్న భూమిని అక్రమించేందుకు యత్నిస్తున్నాడన్నారు. ఈ భూమి విషయమై గతంలో సిపి రంగనాథ్, తరుణ్‌జోషిలకు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. వారు తన భూమిగా తేల్చి సాగు చేసుకోమని చెప్పారని, గత ఎంఎల్‌వి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూడా తననే సాగు చేసుకోమని చెప్పాడన్నారు. చిర్ర శ్రీనివాస్‌రెడ్డి ఎవరి వద్ద కొనుగోలు చేశాడో వారిని తీసుకొస్తే ఆయన భూమి ఎక్కడ ఉందో తేలిపోతుందన్నారు. తనకు విక్రయించిన వారిని తీసుకురావడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఆయన ఎందుకు తీసుకురాకుండా పంటను ధ్వంసం చేసి మళ్లీ పంట వేస్తున్నాడన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశామని చెప్పడం తప్ప వారి అక్రమాలను అడ్డుకోవడం లేదన్నారు. ఈ విషయంలో ఒక కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్దకు వెళ్తానన్నారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరేదారి లేదన్నారు. పోలీసులు ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలన్నారు.

## ఐఐటి స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

ముఖ్య అతిథిగా ప్రముఖ నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** ఎంతో కష్టపడి చదివి పరీక్షల్లో పాసై విద్యార్థులు ఆశించిన తమ డిగ్రీ పట్టా సర్టిఫికెట్లు వారి చేతికి అందించే రోజు రానే వచ్చింది. ఐఐటిహైదరాబాద్‌తన13వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనుంది. శనివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఏడాది వివిధ విభాగాలకు చెందిన మొత్తం 1100 మంది అండర్ గ్రాడ్యుయేట్ ,పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సర్టిఫికెట్లను అందుకోనున్నారు. ప్రముఖ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పట్టాలను అందజేయనున్నారు. మొదటిసారిగా ఐఐటి హైదరాబాద్ వెయ్యి మంది విద్యార్థుల మార్కు సంఖ్యను దాటడం గొప్ప విషయమని డైరెక్టర్ మూర్తి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఈ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

# పెద్దవాగుకు గండి.. వందల కోట్ల నష్టం

## వరద ప్రాంతాలను పరిశీలించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** దశాబ్దాల కాలం నుండి ఈ ప్రాంత వాసులకు సాగునీరు అందించే మధ్యతరహా సాగు, తాగు నీటిని అందించిన పూరాతన ప్రాజెక్టుకు గురువారం అర్ధరాత్రి సమయంలో లాక్‌ల వద్ద సుమారు 300అడుగులకు పొడవున గండిపడి ప్రాజెక్టులో చుక్క నీరు లేకుండా పోయింది. గురువారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుండి ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరద నీరు రావటంతో ప్రాజెక్టుకు ఉన్న గేట్లల్లో ఒక గేటు తెరుచుకోకపోవటం రెండు గేట్లు మాత్రం తెరుచు కోవటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. నీటిపారుదల అధికారులు సైతం తీవ్రంగా శ్రమించి మూడో గేటును సైతం తెరిచారు. అప్పటికే వర దనీరు విపరీతంగా పెరిగిపోయి నారాయణపురం వర కు పోటు వేసింది. ఇంక నీటి ఉధృతి పెరిగి ప్రాజెక్టు కట్ట పైకి అలలతో ఎగిసిపడుతూ ప్రవాహం సాగటంతో లాకులకు ఇరువైపులా గండి పడింది. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో పోలవరం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు చిర్ర బాలరాజు, జారే ఆదినారాయణ సమా చారం తెలుసుకుని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు పరిస్థి తిని వివరించారు. రెండు రాష్ట్రాలకు చెందిన హెలీక్యా ప్టర్లు సహాయంతో వరదుల్లో చిక్కుకున్న వారిని సురక్షి తంగా రక్షించారు. ప్రాజెక్టు తెగిపోయే ప్రమాదం ఉంద ని ముందుగానే పసిగట్టిన ఎమ్మెల్యేలు అక్కడికి చేరుకు న్నారు. జిల్లా కలెక్టర్ వినిత్, ఎస్‌పి రోహిత్‌రాజ్, ఏలూ రు జిల్లా అధికారులు సైతం సంఘటనాస్థలానికి చేరు కుని ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు చేప ట్టారు. ప్రాజెక్టు కింద ఉన్న 8గ్రామాల ప్రజలను ఫైర్, పోలీస్ ఇతర సహాయక సిబ్బంది సహయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాల్లో బాధి తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయం దాటాక పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి వరద నీరు ఉప్పొంగుతూ వస్తుండటంతో చుట్టూపక్కల గ్రామా ల ప్రజలు సైతం భయాందోళనలకు గురయ్యారు. వరద ప్రవాహం ప్రాంతంలో వరి పొలాల్లో ఇసుక మెట్లు వేసి గండ్లు పడ్డాయి, పత్తి పంట వందల ఎకరాల్లో నష్టం వా టిల్లింది. కుమ్మరిగూడెం గ్రామంలో ఇళ్ళు సైతం కొట్టు కుపోయాయి. దశాబ్దాల కాలంగా ప్రాజెక్టు కింద వేల ఎకరాల భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగి స్తున్న ప్రజలకు ఈఏడాది పంటలు వేసుకునే పరిస్థితులు లేవనే చెప్పవచ్చు. తెలంగాణ ప్రాంతంలో 2వేల ఎకరా లకు, ఆంధ్రా ప్రాంతంలో 14వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు తెగిపోవటం వలన ఏజెన్సీ ప్రాంతం లోని గిరిజనులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోనున్నా రు. వరద ప్రభావిత ప్రాంతాలను రెండు జిల్లాల అధికా రులు, ఎమ్మెల్యేలు శుక్రవారం పర్యటించి ప్రాజెక్టు గండి పడి ఇసుక మేటలు పెట్టి పొలాలను, నష్టపోయిన పంట లను, పాడైపోయిన రోడ్లను పరిశీలించారు. నష్టం అంచ నాలను తయారు చేస్తామని తెలిపారు. పునరావాస కేం ద్రాల్లో ఉన్న వారికి తక్షణ సహాయక చర్యలు చేపడుతా మన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్టుకు పడిన గండిని పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. నష్టపోయి న వారందరికి ప్రభుత్వ అంచనాలు వేసి నష్టపరిహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు జూపల్లి రమేస్, నంద్రు రమేష్, జూపల్లి ప్రమోద్, సొసైటీ చైర్మ్ నిర్మల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



## పునరావాస, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి : సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు, వరద లకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి, ఇం డ్లు కోల్పోయిన పేదలకు ,ముంపుకు గురైన ప్రాంతాల వారికి పునరావాసం కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. స్థానిక శేషగిరి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశ్వారావు పేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి సమీప గ్రామాలు జల మయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పా రు. జిల్లా అధికార యంత్రాగం అప్రమత్తమైన యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందుల కు గురికాకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ములకలపల్లి మండలం ముత్యాలమ్మవాగు పొంగిపొర్లడంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని తక్షణమే పునరుద్ధరణ పనులు చేయాలన్నారు. పినపాక మండల పరిధిలోని పెద్దవాగు పొరడం వల్ల సుమారు అరవై ఎకరాల పంట పొలాలు కోతకు గురయ్యాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని, మారుమూల గ్రామాలతో పాటు ఇబ్బందికర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మరికొద్దిరోజుల పాటు వర్ష సూచన ఉన్నం దున అధికారులు అప్రమత్తమై ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని షాబీర్ పాషా కోరారు.

## మొక్కలు నాటి పచ్చదనం పెంచుదాం

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్



**ప్రజాపక్షం/ ఇచ్చోడ :** పచ్చదనం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలనీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నా రు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్ర వారం ఇచ్చోడలోని ప్రభు త్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, నాయకు లతో కలిసి ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ప్రాణ కోటికి జీవనాధార మైన మొక్కలను నాటి, సంరక్షించుకుం టేనే భవిష్యత్తుకు మనుగడ ఉంటుందన్నారు. వన మహోత్సవంలో అన్ని వ ర్గాల ప్రజలు భాగ స్వాములు కావాలనీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. డ్రీమ్స్ సోసైటీ ఆధ్వర్యంలో పాఠశాలకు అందజేసిన సైన్స్ కిట్స్‌లను ఎమ్మెల్యే చే తుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావ్, ఎఫ్‌ఆర్వో పుండలిక్, డిప్యూటీ రేంజి అధికారి శీలానంద్, ఇంఛార్జీ ఉపాధ్యాయులు రమణ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీ నర్ ఏనుగు కృష్ణా రెడ్డి, నాయ కులు సాబీర్, నార్వడే రమేశ్, గాడ్గె సుభాశ్, లోక శీరీశ్ రెడ్డి, శివ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయం చేయండి



**ప్రజాపక్షం/నస్పూర్ :** నేషనల్ గ్రీన్ హైవే రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల భూ నిర్వాసితులు తగి న నష్టపరిహారం చెల్లిస్తూ తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కుమా ర్‌దీపక్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం భూ బాధితులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. అనంతరం ఆయన నేషనల్ గ్రీన్ హైవేకు సంబంధించిన అధికా రులను పిలిపించి రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూ నిర్వాహితుడు సుందిళ్ల మల్లేష్ మాట్లాడుతూ జైపూర్ మం డల పరిధిలోని ఇందారం ఒసి కింద భూములు కోల్పోయిన వారికి రూ.24,64,000లు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. అంతేకాకుం డా స్థానిక కిష్టాపూర్‌లోని అంజనిపుత్ర వెంచర్స్ వారు గజాన రూ. 3000 నుండి 5000 రూపాయల వరకు భూములను అమ్ముతున్నారని తెలిపారు. ఎంతో కాలంగా నమ్ముకున్న భూములను కోల్పోతున్న రైతులకు కేవలం ఎనిమిది లక్షల రూపాయలు ఇవ్వడం అన్యాయమని ఆవేదన చెందారు. భూమిని నమ్ముకున్న రైతులకు సరైన న్యాం చేస్తూ ఎకరాకు రూ.50 లక్ష లు నష్టపరిహారం చెల్లించాలని వారు కలెక్టర్‌ను కోరారు. అనంతరం భూ ని ర్వాసితులకు న్యాయం చేస్తానని వారి నుండి దరఖాస్తు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి బాపు,జనార్ధన్‌రెడ్డి, రామారావు, ఎస్.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన సేవా కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/ నందిపేట్:** నందిపేట్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజా పాలన సేవ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలె క్టర్ తనిఖీ చేశారు. అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంద్రనగర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ప్రకృతి వనం పరిశీలిం చారు. షాపూర్, వన్నెల్ గ్రామాలలో ప్రకృతి వనాలు ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మండల అధికారులు ఉన్నారు.

## ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాని ప్రిన్సిపల్ పి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ దశ అప్లికేషన్ల గడువు ఈనెల 21 వరకు గడువు ఆన్‌లైన్‌లో పొడగించడం జరిగిందని ఆసక్తిగల అభ్య ర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

## ఆర్‌టిఎ అధికారులమని చెప్పి లారీ హైజాక్

### పసుపు లోడ్‌తో సహా లారీ చోరీ... రెండు రోజుల్లో పట్టుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా మార్కెట్ నుంచి పసుపు లోడ్ తో గుంటూరు వెళుతున్న లారీని కొందరు దుండగులు మార్గమధ్యలో ఆపి హైజాక్ చేశారని 1వ టౌన్ సిఐ విజయ్‌బాబు తెలి పారు. వివరాలిలా ఉన్నా యి. సుమారు రూ.50 లక్షల విలువ గల లారీ ఈనెల 17న పసుపు లోడ్‌తో గుంటూరుకు బయలుదేరగా కొందరు దుండగులు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద లారీని ఆర్‌టిఎ అధికారులమని చెప్పి రోడ్డుపై నిలిపారు. లారీ డ్రైవర్ రమేస్ వెంటనే యజమని వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా సమాచారం అం దించాడని వెంకటేశ్వర్లు వారితో మాట్లాడినా వారు వినకుండా డ్రైవర్‌కు మత్తు పదార్థాలు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసి గాంధారి ఎక్స్ రోడ్డు వైపు లారీని మళ్లించారని, అక్కడ లారీకి ఉన్న జిపిఎ స్‌ను డిస్కనెక్ట్ చేశారని, గాలింపు చర్యలు చేపట్టి జిపిఎస్ ట్రాక్ చేసి చూడగా నవీన్‌పేట్ మండలం జన్నెపల్లి వద్ద లారీని గుర్తించామని యజమాని ఫిర్యాదు మేరకు నవీపేట పోలీసులు హుటాహుటిన జన్నెపల్లి వద్ద ఉన్న లారీని పట్టుకున్నారని తెఇపారు. లారీని అక్కడే వదిలేసి దుండగులు పరా రీలో ఉన్నారని యజమాని ఫిర్యాదు మేరకు 1వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయ్‌బాబు తెలిపారు.

## విద్య, వైద్య రంగాల పనితీరులో మార్పు కనిపించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** విద్య, వైద్య రంగాల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా సంబంధిత అధికారులు సిబ్బంది అంద రూ అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూ చించారు. శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గాండ్లపేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సీహెచ్‌సీలోని లేబోరేటరీ రూమ్ ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెం ట్ వార్డు, ఆక్సిజన్ ప్లాంట్, లేబర్ రూమ్, మెటర్నిటీ వార్డు, రోగులు, వారి సహాయకులకు భోజనం తయారు చేస్తున్న కిచెన్ రూమ్, వ్యాక్సినేషన్ గది తదితర వాటిని పరిశీలించారు. 30 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్ప త్రిలో ప్రతిరోజు ఎంతమంది రోగులు సందర్శిస్తారు, ఎంతమంది ఇన్‌పే షెంట్లు చేరుతున్నారని సరిపడా వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉ న్నారా ? తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారా అని విద్యార్థులకు అడిగి తెలు సుకున్నారు. అంతకుముందు కలెక్టర్ మోర్తాడ్ శివారులో వనమహోత్స వంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీ ఆఫీస్‌లో కొనసాగుతున్న ప్ర జాపాలన కేంద్రం దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాల ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్స్, ప్రత్యేకాధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, కస్తూర్బా గాంధీ విద్యాలయాలో విద్యార్థు లకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశిం చారు. ప్రత్యేకాధికారులంతా నిరంతరం కేజీవిబి లను తనిఖీలు చేయాలనీ, సమస్యలను గుర్తించి తనిఖీలకు సంబంధించిన సమాచార నివేదికలను అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నాణ్యతను తెలుసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం,అల్పాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కిచెన్ గార్డెన్లను నిర్వహించాలని,ప్రతీ కెజివిబి రక్షణ గోడ,త్రాగునీరు. మరుగుదొడ్లు, విద్యుత్,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలాంటీ సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో అన్ని రకాల కమిటీలను ఏర్పాటు చేసి ఇందులో విద్యార్థులను భాగ్యస్వామ్యం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుం డా చుట్టపక్కల ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ కుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్,అయిల్ బా ల్స్ వేయాలన్నారు. ప్రతీ కెజివిబిలో సిసి కెమెరా లు ఏర్పాటు చేయాలని,నిరంతరం పర్యవేక్షించా లని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలనీ, ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం మండ లాల వారిగా కేజివిబిలలో విద్యార్థులకు కల్పిస్తు న్న సౌకర్యాలను,సమస్యల పరిష్కారానికి తీసుకో వలసిన చర్యలు,తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఇఓ రవీందర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ప్రమాదాలు నివారించండి

### త్రైపాక్షిక రక్షణ సమావేశంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** హైదరాబాద్ లో ని సింగరేణి భవన్‌లో శుక్రవారం జరుగుతున్న 48వ కంపెనీ స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశా నికి అధ్యక్షత వహించిన గుర్తింపు సంఘం ఏఐటీ యుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య గారు. పాల్గొన్న సింగరేణి సి అండ్ ఎం.డి బలరాం నా యక్ గారు, సింగరేణి రక్షణ అధికారులు, ఏఐటి యుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, నాయకులు వై.వి.రావు, మడ్డి ఎల్లా గౌడ్, కే.వీర భద్రం, ముస్కె సమ్మయ్య, వంగ వెంకట్ తో పా టు ప్రాతినిధ్య సంఘం నాయకులు ఉన్నారు.ఇట్టి సమావేశంలో సింగరేణి లో జరుగుతున్న ప్రమా దాలపై ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదాలు జ రుగకుండా నివారణ కోసం అధికారులు, నాయ కులు చర్చించారు.

## ప్రభుత్వం మారినా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు మారేనా?

### సంక్షేమ హాస్టల్‌పై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సర్వే : జిల్లా కీన్వీనర్ కైలాస్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తెలం గాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల పరిస్థితులు మాత్రం మారలేదని ఎఐ ఎస్‌ఎఫ్ నిర్మల్ జల్లా కన్వీనర్ కైలాష్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలోని పెంబి కస్తూర్బా వసతి గృ హాలను సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయ న మాట్లాడుతూ గతం లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వసతి గృహాల పరిస్థితి చాలా దారు ణంగా ఉండేది ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ గృహాల తీరు ఏ మాత్రం మారలేదు. ఎక్కడ వేసిన గొంగడి అ క్కడనే ఉన్నట్టు ఇంకా దారుణంగా తయారవుతున్న వస తి గృహాల పరి స్థితి ఇప్పుడు రానున్న బడ్జెట్లో విద్యార్థుల మెస్ చార్జీలు పెం చవలసిందిగా అఖిల భారత విద్యార్థి సమైక్య ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేశారు. కెజిబివి వసతి గృహంలో, మండపల్లిలో బాలికల వసతి గృహం పరిస్థితులు దారు ణంగా ఉన్నాయి. అదే విధంగా ఇక్కడ బాత్రూం కూడా చాలా దారుణ మైన పరిస్థితి ఉంది, తక్షణమే సబ్బులు, పేస్టులు, బుక్స్,దుప్పట్లు, పెట్టెలు సకాలంలో విద్యార్థులకు అందించాలి, నాణ్యమై న భోజనము పెట్టాల న్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో హాస్టలకు వస్తే వి ద్యార్థులు చాలా భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఉన్నత అధికారులు స్పందించి. రాష్ట వ్యాప్తంగా సంక్షేమ హస్టలల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని ప్రహరీ గోడలు, సొంత బిల్డింగులు, బాత్రూం సమస్య, ధరల కు అనుకూలంగా మెస్ చార్జీలు పెంచాలి ఈ బడ్జెట్‌లోనే ప్రవేశపెట్టాలి తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవింద్, విజయ్, పవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షపు నీటిలో రైల్వే అండర్ బ్రిడ్జి

### వంజిరి గ్రామ ప్రజలకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాగజ్‌నగర్ మండలం లోని వంజిరి గ్రామ సమీపంలో గల రైల్వే అండ ర్ బ్రిడ్జి వెళ్లే దారిలో వర్షపు నీరు నిలిచింది. దీంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యామ్ రావు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కాగజ్‌నగర్‌వంజిరి రైల్వే అండర్ బ్రిడ్జిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలో చాలా నీరు నిలిచిందని, దీం తో వంజిరి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాని అన్నారు. వంజిరి గ్రా మంలో సుమారు 2 వేలకు పైగా ప్రజలు ఉన్నారని , విద్యార్థులు, కూరగా యలు అమ్మే వారు, పాలు అమ్మేవారు, కూలీ పనులకు వెళ్లేవారు, రైతులు, ఉద్యోగస్థులు కాగజ్‌నగర్ పట్టణానికి రాపోకలకు ఈ దారి ఒక్కటే ఉందని అన్నారు. అత్యవసర సమయాలలో కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరి స్థితి ఉందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి నిలిచి ఉన్న నీటిని తొలగించి గ్రామస్థుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కాగజ్‌నగర్ రైల్వే జిఎంకు వినతిప్రతం అందజేసినట్లు తెలిపారు. వినతిప్రతం అందజేసిన వారిలో గ్రామస్థులు శంకర్, బాబాజి, విలాస్, తిరుపతి, మల్లయ్య, గోవిం ద్, గణేష్, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ఆర్‌టిసి బస్సుల్లో జర్నలిస్టులకు రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణ సౌకర్యం

### మంత్రి పొన్నంను కోరిన టియుడబ్ల్యుజె (ఐజెయు) పెద్దపల్లి జిల్లా శాఖ



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఆర్‌టిసి బస్సుల్లో జర్నలిస్టులందరికీ ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్య క్షులు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో జరిగిన పామ్‌ఆయిల్ రైతుల సభకు హాజరైన మంత్రికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి బస్సుల్లో మహిళలందరికీ ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించింద ని తెలిపారు. ప్రస్తుతం డిస్ట్రిక్ట్ అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల సర్వీసులో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారని, స్టేట్ అక్రి డిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచితంగా, ఇతర జిల్లా లో ప్రయాణించేందుకు 1/3వ వంతు చార్జీలు తీసుకుంటున్నారని పేర్కొన్నా రు. అలాగే అక్రిడేషన్ కార్డులు గల జర్నలిస్టులందరికీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్య క్రమంలో సంఘ నాయకులు బాలె శివప్రసాద్, సోన్నాయి టెంకం చంద్రమౌళి, రావి కోటేశ్వర్లు ఆర్ మృత్యుంజయం, గుడ్ల శ్రీనివాస్, అనంతరెడ్డి, శ్రీమంతుల కొండల్, రావి మధుకర్, వీరగోని రమేష్, మేకల మల్లేష్, సదానందం, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో తాత్కాలిక మరమ్మతులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ని కొత్త బస్టాండ్ ప్రాంగణం వద్ద రహదారి, మూత్రశాల, అంధ కారంలో ఉన్న బస్టాండ్ అనే వార్తకు స్పందన వచ్చింది. గురు వారం గ్రామ పంచాయతి ట్రాక్టర్ బ్లేడ్‌తో బస్టాండ్ వెనుకాలే ఉన్న మొరం మట్టితో గుంతల వద్ద సమాంతరంగా చేశారు. ఎల్లారెడ్డిపేటలో ప్రజాపక్షం దినపత్రికతో పాటుగా పలు పత్రి కలలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. కాగా ఎల్లారె డ్డిపేట బస్టాండ్ ఇన్‌చార్జ్ రవీందర్ ప్రజా సౌకర్యార్థం పలు సమస్యల పట్ల మరమ్మత్తులు చేయించారు. బస్టాండ్ క్రాసింగ్ వద్ద కంకర రోడ్డుతో వేయా ల్సిన రోడ్డు మట్టితో తాత్కాలికంగా కంట్రోలర్ ఉదార స్వభావంతో స్పందించారు. ప్రజాసమ స్యలపై ఆయన స్పందించి మాట్లాడారు. బస్టాం డ్‌లో నాలుగు చక్రాల వాహనాలు పార్కింగ్‌లా పెడుతున్నారని ఆవేదన చెందారు. మరమతు చేద్దా మంటె కూడా ఎవాహనం అడ్డుగా పెట్టారని వీఐపిలది కా వచ్చునని విడిచిపెట్టడం విడ్డూరంగా మారింది. ఇదే విషయం మీడియాతో మాట్లాడగా పోలీసు అధికారులకు చెప్పవచ్చని బస్టాండ్ ఎవరి సొత్తు కాదని గ్రామపంచాయతికి ప్రతి ఏటా పదిహేను వేల రూపాయలు రుసుం కడుతున్నామ ని కంట్రో లర్ ప్రజాపక్షం ప్రతినిధితో సమాధానమిచ్చారు. ఇంతచేసినా బస్టాండ్‌ను ఆధునికరించి ఒక రూపాంతరం చేసి నిబంధనలు కఠినతరం చేస్తే బాగుంటదని తెలిపారు. చీకటి ఉంటే మద్యం సేవిస్తున్న వ్యక్తులను రాత్రి వేళల్లో కంట కనిపెట్టాలని అభ్యర్థించారు.అంతేకాకుండా ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు, కార్లు పెట్టు కోవడానికి అడ్డాగా మారింద ని వాపోయారు. దీని వెనుక రాజకీయ హస్తం కాని, విఐపిల మంటు బస్టాండ్‌లో వాహనాలు నిలిపివెళుతున్నారని మండిపడ్డారు. చివరికి మర మ్మత్తు చేద్దామని ప్రయత్నించగా చుట్టుగా వాహనాలు నిలిపి వేసి వెళ్లారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని అసాంఘిక శక్తులపై శ్రద్ధ వహి స్తే పలు ప్రజా ప్రతినిధులు సహకరిస్తే ఎల్లారెడ్డిపేట బస్టాండ్ మరింత అభి వృద్ధి పథంలో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు.

## మంచి నడవడికతో జీవనం సాగించాలి

### మంచిర్యాల డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం/ మంచిర్యాల క్రైమ్ :** మంచి ర్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందు కు స్పెషల్ టీంను స్థాపిం చడం జరిగిందని మంచిర్యాల డిసిపి భాస్కర్ తెలిపారు. శుక్రవారం మంద మర్రి పట్టణంలో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూళనకు స్పెషల్ టీంలు ఏర్పాటు చే యడం జరిగిందని, ఈ టీంలు జిల్లా వ్యాప్తంగా సంచరిస్తూ గంజాయి రవాణా, అమ్మకంపై ప్రత్యే క నిఘా ఉంచి, నేరస్థ లను పట్టుకొని గంజాయి రవాణాను నిరోధించు టకు కృషి చేస్తుందని అన్నా రు. శుక్రవారం మందమర్రిలో గంజాయి తాగు తూ పట్టుబడిన నలుగురు యువకులలో ఒకరు ఐటిఐ చదువు పూర్తి చేశాడని తెలిపారు. మిగతా ఇద్దరు యువ కులు పెయింటింగ్ పని చేసుకుం టూ జీవిస్తున్నం దున వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సి లింగ్ నిర్వహించి యువకులను మం చిర్యాల ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న డిఅ డిక్షన్ సెంటర్‌లో చికిత్స గురించి చేర్చ డం జరి గిందని తెలిపారు. ఎవరైనా గంజాయికి అల వాటు పడినట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందిం చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగు తుందన్నారు. మత్తు పదార్థాలకు బానిస అయితే తల్లిదండ్రులు సంపాధించిన ఆస్తి మొత్తం చెడు వ్య సనాలకు ఖర్చు అవుతుందని, భవిష్యత్తు అంధకా రంగా మారుతుందని అన్నారు. గంజాయికి సం బంధించిన ఏదైనా ఉంటే సమాచారం 871267 1111 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని, 14446 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

# రైతాంగం మాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం

### పెద్దపల్లిలో ఆయిల్‌పామ్ సాగు 10 వేల ఎకరాలకు విస్తరించాలి

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్ర రైతాంగం మాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల లో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఓదెల మండలం కొలనూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంత్రులకు స్వాగతం పలికారు. రూ.13.30 కోట్ల వ్యయంతో నిర్మించిన పెద్దపల్లి ఓదెల వయా కొత్తపల్లి, కొలనూరు వరకు వెళ్ళే రోడ్డును, కోటి 56 లక్షల వ్యయంతో నిర్మించిన కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పాం ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందని, నీటిపారుదల, విద్యుత్ రంగం, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు రుణ మాఫీ చేయాలనే సంకల్పంతో రైతురుణమాఫీ ప్రక్రియ ప్రారంభించి లక్షరూపాయల వరకు రుణం ఉన్న రైతుల ఖాతాలలో మాఫీ సొమ్ము జమ చేశామన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఇప్పటి వరకు 2500 ఎకరాల వరకు మాత్రమే జరిగిందని, ప్రస్తుత సంవత్సరం ఆయిల్‌పామ్ విస్తీర్ణం 10వేల ఎకరాలకు పెరగాలని, ఆసక్తి గల రైతులందరినీ ఆయిల్‌పామ్ దిశగా మళ్ళించాలన్నారు. ఆయిల్ పామ్ పంట మొదటి మూడు సంవత్సరాలు అంతర్ పంటల ద్వారా ఆదాయం వస్తుందని, రైతులు పొద్దు తిరుగుడు అంతర్ పంట క్రింద వేస్తే ఇదే కంపెనీ మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. మనకు అందుబాటులో ఉన్న భూమిలోనే ఎక్కువ పంటలు పండించాలని, పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. పామ్ ఆయిల్ రైతుకు రూ.51వేల వరకు సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు వినియోగించుకుని ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని రైతులను కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డిమాండ్ మేరకు పెద్దపల్లిలో నూతన బస్సు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ క్రమశిక్షణతో ఆర్థిక వ్యవస్థను గాడిలోకి తీసుకుని వస్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రైతులను రుణ విముక్తులు చేయడానికి దృడనిశ్చయంతో పనిచేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, రామగుండం సిపి ఎం.శ్రీనివాస్, అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్, డిసిపి చేతన, ఆర్‌డిఒ గంగయ్య, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ సిఇఒ కేశవ్ కళ్యాణ్‌కర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ‘గృహలక్ష్మి’లో పేదలకు ఇండ్లు

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య



**ప్రజాపక్షం/నల్లగొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో గృహలక్ష్మి పథకం ద్వారా పేదలకు ఇండ్ల నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశం మగ్దుంభవన్లో శుక్రవారం జరిగింది. సమావేశాన్ని ముఖ్యఅతిథి హాజరై కాంతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఇంటిస్థలం లేని పేదలకు స్థలం ఇచ్చి ఆరు లక్షల రూపాయలు, ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కొరకు 6లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకం పెండింగ్ బిల్లును విడుదల విడుదల చేయాలని కోరారు. కొత్తగా రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లను ఇవ్వాలని, భూమిలేని పేదలకు భూపంపిణీ చేపట్టాలని ఈనెల 29న జిల్లా కలెక్టర్‌లకు మెమోరండం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లొడంగి శ్రవణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్గూరి నరసింహ, సిహెచ్ ఉషయ్య,వేముల బుచ్చయ్య, వాయిలి వెంకన్న, తిరిగి సంజీవ, ఉప్పునూతల రమేష్, కోరి సత్తయ్య, నేరెళ్ల సైదయ్య, వల్లెపు పెంటయ్య, దుబ్బ నరసింహ, వీ.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు పరిష్కరించండి : నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజా అవసరాలు చెప్పండి అని దరఖాస్తులు తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రజా పాలన దరఖాస్తులను పరిష్కరించకపోవడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి ఖండించారు. ప్రజా పాలన దరఖాస్తులను పరిష్కరించి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ హసన్‌పర్తి మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్దారు ఆఫీసు ఎదుట దోమ రాకేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మాటల్లో ప్రజాపాలన అని చెపుతున్నారే తప్పా నిజమైన నిరుపేదలకు గుంట భూమి దళిత బహుజనులకు ఇప్పటి వరకు ఇంటి స్థలం కేటాయించి ఒక్క ఇల్లు నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేదన్నారు. బికెఎంయు జాతీయ నాయకుడు మోతి లింగారెడ్డి మాట్లాడుతూ వంగపాడు, పెగడపల్లి, గుండ్ల సింగారం, పలువేల్పులలో గుడిసెలు వేసుకొని పేదలు కష్టాలు పడుతున్నారని, వారికి నివాస స్థలాల పట్టాలిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి నేదునూరి రాజమౌళి, రేణిగుంట్ల రాజయ్య, దోమ మధున, జ్యోతి, భరత్, గోపి, బుచ్చిరెడ్డి, సాగర్, పెగడపల్లి, వెంకట లక్ష్మి , రాధమ్మ, సురేఖ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ చేసిన గొప్పనాయకుడు జువ్వాడి చొక్కారావు

### రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దివంగత మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు జయంతిని పురస్కరించుకుని నగరంలోని చొక్కారావు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు, నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ హాజరై చొక్కారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చొక్కారావు తనకు రాజకీయ గురువు అని, కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, కరీంనగర్ జిల్లా రీజియన్ కమిటీ చైర్మన్‌గా జిల్లా అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. నిరాడంబరత, చిత్తశుద్ధితో ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రజా సేవ చేసిన గొప్ప నాయకులు చొక్కారావు అన్నారు.

## కార్పొరేట్‌కు దీటుగా సర్కారు సంస్థలు





కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** కార్పొరేటుకు ధీటుగా సర్కార్ సంస్థలను తీర్చిదిద్దుతానని, విద్య, వైద్యశాలల అభివృద్ధి సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణం రామవరం 11వ వార్డు పరిధిలోని నేతాజి ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షల వ్యయంతో నిర్మించనున్న సైన్స్‌ల్యాబ్ నిర్మాణ పనులకు శుక్రవారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, సౌకర్యాలలేమితో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. సౌకర్యాల కొరత, పురాతన భవనాలతో విద్యా సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రాప్‌అవుట్లు సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుండటంతో ప్రభుత్వ విద్యాసంస్థలు మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితిలో విద్యాలయాలను కార్పొరేటుకు ధీటుగా తీర్చిదిద్ది ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో సంబంధిత ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుంచి నిధులు సమకూర్చేందుకు, ప్రభుత్వ వైద్యశాలలను సైతం అదే స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోని నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థలను ఆదరించాలని కోరారు. కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సాబీర్‌పాషా, చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంఇఒ జుంకీలాల్, కమిషనర్ శేషాంజన్ స్వామి, నోడల్ అధికారి ప్రభుదయాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ స్వప్న, హెచ్‌ఎం ద్రౌపతి, సిఐ రమేష్‌కుమార్, మున్సిపాల్ డిఈ రవికుమార్, ఏఈ రాము, ఎడ్యుకేషన్ ఏఈ రాంకుమార్, విద్యుత్‌శాఖ ఏఈ నరేష్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునగిడప పద్మ, ధర్మరాజు, బోయిన విజయకుమార్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, నగేష్, పాటి మోహన్, జనార్ధన్, నరేందర్, చందర్, గుత్తుల శ్రీనివాస్, రంగమ్మ, జలీల్, జానకి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు

### సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

### తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు, గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. దామెర, కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించారు. హన్మకొండలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో భిక్షపతి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు లేక వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. మండలంలోని గుండ్ల సింగారం, పలివేల్పులతో పాటు పోచమ్మకుంట, సుందరయ్య నగర్,ఎల్ వీఆర్ నగర్, భగత్‌సింగ్‌నగర్, గణేష్‌నగర్, జంగ భద్రయ్య నగర్ ప్రాంతాలలో పేదలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ధర్నాలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు నద్దునూరి అశోక్ స్టాలిన్, కొట్టెపాక రవి, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి, దామెర సుదర్శన్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి రొంటాల దేవా, గుంటి రాజేందర్, అమృతయ్య, జి. శివకుమార్, విజయ లక్ష్మి , మంగా, మౌనిక, పి.రాము, నారాయణ, కె.అనిల్ తదితరులు పాల్గొన్నారు. కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి, అశోక్ స్టాలిన్, కొట్టెపాక రవి,మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, బొట్టు బిక్షపతి, పూర్ణచందర్, రాజమణితో పాటు వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

## ఉద్యమాలకు ఊపిరి పోసిన గజ్వేల్



### సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి

### బిఆర్‌ఎస్ నేత దయానందరెడ్డితో పాటు పలువురు సిపిఐలో చేరిక

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ఉద్యమాలు, పోరాటాలకు గజ్వేల్ ఊపిరి పోసిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ నాయకులు బట్టు దయానందరెడ్డి, రిటైర్డ్ ఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశం, రాములు సార్ తదితరులు సిపిఐలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు ఇండ్లస్థలాల పంపిణీ, డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల మంరు, రైతు ఆత్మహత్యలు, కార్మిక సమస్యల పరిష్కారం, రైతు కూలీల ఇబ్బందులు తదితర అంశాలపై గజ్వేల్‌లో ఆందోళనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. పార్టీలో చేరిన బట్టు దయానందరెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు ఎఐఎస్‌ఎఫ్, సిపిఐలో కార్యకర్తగా పనిచేయగా, వివిధ కారణాలతో పార్టీ నుంచి వైదొలిగినప్పటికీ తిరిగి స్వగృహప్రవేశం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. బిఆర్‌ఎస్‌లో నియంతృత్వ ధోరణి, పెత్తందారీ పోకడలు నచ్చేది కాదని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా వివిధ అంశాలను కేసిఆర్, హరీష్‌రావు దృష్టికి తెచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను ఆ పార్టీలో ఉండి పేదలకు న్యాయం చేయలేననే తిరిగి సిపిఐలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. నిరంతరం గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. రిటైర్డ్ వార్డెన్ రాజేశం మాట్లాడుతూ వామపక్ష భావాలతో ఎఐఎస్‌ఎఫ్, టీఎన్జీవో, వార్డెన్ల సంక్షేమ సంఘం తదితర వాటిలో పనిచేసినట్లు పేర్కొన్నారు. ఆయా పార్టీలకు చెందిన నేతలు రాములు, బిక్షపతి, శ్రీను, గణేష్, సత్యనారాయణ, కనకయ్య తదితరులు సిపిఐలో చేరగా, వారికి చాడ వెంకటరెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్ రావు, వెంకట్రాంరెడ్డి, శివలింగు కృష్ణ, చింత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఆర్ ఫౌండేషన్ సేవలు అమోఘం

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ సాయుధ పోరాటంలో ఆరుట్ల దంపతులు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. నిరుద్యోగులు, మహిళల ఆర్థిక సాధికారత కొరకు ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ పేరుతో చేస్తున్న సామాజిక సేవలు అమోఘమన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో ఏఆర్ ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్, ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన సుమారు 450 మందికి శిక్షణ పత్రాలను ఆయన శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం ఆరుట్ల దంపతులు ఈ ప్రాంతం నుంచి నిజాం కు వ్యతిరేకంగా పోరాడారని నిరంతరం ప్రజాసేవకే పాటుపడ్డారని చెప్పారు. శాసనసభ్యులుగా ఈ ప్రాంతానికి వారు ఎంతో సేవ చేసారన్నారు. వారసత్వం అందుకున్న వారి కోడలు ఆరుట్ల సుశీలదేవి ఎఆర్ ఫౌండేషన్ పేరుతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మహిళల జీవనోపాధికి ఎంబ్రాయిడరీ వర్క్, నిరుద్యోగ యువతకు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ,స్పోకెన్ ఇంగ్లీష్, పేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో పాటుగా వృద్ధులకు చేతి కర్రల పంపిణీ లాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎఆర్ ఫౌండేషన్ సమాజానికి ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్,మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, సిపిఐ నాయకులు ఎండి దస్తగిరి, స్థానిక నాయకులు ఊట్కూరి అశోక్ గౌడ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## పిజి కళాశాలకు సొంత భవనం

### కలెక్టర్‌కు ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి పట్టణంలోని యూనివర్సిటీ పిజి కళాశాలకు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జయశంకర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్,జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ మాట్లాడుతూ యూనివర్సిటీ పిజి కళాశాల ప్రారంభం అయ్యి పది సంవత్సరాలు అవుతున్నా సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాలలో అడ్మిషన్లు లేకపోతే పిజి కళాశాలను తీసివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోమూడు గదులను వెంటనే ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు ఒద్దుల సాకేత్ రెడ్డి, సాయి కృష్ణ, దిలీప్, అరవింద్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి 26న చలో అసెంబ్లీ

### మారగోని ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న ‘చలో అసెంబ్లీ’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ భవన నిర్మాణ సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిరంతరం శ్రమిస్తూ అందమైన భవనాలనున నిర్మిస్తున్న భవన కార్మికుల జీవితంలో వెలుగులు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చలో అసెంబ్లీ పిలుపులో భాగంగా 26న ఇందిరా పార్క్‌లోని ధర్నాచౌక్ వద్ద రాష్ట్రస్థాయి భవన నిర్మాణ కార్మికుల ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా సిపిఐ శాసనసభాపక్షం నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,ఎఐటియుసి రాష్ట్ర నాయకత్వం పాల్గొంటారని ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ నిర్ణయం మేరకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పెండింగ్ లో ఉన్న క్లెములను చెల్లించాలని, తంబ్ ఇంప్రెషన్‌ను తొలగించి, పాత పద్ధతిని అమలు చేయాలని, ప్రమాదవశాత్తు చనిపోతే ఎక్స్‌గ్రేషియాను రూ. 10 లక్షలు చెల్లించాలని, నూతనంగా ఏర్పడిన జిల్లాలో డిసిఎల్‌ఏసిఎల్ అధికారులను నియమించాలని, సెస్సును రెండు శాతానికి పెంచాలని, పూర్తిస్థాయిలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనితదితర ప్రధానమైన డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో 25 లక్షల నుంచి 30 లక్షల మంది కార్మికుల పనిచేస్తున్నారని, వారికి సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని, వలస కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వానికి అనేకసార్లు వినపత్రం సమర్పించినప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రవీణ్ కుమార్ కోరారు.

## త్రోంగ్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ మీడియా పేర్కొంది. వైద్యులు పూర్తిగా ఆయన ఆరోగ్యంపైనే దృష్టిపెట్టారని, ఆయనకు విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పడంతో ఆయన మరణానికి ఒకరోజు ముందుగా గురువారంనాడు వియత్నాం దేశాధ్యక్షుడు తో లామ్ వియత్నాం కమ్యూనిస్టుపార్టీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. త్రోంగ్ ఇప్పటివరకూ వియత్నాం కమ్యూనిస్టుపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. 1944 ఏప్రిల్ 14న జన్మించిన త్రోంగ్ వియత్నాం రాజకీయాల్లో ప్రముఖపాత్ర వహించారు. 2018 నుండి 2021 వరకూ ఆయన దేశాధ్యక్షుడు (సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం)గా పనిచేశారు.

## నిబంధనను పరిశీలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బాధితమహిళ.. గవర్నర్లకు రక్షణ కల్పించే రాజ్యాంగంలోని 361వ అధికరణపై న్యాయ సమీక్ష చేయాలని అభ్యర్థించారు. నేర విచారణ నుంచి మినహాయింపు ఇచ్చే విషయంలో నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు అంగీకరించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే.. ఈ అంశంలో తమకు కోర్టు సాయం చేయాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 కింద.. రాష్ట్రపతి లేదా గవర్నర్ తన అధికారాలు, విధులను నిర్వర్తించే విషయంలో ఏ కోర్టుకు జవాబుదారీగా ఉండరు. ఉద్యోగం విషయంలో ప్రయోజనాలు చేకూర్చుతానన్న నెపంతో గవర్నర్ ఆనంద బోస్ తనను పలుమార్లు వేధించారని ఈ ఏడాది మే నెలలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను గవర్నర్ కార్యాలయం ఖండించింది. ఎన్నికల వేళ ప్రభుత్వం తనపై ఇలాంటి కుట్రలు పన్నుతోందని గవర్నర్ మండిపడ్డారు.

## బిఆర్‌ఎస్ టాప్

(మొదటి పేజీ తరువాయి)

(రూ.31.41 కోట్లు లేదా 6.53 శాతం) మిగతానాలుగు స్థానాల్లో ఉన్నాయి. దేశ వ్యాప్తంగా మొత్తం 57 ప్రాంతీయ పార్టీలు ఉండగా, వాటిలో 39 పార్టీలు తమతమ ఆదాయంలో 12.32 శాతం మొత్తాన్ని 2022–23 ఆర్థిక సంవత్సరంలో పొందడం గమనార్హం. అత్యధికంగా ఆదాయాన్ని సమకూర్చుకున్న పార్టీల్లో బిఆర్‌ఎస్ తర్వాతి స్థానాన్ని ఎఐటిఎంసి సొంతం చేసుకుంది. ఈ పార్టీ ఆదాయం రూ. 333.45 కోట్లు. ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) రూ. 214.35 కోట్లు ఆదాయాన్ని చూపింది. మొదటి ఐదు పార్టీలు సమష్టిగా రూ. 1,541.32 కోట్లు, లేదా తమతమ మొత్తం ఆదాయంలో 88.56 శాతాన్ని ఆ ఆర్థిక సంవత్సరంలో సమకూర్చుకున్నాయి. స్థూలంగా చూస్తే, 39 ప్రాంతీయ పార్టీల మొత్తం ప్రకటిత ఆదాయం రూ. 1,740.48 కోట్లు. అన్ని రాజకీయ పార్టీలు ఆడిట్ చేసిన తమతమ వార్షిక ఖాతాలను సమర్పించడానికి 2023 అక్టోబర్ 31వ తేదీని గడువుగా నిర్ణయించినప్పటికీ, వాటిలో కేవలం 16 మాత్రమే సకాలంలో వివరాలు అందించాయి.

మిగతా 23 పార్టీలు మూడు నుంచి 150 రోజులు ఆలస్యంగా ఎన్నికల కమిషన్‌కు వివరాలు ఇచ్చాయి. శివసేన (ఎస్‌హెచ్‌ఎస్), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్), జమూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జె అండ్ కె ఎన్‌సి),, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన (యుబిటి) వంటి ప్రముఖ పార్టీలతో సహా 18 ప్రాంతీయ పార్టీల ఆడిట్ నివేదికలు, ఈ నివేదికను సిద్ధం చేసే నాటికి భారత ఎన్నికల కమిషన్ వైబ్‌సైట్‌లో కనిపించడం లేదని ఎడిఆర్ పేర్కొంది. బిఆర్‌ఎస్ అత్యధికంగా రూ.680.20 కోట్లు ఖర్చు చేయని ఆదాయాన్ని ఆర్జించగా, బిజూ జనతాదళ్ రూ.171.06 కోట్లు, డిఎంకె రూ.161.72 కోట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇలా వుంటే, ఇందుకు భిన్నంగా 20 పార్టీలు తమ ఆదాయానికి మించిన ఖర్చులను నివేదించాయి, జనతాదళ్ (సెక్యులర్) దాని ఆదాయం కంటే 490.43 శాతం ఎక్కువ ఖర్చు చేసింది. విరాళాలు, ఎలక్టోరల్ బాండ్లతో సహా స్వచ్ఛంద విరాళాలు పార్టీలకు ప్రధాన ఆదాయ వనరుల ద్వారా వచ్చిన మొత్తం రూ. 1,522.46 కోట్లు. అందులో 87.47 శాతాన్ని ఖర్చు చేసింది. కేవలం ఎనిమిది ప్రాంతీయ పార్టీలు మాత్రమే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు స్వీకరించినట్లు ప్రకటించాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## 66 మందికి ఎఎస్ఐలుగా పదోన్నతులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : చార్మినార్ జోన్ –6లో 66 మంది పోలీస్ సిబ్బందికి సివిల్ ఎఎస్ఐలుగా పదోన్నతులు కల్పించినట్లు మల్టీజోన్–2 ఐజిపి వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐగా పదోన్నతి కల్పించేందుకు చార్మినార్ జోన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి నుండి వచ్చిన ప్రతిపాదనలను బట్టి ఈ పదోన్నతులు కల్పించామని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న ఎఎస్ఐ ఖాళీలలో 66 మంది హెడ్ కానిస్టేబుల్‌లకు పదోన్నతిని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ పదోన్నతులు అడ్‌హాక్ ప్రాతిపదికన కల్పిస్తున్నామని, ప్రభుత్వ నిబంధన మేరకు ఆమోదం పొందుతాయని ఐజిపి సత్యనారాయణ వివరించారు.



## పోలీసు అధికారుల డిపిలలో కేటుగాళ్ల ఫోన్ కాల్స్

ప్రజాపక్షం/హైదారాబాద్: సైబర్ కేటుగాళ్లు ఏకంగా పోలీసు అధికారుల డిపితో ఫోన్ కాల్స్ చేసి ఉచ్చులోకి లాగుతున్నారు.ఇలాంటి ఘటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ డిజిపి జితేందర్ ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ప్రజలను కోరారు. ఓ వ్యక్తికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను పోలీసునంటూ మీ కుమారుడు రేప్ కేసులో పట్టుబడ్డాడని చెప్పి డబ్బులు డిమాండ్ చేశాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని కేటుడితో ఫోన్లో మాట్లాడిన వ్యక్తి రికార్డు చేయగా డిజిపి ఈ వీడియోను ట్విట్టర్ వేదికగా షేర్ చేశారు. ఇలా పోలీస్ డిపి ఫొటో పెట్టుకున్న అపరిచితులు ఫోన్ చేసి మీకు సంబంధించిన వాళ్లు పట్టుబడ్డారని, లేదా వాళ్ల పేరు మీద ఇల్లీగల్ డ్రగ్స్ కొరియర్లు వచ్చాయని చెబుతారని తెలిపారు.ఇంకేదో పెద్ద తప్పు పని చేశారని మిమ్మల్ని టెన్షన్లో పెట్టి బురిడీ కొట్టిస్తారన్నారు. అలాటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పోస్టును తెలంగాణ పోలీసు, డయల్ 1930కి ట్యాగ్ చేశారు.

## ఏక రీతిన 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాల' భవనాలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల భవన నిర్మాణాలకు ఏకరీతి డిజైన్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు.పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించి, విశాలమైన తరగతి గదులను, ఆట స్థలాలు, తల్లిదండ్రులు తమ పిల్లలను కలవడానికి ప్రత్యేక గది మొదలైనవి ఉండాలని సూచించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ సలహాదారుతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తీసుకోవల్సిన చర్యలపై శాంతి కుమారి శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈప్రాజెక్ట్‌కు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించగా, ఇతర సంక్షేమ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, ఇందులో ఎనిమిది పాఠశాలలు ఈ ఏడాది గ్రౌండింగ్‌కు సిద్ధమని అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వివరించారు. 31 రెసిడెన్షియల్ వెల్ఫేర్ పాఠశాలలకు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు భూమిని గుర్తించగా, మిగిలిన 10 పాఠశాలలకు సంబంధించి భూమి గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్‌సి అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బాలికల వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నారాయణగూడ విట్టల్‌వాడి బాలికల బిసి హాస్టల్స్ సర్వే చేశారు. రాష్ట్ర సహాయకార్యదర్శి గ్యార నరేష్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ విద్యార్థినిల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినిలకు అందించే పౌష్టిక ఆహారం నాణ్యత లోపించిందన్నారు. బాలికల ఆరోగ్య సమస్యలు దృష్టిలో పెట్టుకొని దృఢంగా ఉండేలా ఆహారం అందించాలని కోరారు. సొంత భవనం లేని సమస్య, రీడింగ్ హాల్ లేకపోవడం, లైబ్రరీలో సరైన బుక్స్ అందుబాటులో ఉండకపోవడం పోటీ పరీక్షలకు సన్నాహం కావడానికి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం లాంటి సమస్యలు తమ దృష్టికి విద్యార్థినీలు తీసుకొచ్చారని, హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎఐఎస్ఎఫ్‌గా పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెరుమాల్ల అనిల్ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## జెసిహెచ్ఎస్ఎల్‌కు ఎన్నికలు జరపండి

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

కమిషనర్‌కు జర్నలిస్టుల వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకు హైకోర్టు ఉత్తర్వుల మేరకు వెంటనే ఎన్నికలు జరపాలని కోరుతూ జెసిహెచ్ఎస్ఎల్ కోర్ కమిటీ ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ కమిషనర్ మరియు రిజిస్ట్రార్ కో ఆపరేటివ్ సొసైటీస్ పి.ఉదయ్ కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నికలు జరపకపోవడంతో సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా నాన్ అలాటీ సభ్యులు తీవ్రంగా నష్టపోయారని విన్నవించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం సొసైటిలో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని కోరారు. 4 నెలల లోపు ఎన్నికలు పూర్తి చేయాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిత్యం అనేక ఇబ్బందులు పడుతూ జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని జెసిహెచ్ఎస్ నాయకులు కోరారు . కమిషనర్ ను కలిసిన వారిలో జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నాయకులు బ్రహ్మండబేరి గోపరాజు ,భీమగాని మహేష్ గౌడ్, సునీత,గయాస్ పాషా,జి.రఘు,పి.సాగర్,పర్వీన్ ,ఎం.శ్రీనివాస్ , రామకృష్ణ ,కె.రాజు, విఘ్నేశ్వర్ రావు, మునిరాజు తదితరులు ఉన్నారు.

## ఆలయ శిఖర పూజలో కొత్వాల్



ప్రజాపక్షం/హైదరాబాద్: లాల్ దర్వాజ సింహవాహిని శ్రీ మహాంకాళి దేవాలయంలో బోనాల పండుగ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న ఆలయ శిఖర పూజ, ధ్వజారోహణ పూజా కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం పాతబస్తీలోని లాల్‌ద ర్వాజ శ్రీ మహాంకాళి దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో నగర పోలీసు కమిషనర్ పాల్గొన్నారు. అనంతరం బోనాల బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. బోనాల పండుగ సందర్భంగా , అంబారి ఊరేగింపునకు హైదరాబాదు సిటీ పోలీసు తరపున వేయిమంది పోలీసు అధికారులు మరియు సిబ్బందితో కట్టు దిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాట్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయముతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామని తెలిపారు. సౌత్‌జోన్ డిసిపి స్నేహామెహ్రా , ట్రాఫిక్ డిసిపి ఆర్.వెంకటేశ్వర్లులతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 'హైడ్రా' విధివిధానాలు ఖరారు

జిహెచ్ఎంసితో పాటు ఒఆర్ఆర్ వరకు హైడ్రాకు అధికార పరిమితి పరిధి అప్పగింత

హైడ్రా చైర్మన్‌గా వ్యవహరించనున్న ముఖ్యమంత్రి

సభ్యులుగా మంత్రులు, సిఎస్, డిజిపి, మున్సిపల్ ముఖ్యకార్యదర్శి, జిహెచ్ఎంసి మేయర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ (హైడ్రా) విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఖరారు చేసింది. జిహెచ్ఎంసితో పాటు ఓఆర్ఆర్ వరకు హైడ్రాకు అధికార పరిమితి పరిధిని అప్పగించింది. హైడ్రా చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరించనున్నారు. ఉమ్మడిరంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు, సిఎస్, డిజిపి, ముఖ్య కార్యదర్శి, జిహెచ్ఎంసి మేయర్ సభ్యులుగా ఉంటారు. హైడ్రాకింద మెటీరియల్, వాహనాలతో కూడిన క్షేత్ర స్థాయి బృందాలు ఉంటాయి. ట్రాఫిక్ కంట్రోల్ కోసం హైడ్రా ఈ బృందాలు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటాయి. హైదరాబాద్‌లో భారీవర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో, వరద ప్రభావితప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఈబృందాలు సేవలు అందిస్తాయి. నీరు నిలిచే ప్రాంతాల్లో వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు తీసుకుంటాయి. హైడ్రావ్యవస్థ పనిచేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించనుంది. అయితే ఆ నిధులను జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, టిజిఐఐసి, టిజి ఎస్‌పిడిసిఎల్, ఎంఆర్‌డిసిఎల్, హెచ్‌జిసిఎల్, ఇతర సంస్థలు, స్థానిక అధికారుల నుంచి చందాలు, రుసుముల ద్వారా సేకరిస్తారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీ ఛైర్మన్‌గా మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా హైడ్రా కన్వీనర్‌గా వ్యహరించనున్నారు. రెవెన్యూ శాఖ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిజి, వాటర్ బోర్డు ఎం.డి, హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి కమిషనర్లు, మెట్రోరైల్ ఎండి, టిజిఎస్‌పిడిసిఎల్ ఎం.డి, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్, జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సబ్ కమిటీ నామినేట్ చేసిన వారుఉ సభ్యులుగా ఉంటారు. ఓఆర్ఆర్ వరకు హైడ్రా కార్యాకలాపాలు నిర్వహించనుంది. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకొనుంది. అలాగే శిథిలావస్థకు చేరిన భవనాల కూల్చివేతలు కూడా హైడ్రాకు అప్పగించనున్నారు. ప్రమాదకరంగా మారిన భవనాలను సైతం హైడ్రా ద్వారా కూల్చివేతలు జరుపుతారు. విపత్తుల నిర్వహణపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టింది. ఒఆర్ఆర్ పరిధిలో ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగిన తక్షణం సహాయక చర్యలుఅందించేందుకు విపత్తుబృందాలు సిద్ధంగా ఉంటాయి. హైడ్రా కమిషనర్ విపత్తుకు సంబంధించిన బాధ్యతలను నిర్వర్తిస్తారు. నిర్వహణ, ఆస్తుల రక్షణ, అమలు, ఇతర బాధ్యతలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అప్పగిస్తుంది. హైడ్రా ఆస్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. బహిరంగ ప్రదేశాలు, ఆట స్థలాలు, సరస్సులు, నాలాలు, భూముల, రోడ్లు, ఆక్రమణల నుండి క్యారేజ్ వేలు, ఫుట్‌పాత్‌ల అక్రమణలు అడ్డుకుంటుంది. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం సమన్వయంతో తనిఖీ చేపడుతారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను ఎప్పుడైనా తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రకటనలకు సంబంధించి ఉల్లంఘనలపై శిక్షార్హమైన చర్యలు తీసుకోనుంది.

## వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: మానవ శరీరంలో ముఖ్యమైన అవయవం కళ్ళు అని, అవి ఉంటేనే చదువుకోవడంతోపాటు ప్రపంచాన్ని చూడకలుగుతున్నామని మేర సొసైటి చైర్మెర్ డాక్టర్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 450మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ డాక్టర్ రెడ్యానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యపై మక్కువ చూపించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు విఠ్యాల నరసింహ, కుమ్మరి లింగం, గడ్డపు మల్లేష్, బొబ్బిలిగామ మల్లేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## తప్పు చేస్తే శిక్ష తప్పదు : సిపి సుదీర్‌బాబు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: జలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పహాడీషరీఫ్‌లో వివాహిత హత్య కేసులో ప్రధాన నిందితుడయిన భర్తకు జీవిత ఖైదీగా శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా రెండవ ఎడిజె కోర్టు తీర్పు చెప్పారు. పహాడీషరీఫ్ పరిధిలో ఒక వ్యక్తి తన భార్యను తరచుగా పలు రకాల వేధింపులకు గురిచేసి హత్య చేసిన కేసులో ఎల్ బి.నగర్ రంగారెడ్డి జిల్లా రెండవ ఎడిజె కోర్టు ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీరుద్దీన్ అలియాస్ ఫహాదుద్దీన్ (26) (ఉపాధ్యాయుడు)ని దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక వెయ్యి రూపాయలు జరిమానా విధించింది.

### తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు..సిపి సుధీర్ బాబు

మహిళల పట్ల నేరాలకు, వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు హెచ్చరించారు. రాచకొండ పరిధిలో అన్ని రకాల నేరాల్లో నిష్పాక్షిక, వేగవంతమైన దర్యాప్తు ద్వారా నేరస్తులకు గరిష్ట శిక్ష పడేలా పని చేస్తున్నామని తెలిపారు. నేరాలు అదుపులో ఉంచడానికి అన్ని రకాల చట్టపరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఉత్సాహంతో పనిచేస్తే మరిన్ని అవార్డులు

ఉత్సాహంతో పని చేసి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని సిపి సుధీర్‌బాబు అన్నారు. సిసిఎస్ ఎల్‌బినగర్ పరిధిలో మూడు స్నాచింగ్ కేసులలో సమర్ధవంతంగా పనిచేసి 24 గంటల్లో నేరస్థులని పట్టుకున్న రాచకొండ క్రైమ్‌స్టేషన్ అధికారి సిహెచ్‌శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్, సిబ్బంది ఎస్.రాజ్‌కుమార్, ఎం.శాంతి స్వరూప్,ఎస్.శ్రీనివాస్‌లను కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం నేరేడ్ మెట్ లోని తన కార్యాలయంలో డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు ఆధ్వర్యంలో రివార్డుతో సత్కరించారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించండి

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో ప్రకృతి వనం గుంతలు తీసే పనిని పరిశీలించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఏడు వారాలు ఉపాధి హామీ కూలీ పనులు చేస్తే కూలీ డబ్బులు ఇవ్వడం లేదని, దాంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. ఎన్నికల ముందు వారం వారం కూలీల డబ్బులు వారి బ్యాంక్ ఖాతాలో వేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటి వరకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పని ప్రదేశాల వద్ద వైద్యం కిట్లతోపాటు పనిముట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఏడు వారాలుగా ఉన్న పెండింగ్ బిల్స్‌ను తక్షణమే విడుదల చేసి వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని సూచించారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి రోజుకు రూ.600ఇచ్చేందుకు కృషి చేయాలని, రెండు వందల రోజు పనిదినాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాకాస మండల నాయకులు శంకర్, అంజయ్య, కూలీలు సునీత, రాములమ్మ, జయమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

## ఇజ్జత్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించండి

శేర్లింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని మాదాపూర్ డివిజన్ ఇజ్జత్ నగర్‌లో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని శేర్లింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, రంగారెడ్డి జిల్లా ఎఐటియుసి కార్యదర్శి చందు యాదవ్ లు తెలిపారు. శుక్రవారం చందనగర్ సర్కిల్ డిసి వంశీకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శేర్లింగంపల్లి ఏఐటియుసి అధ్యక్షుడు తుపాకుల రాములు,ఇజ్జతనగర్ కార్యదర్శి వెంకటేష్, ఏఐవైఎఫ్ అధ్యక్షులు జె. శ్రీనివాస్, ఎస్.కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖలీజ్‌ఖాన్‌లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని దర్గా ఖలీజ్‌ఖాన్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ అస్లాం,కో అప్షన్ సభ్యులు మలాకి రత్నంలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు గ్రామస్తులతో కలిసి పరిసరాలను, వంటగధులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పెరుగుతున్న డెంగ్యూ వ్యాధుల పట్ల దొమల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బిజేఎంసి అధికారులు ఆర్ఐ కుమార్,మహిపాల్,విలేజ్ అధ్యక్షులు రాజు,అన్వర్ బేగ్,గౌస్ బేగ్,షాను,ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

మున్సినల్ చైర్మెన్ కొందూటి నరేందర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో కమిషనర్ చీమ వెంకన్నతోపాటు చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్లు పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, మున్సిపల్ సిబ్బంది సాయిబాబా, రమేష్, జవాన్ మల్లేష్‌తోపాటు కాలనీ వాసులు ఉన్నారు.

## దోమల నివారణకు జాగ్రత్తలు

హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్




ప్రజాపక్షం/వనస్థలిపురం: దోమల నివారణకు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని హనుమాన్ నగర్ కాలనీలో జిహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బంది ఏర్పాటు చేసిన అవగహన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్ గౌడ్, నరసింహ, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/కేశంపేట: రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ అన్నారు. తెలంగాణలో రైతులకు లక్షలోపు రుణమాఫీ అమలు చేసిన సందర్భంగా కేశంపేట మండల కేంద్రంతో పాటు సంగెం, కొత్తపేటలలో శుక్రవారం ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడ్డాక పాలమూరు బిడ్డ, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం హామీలను అమలు చేస్తుందన్నారు.

### పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేద్దాం

ప్రతి పౌరుడు సామాజిక భాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండలం సంగెం బిల్డింగ్ బ్లాక్స్ వెంచర్‌లోని గ్రామ పంచాయితీకి చెందిన భూమిలో ప్రజలు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చదనం ఉంటేనే ప్రకృతి బాగుంటుందని, ప్రకృతి బాగుంటేనే ప్రజలు బాగుంటారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ రాజారత్నం, ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్ యాదయ్యయాదవ్, మాజీ జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, గూడ వీరేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, మాజీ సర్పంచ్‌లు రేణుక, శ్రీధర్‌రెడ్డి, శశికళ, నాయకులు సుదర్శన్‌గౌడ్, శ్రావణ్ రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గిరియాదవ్, నర్సింలు, మల్లేష్, పకాష్‌గౌడ్, పర్వతాలు, రమేష్, లక్ష్మణ్‌నాయక్, బాలోజీ, రాములు, ఇబ్రహీం, వినయ్‌కుమర్‌రెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

### రైతును రాజు చేయాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్: ఇందిరమ్మ రాజ్యంలో రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం వెల్‌జర్ల గ్రామంలో నిర్వహించిన రైతు సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బస్వం, నర్సింహ్మారెడ్డి, శ్రీశైలం, సురేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జాంగారి రవి, జంగయ్య, తుప్పరి శేఖర్, గణేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## కత్తి పద్మారావు జయంతి ఉత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన ఎంఎల్‌సి గోరటి వెంకన్న



ప్రజాపక్షం/వనస్థలిపురం: దళితోద్యమ నిర్మాత, ప్రముఖ సాహితీవెత్త డాక్టర్ కత్తి పద్మారావు జయంతి ఉత్సవాలు ఈనెల 27న నిర్వహించే సభ పోస్టర్‌ను ఎంఎల్‌సి గోరటి వెంకన్న శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ పద్మారావు జన్మదినోత్సవాన్ని కుల నిర్మూలనా దినోత్సవంగా జరుపుకోవటం ఆదర్శనీయమన్నారు. కోయి కోటేశ్వర్, కవి విల్సన్‌రావు, కొమ్మ వరపు, చేపురి శంకర్, చైతన్య పాల్గొన్నారు.

## వర్షపునీరు నిల్వ ఉండొద్దు



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని 18వ డివిజన్ కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వివేకనంద కాలనీలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమలు వ్యాప్తి చెందకుండా నిలువ ఉన్న నీళ్లు తొలగించారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు భాస్కర్‌రావు, రమేష్, చెన్నారెడ్డి, శంకర్, నాగరాజురెడ్డి, బిల్ కలెక్టర్ రాజశేఖర్, నవీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ వర్సిటీ బిల్లు సిద్ధం చేయండి

## ప్రస్తుత బడ్జెట్ శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టాలి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రస్తుత బడ్జెట్ శాసనసభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్య శిక్షణను అందించి,వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు, నిర్వహణకు ఎంత ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్కిల్ యూనివర్సిటీపై హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్సిటీలను పరిశీలించి, తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల విభాగం నమూనా ముసాయిదాను తయారు చేసింది. ఈ యూనివర్సిటీలో నిర్వహించే కోర్సులు, వాటి వ్యవధి, నిర్వహణకు అవసరమయ్యే మౌలిక వసతులు, నిర్వహణకు అవసరమయ్యే నిధులు, వివిధ కంపెనీల భాగస్వామ్యంపై పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ప్రదర్శించారు. కొత్త యూనివర్సిటీకి 'తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ' అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో (పిపిపిమోడల్‌లో ) స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పుతారు. లాభాపేక్ష లేకుండా స్వయం ప్రతిపత్తి ఉండేలా దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మూడు నాలుగేళ్ల కాల వ్యవధి ఉండే డిగ్రీ కోర్సులతో పాటు ఏడాది డిప్లొమా, మూడు నుంచి నాలుగు నెలల వ్యవధి ఉండే సర్టిఫికెట్ కోర్సులను కూడా ఇందులో నిర్వహిస్తారు. తెలంగాణలో అభివృద్ధి చెందుతున్న వివిధ రంగాలు, పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ఎంపిక చేశారు. మొత్తం 17 ప్రాధాన్య రంగాలను గుర్తించారు. ఫార్మా, కన్స్ట్రక్షన్, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్..తొలుత ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులను ప్రవేశ పెడుతారు. ప్రతి కోర్సును సంబంధిత రంగంలో పేరొందిన ఒక కంపెనీ భాగస్వామ్యం ఉండేలా అనుసంధానం చేస్తారు. అందుకు సంబంధించి ప్రభుత్వం కంపెనీలతో ఎంఒయూ చేసుకుంటుంది. తొలి ఏడాది రెండు వేల మందితో ప్రారంభించి, క్రమంగా ఏడాదికి 20 వేల మందికి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు.

**శాటిలైట్ క్యాంపస్**

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ క్యాంపస్ తో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ ప్రాంగణాలు (శాటిలైట్ క్యాంపస్‌లు) ఏర్పాటు చేయాలనే చర్చ జరగింది. జిల్లా కేంద్రాల్లో శాటిలైట్ క్యాంపస్ లు ఏర్పాటు చేస్తే.. వాటిలో చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, అందరూ హైదరాబాద్ క్యాంపస్ లో చేరేందుకు పోటీ పడుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే హైదరాబాద్ లోనే అందరికీ శిక్షణను అందించేలా ఏర్పాట్లు చేయాలని, ఈఎస్సీతో పాటు న్యాక్ క్యాంపస్ ఉపయోగించుకోవాలని, అవసరమైన మౌలిక వసతి సదుపాయాలుండే వివిధ ప్రాంగణాలను గుర్తించాలని సూచించారు. భూదాన్ పోచంపల్లిలో ఉన్న స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ లో ఉన్న సదుపాయాలను అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు.

**డిమాండ్ ఉన్న రంగాలపైనే దృష్టి పెట్టాలి**

డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, అటువంటి కోర్సుల్లో ఎక్కువ సీట్లు ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని, ఇందుకు సంబంధించి ముందుగానే వివిధ కంపెనీలతో చర్చించాలని ఆదేశించారు. మిగతా యూనివర్సిటీలు అనుసరించిన విధానాలను పరిశీలించి కొత్త యూనివర్సిటీ సంస్థాగత నిర్మాణాన్ని తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పలు మార్పులు చేర్పులు చేసి ముసాయిదాను సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మొదటి విడతగా రూ. లక్ష లోపు రుణమాఫి చేసి రైతన్నకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని సంగినేనిపల్లిలో శుక్రవారం రుణమాఫీ సంబరాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రుణమాఫితో పండుగ జరుపుకుంటున్న రైతులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మంత్రి జూపల్లి క్షీరాభిషేకం చేశారు.

**పాఠశాల ఆకస్మిక తనిఖీ ....**

సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బదిలీపై వెళ్లే ఉపాధ్యాయులను అప్పుడే రిలీవ్ చేయవద్దని, కొత్త ఉపాధ్యాయులు వచ్చిన తర్వాతనే బదిలీ చేయాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతోనూ మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని చెప్పారు. గ్రామానికి 50 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీలో ఫోరం అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ , రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, నారాయణరెడ్డి, పానగల్ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, రఘునాథరెడ్డి, రామిరెడ్డి, చిన్నారెడ్డి, ధనుంజయుడు, మీసాల మోహన్ , లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి మండల కేంద్రంలోని చిమనగుంటపల్లి పడమటి తాండ కాంగ్రెస్ నాయకులు, రైతులు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం గిరిజన తండాల్లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాండ అధ్యక్షులు భధ్రునాయక్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో రుణమాఫితో నంబర్ వన్‌గా తెలంగాణ నిలిచిందని, ఆగస్టు 15 వరకు పూర్తిగా రూ. 2 లక్షల రుణమాఫి జరుగుతుందన్నారు. ఇచ్చిన మాటను విశ్వసించి, మాట ప్రకారం రూ. 1 లక్ష రైతు రుణమాఫి పథకం ద్వారా మీ ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయం లాభసాటిగా సాగాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాండు నాయక్ , తిరుపతి నాయక్ , డాక్యా నాయక్ , బొజ్జ నాయక్ , లిబియా నాయక్ , హర్యానాయక్ , లాలమ్మ, లక్ష్మి , బుజ్జమ్మ తాండ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/బాలానగర్:** బాలానగర్ మండల పరిధిలోని మోతి ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ఆకస్మికంగా సందర్శించారు. తన సందర్శనలో తరగతి గదిలో విద్యార్థుల యొక్క ప్రతిభాపాటాలను పరిశీలించారు. ఐఎఫ్పి ప్యానెల్స్ ద్వారా అన్ని పాఠశాలలో విద్యాబోధన జరగాలని సూచించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శంభూ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, అబ్దుల్ హక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయం : ఒబేదుల్లా కొత్వాల్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః జడ్చర్ల క్యాంపు కార్యాలయంలో పీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ లోనే సింహభాగం రైతు రుణమాఫీ చేయడం హర్షణీయం. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు త్వరలో పూర్తి చేస్తాం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నెహ్రూ నుండి మొదలుపెడితే ఇప్పుడు రాహుల్ గాంధీ వరకు కూడా రైతుల పక్షపాత పార్టీ కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ప్రభుత్వం అప్పుల కుబిలో ఉన్న కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచింది. ఈ సందర్భంగా నేను రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షునిగా రైతుల పక్షాన, రేవంత్ రెడ్డి కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివకుమార్, జిల్లా స్పోక్స్ పర్సన్ టౌన్ నిత్యానందం, టౌన్ అధ్యక్షులు మేనహజ్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలు అమోఘం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః రెడ్ క్రాస్ సేవలు అమోఘం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టిడి గుట్ట 45వ వార్డులో ఇండ్లు కూలిపోయిన బాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ వారు అందించిన వంట పాత్రలు, ప్లేట్లు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ అవసరమైన చోట ప్రత్యక్షం అవుతుందని, వారి సేవలకు విలువ కట్ట లేమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజు, డాక్టర్ సామ్యూల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సాయిబాబా, రాములు యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టులో ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం / కొత్తకోట :** రైతులకు ఒకే విడతలో రూ. 2 లక్షల పంట రుణమాఫి చేశామని , ఆగస్టు ఒకటి తర్వాత ఇండ్లు లేని నిరుపేదలకు పార్టీలకు అతీతంగా , పారదర్శంగా నిరుపేదలకు ఇండ్లు ఇవ్వబోతున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మదనాపూర్ మండలం నుండి కొత్తకోట మండల చౌరస్తా వరకు ఎద్దుల బండ్ల మీద ఎమ్మెల్యే, రైతులు భారీ ఊరేగింపుగా బయలుదేరి పట్టణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలు ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు సేవకులమై సేవ చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిందని రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రుణమాఫి గత ప్రభుత్వంలో పాలమూరు ... రంగారెడ్డి ప్రాజెక్టులో చుక్క నీరు కూడా లేదని ప్రాజెక్టుల పేరు మీద లక్షన్నర కోట్లు నష్టం చేసి అడ్డగోలుగా ప్రెస్ మీట్‌లు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలు వారి మాటలకు మోసపోవద్దని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 8 నెలలో ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తున్నామని మిగతా హామీలు కూడా త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లె పాగు ప్రశాంత్ , ప్రధాన కార్యదర్శి బోయెజ్ , కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బీచుపల్లి, నాగన్న, జగదీష్ , మేస్త్రీ శ్రీను, చంద్రశేఖర్ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్‌కు తొలి విడత సీట్ల కేటాయింపు నిర్వహణ

### 96 వేల మందికి పైగా విద్యార్థులు వెబ్ ఆప్షన్లు కన్వీనర్ కోటాలో 72,741 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపును నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులకు వెబ్‌సైట్‌లో అలాట్‌మెంట్ ఆర్డర్లు అందుబాటులో ఉన్నాయి. సుమారు 96 వేల మందికి పైగా విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ముఖ్యంగా కన్వీనర్ కోటాలో 72,741 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా క్యాండిడేట్ లాగిన్ ద్వారా సీటు అలాట్‌మెంట్ ఆర్డర్ కాపీని పొందే అవకాశం కల్పించారు. లాగిన్ ఐడి, ఎప్‌సెట్ హాల్ టికెట్ నంబర్, పాస్‌వర్డ్ డేట్ ఆఫ్ బర్త్ ద్వారా ఏ కాలేజీలో సీటు వచ్చిందో తెలుసుకోవచ్చునని చెబుతున్నారు. సీటు అలాట్‌మెంట్ కోసం ఈ వెబ్‌సైట్ https://tgeapcet.nic.in/cand_signin.aspx లాగిన్ కావొచ్చునని వివరిస్తున్నారు. కాగా గత ఏడాది ఎప్‌సెట్‌లో కన్వీనర్ కోటాలో 83,766 సీట్లు భర్తీ చేయగా, ఈ ఏడాది వీటి సంఖ్య 72,741కి పడిపోయింది. కన్వీనర్, మేనేజ్‌మెంట్ గత ఏడాది 1.10 లక్షల సీట్లు ఉంటే, ఈ ఏడాది 1.01 లక్షల సీట్లకే పరిమితమయ్యాయి. ఇవి ఇప్పట్లో అందుబాటులోకి వస్తాయా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 11 వేల సీట్ల విషయం పెండింగ్‌లో ఉండగానే తాజాగా సర్కారు కొత్తగా ఐదు కాలేజీల్లోని కొత్త కోర్సుల్లో 3,365 సీట్లకు అనుమతినిచ్చింది. వీటిలో సివిఆర్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ), ఐటి కోర్సులు, స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్, తీగల కృష్ణారెడ్డి కాలేజీలో సిఎస్ఈ(ఎఐఎంఎల్), సిఎస్ఈ డాటా సైన్స్ కోర్సులకు అనుమతినిచ్చింది. వీటితో సీట్ల సంఖ్య 1,01,661కి చేరగా, ఇందులో కన్వీనర్ కోటా 72,741 ఉన్నాయి. సీట్ల తగ్గింపు విషయమై అధికారులను ఆరా తీయగా సీట్ల కన్వర్షన్ కోసం సర్కారు అనుమతి కోరినట్టు తెలిపారు.

## రెండు లక్షల రుణమాఫీ సహసోపేతమైన నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న సహసోపేతమైన, చారిత్రాత్మకమైన నిర్ణయమని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కోరుట్ల మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఏడున్నర లక్షల కోట్ల అప్పుతో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పు అప్పచెప్పితే ఏడు నెలలకాలంలోనే రుణమాఫీ చేయడం కేవలం రేవంత్ రెడ్డికే సాధ్యమైందన్నారు. రుణమాఫీతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణం, రూ. 500 గ్యాస్ సిలిండర్ లాంటి సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు జరుగుతుందన్నారు.

## తెలుగువిశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డిపేరు పెట్టాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్-ప్రతినిధి :** పాలమూరు తెలంగాణకీర్తిని ప్రపంచానికిచాటిన బహుముఖప్రజ్ఞాశాలి దివంగత సురవరంప్రతాపరెడ్డిపేరు తెలుగువిశ్వవిద్యాలయానికిపెట్టాలని వెన్నెల సాహిత్యఅకాడమి అధ్యక్షులు ముచ్చర్ల దినకర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ముచ్చర్లదినకర్‌రావు మాట్లాడుతూ పాలమూరు జిల్లా అలంపూర్‌లో జన్మించాడని తెలిపారు. ఆయనకవిగా, కథకుడిగా, పాత్రికేయుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగానేకాకుండా స్వాతంత్ర్య సమరయోధుడిగా, 1952లో వనపర్తి ఎమ్మెల్యేగా సమాజానికి జీవితాంతం సేవచేశారని వివరించారు. 1949లో ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమిపురస్కారాన్ని మొదటిసారిగా అందుకున్న సాహితివేత్త సురవరం ప్రతాపరెడి అన్నారు. కావున హైదరాబాద్‌లోని తెలుగువిశ్వవిద్యాలయానికి ఆయనపేరుపెట్టి గౌరవించాల్సిన అవసరం ఉందని సీఎంకు వివరించారు.



## దళారులను నమ్మి మోసపోవద్దు

### చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల మంజూరి కోసం దళారులను నమ్మి మోసపోకూడదని ఎక్కడ ఎలాంటి పైరవీ లేకుండా నేరుగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం వనపర్తి పట్టణం, వనపర్తి మండలంలోని షాదీముబారక్ లబ్దిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. వనపర్తి పట్టణానికి సంబంధించి 119 చెక్కుల్లో 69 సిఎంఆర్ఎఫ్, 38 కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవినితి రహిత పాలన కొనసాగుతుందన్నారు. గత పాలకుల లాగా షాదిముబారక్ , కళ్యాణ లక్ష్మీ చెక్కుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఇంటి వద్దకే చెక్కులను తీసుకువచ్చి అందజేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ చైర్మన్ పుట్టపాకల మహేష్, పట్టణ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ మాధవరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీని అదనుగా తీసుకొని సైబర్‌నేరస్థులు బ్యాంకులపేరుతో వాట్సాఫ్‌ప్రొఫైల్ ఫోటోలోబ్యాంకులోగోలతో వాట్సాఫ్‌లో బ్లూకలర్‌లో కొన్ని మోసపూరితమైన లింకులుపంపి మోసాలకు పాల్పడుతున్నారు. అటువంటివారిపట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తిపట్టణప్రజలకు ఎస్ఐ మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వ్యక్తులు సైబర్‌నేరగాళ్లు పంపిన లింకులు టచ్‌చేసిన, డౌన్‌లోడ్‌చేసుకున్న వారి వాట్సాఫ్‌సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌కు వెళ్లి పోతుందన్నారు. అంతేకాకుండా కాంటాక్టులో ఉన్న ప్రతి ఒక్కరికి మనం పంపినట్లే మెసేజ్ వెలుతుందన్నారు. తద్వారా మీకుతెలిసిన వాళ్లనుంచి మీపేరుతో డబ్బులు పంపించమని వాట్సాఫ్‌ద్వారా కోరుతున్నారని తెలిపారు. గుర్తుతెలియని బ్లూకలర్ లింకులను, ఏపికెఫైల్‌కాని డౌన్‌లోడ్ చేసుకుంటే , సైబర్‌నేరస్థులు మీగూగుల్, ఫోన్‌పే యూపిఐ ఐడిలద్వారా మీకు తెలియకుండానేడబ్బులు దోచేసే ప్రమాదం ఉందన్నారు. ఆన్‌లైన్‌సైబర్ మోసాలకుగురైతే ఎప్పుడైన వెంటనే 1930కుకాల్‌చేసి రిపోర్టు చేయాలన్నారు. నేరం జరిగినతర్వాత ఎంత త్వరగాపైనెంబర్‌కు కాల్‌చేసి రిపోర్టు చేస్తే అంతత్వరగా డబ్బులు సైబర్‌చేతిలో పడకుండా కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.



## ఆటోమొబైల్‌షాప్ ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని పాతయాపట్ల గ్రామంలో బిస్మిల్లా ఆటోమొబైల్‌షాప్‌ను శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు తగిలికృష్ణయ్య రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా తగిలికృష్ణయ్య మాట్లాడుతూ స్వయంశక్తితో ఎదగాలన్న ఆశయంతో ఎండి జహంగీర్ నూతన బిస్మిల్లా ఆటోమొబైల్‌షాప్‌ను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పబ్బతి అజయ్‌కుమార్, సాదిక్, రజాక్, ఖదీర్, మునీర్, బక్కయ్యగౌడ్, బుచ్చన్న, జెట్టినరేష్, పావనంశివ, గిరి, శ్రీను, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో రైతుల సంబరాలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు స్వీకరించి తెలంగాణరాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యానికి పట్టంకట్టారని, ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క అధ్యక్షతన రైతులకు ఇచ్చిన రూ.2లక్షలరుణమాఫీని అమలుచేయడంతో రుణమాఫీ దేశానికే దిక్సూచిగా నిలిచిందని మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ సందర్భంగా మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డి, మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లికృష్ణారావు, తుమ్మలనాగేశ్వరరావు, ఎంపి డాక్టర్‌మల్లురవిచిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ గతంలో పరిపాలించిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతురాజ్యమనిచెప్పి రాష్ట్రంలో రాక్షసపాలనచేస్తూ రైతులను, ప్రజలను మోసంచేసిన టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలుతగిన గుణపాఠం చెప్పారని, నిజమైన రైతుప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్‌ప్రభుత్వం పనిచేస్తుందని , ఇందిరమ్మ రాజ్యంలోనే సబ్బండవర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తగిలికృష్ణయ్య, మాజీ ఎంపిపి వరదరాజులు వెంకటేశ్వరరావు, మాజీరైతు సమ్వనయసమితి మండల అధ్యక్షులు లక్ష్మణరావు, మాజీసర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, చిన్నయ్య, రాధాబాలస్వామి, మాజీ ఎంపిటిసి దండునర్సింహ్మ, రవికుమార్, శశికళ శివశంకర్, ఆది ధర్మేందర్, మాజీఉపసర్పంచ్‌లు మల్లేష్‌యాదవ్, మశన్న పాల్గొన్నారు.

## 3న అమెరికాకు సిఎం బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో విదేశీ పర్యటన ఖరారైంది. తెలంగాణ సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఈ ఏడాది జనవరిలో స్విట్జర్లాండ్, లండన్, దుబాయ్ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన అమెరికా పర్యటన ఖరారైనట్లు సిఎంవో కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 3వ తేదీన రాత్రి అమెరికా బయల్దేరనున్నట్లు ఈ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా పర్యటన సాగనున్నట్లు తెలిసింది. అగ్రరాజ్యంలోని డల్లాస్ వంటి రాష్ట్రాల్లో ఈ బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ అగ్రరాజ్యంలోని పలు కంపెనీల సిఇఒలు, పారిశ్రామికవేత్తలను కలవనున్నారు. వారితో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పలు కంపెనీల గురించి వారికి చెప్పి, ఇన్వెస్ట్మెంట్కు తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం ఎంతటి భద్రమైన, అనువైన ప్రాంతమో వివరించనున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణకు మరిన్ని పెట్టుబడులను ఆహ్వానించి పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకోనున్నారు. దాదాపుగా ఎనిమిది రోజుల పాటు అగ్రరాజ్యంలో పర్యటించనున్న రేవంత్ రెడ్డి బృందం తిరిగి ఆగస్టు 11వ తేదీన హైదరాబాద్కు చేరుకోనుంది. ఈ పర్యటనలో గతం కంటే ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించాలని సిఎం టీమ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇక ఈ ఏడాది జనవరి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విట్జర్లాండ్, లండన్, దుబాయ్ వంటి దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో దావోస్లోని ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక ద్వారా భారీగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చారు. దాదాపు రూ.40వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఈ పర్యటనల్లో ఒప్పందాలు జరిగాయి. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవం, అభివృద్ధి కోసం లండన్లో థేమ్స్ నది అభివృద్ధిపై అధ్యయనం చేశారు.



## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్స్ నానక్ రామ్ గూడ, బంజారా హిల్స్ హైదరాబాద్ వారి సహకారంతో ఉద్యోగులకు, కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం మింట్ కాంపౌండ్ హైదరాబాద్ లోని విద్యుత్ కార్మిక భవన్ 1104 యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యూనియన్ అదనపు కార్యదర్శి జి వర ప్రసాద్ ప్రారంభించారు. డాక్టర్ నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు కార్మికులకు ఆర్టీజన్స్ కు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేశారు. అదే విధంగా వివిధ వైద్యులు ఆరోగ్య సూచనలు చేశారు. చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నందన్ ఆధ్వర్యంలో ఈసిజి 2డి ఈకో పరీక్షలు నిర్వహించగా, ఆర్థోపెడిషియన్ డాక్టర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఎముకల పటిష్టత కొరకు ఇతర ఆరోగ్య సమస్యలపై సూచనలు ఇచ్చారు. దాదాపుగా 350 మంది ఉద్యోగులు భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ సిఈవో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ప్రాముఖ్యత, సమాజంలో ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షులు సుధీర్, సలహాదారులు జనార్దన్ రెడ్డి, అతిథులుగా ఎస్‌పిడిసిఎల్ అధ్యక్షులు ఏ. వేణు, అదనపు కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రావు ఇతర కార్మికులు, పెన్షనర్లు, హాస్పిటల్ సిబ్బంది నరేష్ మరియు కృష్ణ ప్రసాద్, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 28 కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని 28 బిసి కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని 28 కులాల ప్రతినిధులు బిజెపి ఎంపి ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు ఈశ్వర్, పిల్లి సంజయ్ కుమార్, మోహన్ చౌహాన్,బోరెద ప్రవీణ్ కుమార్,జాజెరావు వేదకర్, రాంనివాస్ వర్మ శ్రీనివాస్ తిపిరిశెట్టితో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లో ఈటల రాజేందర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 28 కులాలను కేంద్ర ఒబిసిలో చేర్చే అంశంపైన జాతీయ బిసి కమిషన్ కేంద్ర సాధికార మంత్రిత్వ శాఖకు నివేదిక అందజేసిందని వారు వివరించారు. ఈ నివేదికపైన కేంద్రం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకునేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనిపైన ఈటల రాజేందర్ స్పందిస్తూ ఈ సమస్యను త్వరలో కేంద్ర మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్లి, కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చేలా చేస్తామని హామీనిచ్చినట్టు కులసంఘాల ప్రతినిధులు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/నాగారం :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్ర వారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత, పాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,ప్రధానోపాధ్యాయుడు,టీచర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవీందర్ తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని బిఎన్‌రెడ్డి కాలనీ 11 కెవి ఫీడర్‌ను 11.30 గంటల నుండి 12 గంటల వరకు నిలిపి వేయడడంతో బిఎన్ రెడ్డి కాలనీ ప్రాంతం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని,అదే విధంగా జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం 11 కెవి ఫీడర్‌ను 12.00 గంటల నుండి 12.30 గంటల వరకు నిలిపి వేయడంతో ఇసీ నగర్,మింట్ కాలనీ,మహలక్ష్మి నగర్ కాలనీ,11 కెవి పెద్ద చర్లపల్లి ఫీడర్‌ను మధ్యాహ్నం ఒంటి గంట నుండి 1.30 వరకు నిలిపి వేయడంతో పెద్ద చర్లపల్లి,ఆఫీసర్స్ కాలనీ,పుకట్ నగర్ కాలనీ,వెంకట్‌రెడ్డి కాలనీ,మధుసూదన్‌రెడ్డి కాలనీ,సిల్వర్ ఓక్ బంగ్లాస్‌లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలిపారు.

# ప్రజాప్రభుత్వంలో పాత వాసనలు

**గత ప్రభుత్వ పెద్దలకు చేరుతున్న కీలక సమాచారం**

**ఎక్స్ టెన్షన్‌లో కొనసాగుతున్న పది మంది రిటైర్డ్ అధికారులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం మారినా.. పాలన రహస్యాలు ఇంకా బిఆర్‌ఎస్ నేతలకు చేరుతున్నాయి. కీలక సమాచారం లీక్ అయితే చర్యలు ఉంటాయని సిఎం రేవంత్ రెడ్డి గతంలోనే హెచ్చరించారు. అయితే ఎక్స్ టెన్షన్‌లో కొనసాగుతున్న కొందరి కారణంగా జిహెచ్‌ఎంసి రహస్యాలు గత ప్రభుత్వ పెద్దలకు చేరుతున్నట్టు తెలుస్తోంది. అప్పటి మంత్రుల అండదండలతో రిటైర్డ్, ఎక్స్ టెన్షన్ అయిన కీలక స్థానాల్లో సదరు కొనసాగుతున్నరు. జిహెచ్‌ఎంసిలో రిటైర్‌మెంట్, ఎక్స్ టెన్షన్ ఉద్యోగుల పెత్తనం కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో విరమణ పొందిన తర్వాత ఎక్స్ టెన్షన్‌లు పొందిన ప్రతీ అధికారిని ఇంటికి పంపించాలని నిర్ణయించింది రేవంత్ రెడ్డి సర్కార్. అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు అయోచిత ప్రయోజనం చేకూర్చినందుకు అధికారులు ఇంకా కొనసాగుతున్నట్టు ఆరోపనలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలన రహస్యాలు లీక్ అవుతున్నట్టు స్వయంగా ముఖ్యమంత్రే గతంలో అనేకసార్లు చెప్పారు. అందులో భాగంగానే సర్వీస్ ఉన్న ఉద్యోగులు మినహా ఎక్స్ టెన్షన్, రిటైర్‌మెంట్ వాళ్లను కొనసాగించొద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినా బల్దియాలో కొందరు రిటైర్డ్ ఉద్యోగులకు అవేవీ పట్టడం లేదు. జిహెచ్‌ఎంసిలో 46 మంది అధికారులు, ఉద్యోగులు రిటైర్‌మెంట్, ఎక్స్ టెన్షన్లలో కొనసాగుతున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఇందులో వర్క్ ఇన్స్ పెక్టర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకూ, స్లమ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ మొదలుకొని అదనపు కమిషనర్ వరకూ అందిరికీ ఎక్స్ టెన్షన్ లేదా రిటైర్‌మెంట్ అయిన తర్వాత మళ్లీ అదే సీట్లో కొనసాగించడం చేశారు. ఈ పద్ధతిలో ఉన్నవారందరినీ తొలగించాలంటూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఆదేశాలు అందిన నెల రోజుల్లోపే 36 మందిని ఇంటికి పంపిస్తూ జిహెచ్‌ఎంసి నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు బాగానే ఉన్నా మిగిలిన పది మందిని అదే స్థానాల్లో కొనసాగిస్తుండటం జిహెచ్‌ఎంసిలో హాట్ టాపిక్‌గా మారింది.

### మేయర్ కార్యాలయంలో కీలక బాధ్యతల్లో రిటైర్డ్ అధికారి..

మూడేండ్ల కిందటే రిటైరయి ఎక్స్ టెన్షన్‌లో ఉన్న అధికారులను మళ్లీ కొనసాగిస్తుండటం గమనార్హం. మూడేండ్ల క్రితమే రిటైరయిన ఓ అధికారి అత్యంత ప్రధానమైన మేయర్ కార్యాలయంలో కీలక బాధ్యతల్లో సదరు ఆఫీసర్ ఉండటం చర్చనీయంగా మారుతోంది. ఈయన మూడేండ్ల క్రితమే రిటైరయినా అప్పటి నుంచి ఎక్స్ టెన్షన్‌లో మేయర్ కార్యాలయంలోనే పనిచేస్తున్నారు. ప్రభుత్వం మారినా కూడా ఆయన అదే స్థానంలో కొనసాగుతున్నారు. జిహెచ్‌ఎంసి మేయర్‌కు, అడిషనల్ కమిషనర్లు, ఇతర హెచ్‌ఓడిల మధ్య అనుసంధానంగా సదరు అధికారి పనిచేస్తారు. ఎప్పుడో రిటైరయిన అధికారిని ఈ కీలక బాధ్యతల్లో కొనసాగించడంపై ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ కార్యాలయంతో పాటు జిహెచ్‌ఎంసికి సంబంధించిన కీలక సమాచారం లీక్ అవుతుండటం కూడా తమ అసంతృప్తికి కారణమని అధికారులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలోని కీలక మంత్రి ఓఎస్‌డికి సన్నిహితుడు కావడంతోనే ఈ అధికారి సర్వీసు అయిపోయిన తర్వాత కూడా కీలక స్థానంలో కొనసాగుతున్నారు. అక్కడి నుంచే జిహెచ్‌ఎంసి కీలక సమాచారమంతా గత ప్రభుత్వ పెద్దలకు చేరుతున్నట్టు అధికారవర్గాలు భావిస్తున్నాయి. మున్సిపల్ శాఖలో ఉన్నత స్థానంలో రిటైరయిన మరో అధికారిని ఇలాగే జిహెచ్‌ఎంసి కొనసాగిస్తోంది. జిహెచ్‌ఎంసిలో ఓ పదిమందితో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, దానికి ఇన్ చార్జ్‌కి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సదరు అధికారి కూడా గత మూడేండ్లుగా ఎక్స్ టెన్షన్‌లో కొనసాగుతుండటం గమనార్హం. భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న కొంతమందితో కలిపి మొత్తం పది మంది అధికారులు ఇదే పద్ధతిలో బల్దియాను పట్టుకొని వేలాడుతున్నారు. గత ప్రభుత్వంలోని పెద్దల అండతో ఇక్కడే తిష్ట వేసిన సదరు అధికారులు తమను వేధింపులకు గురిచేస్తున్నారని కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.

## ప్రజలు ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగపర్చుకోవాలి



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** ఐఆర్‌జి కేర్ స్వచ్ఛంద సంస్థ లింకు వర్కర్స్ స్కీం ప్రాజెక్టు తరుపున అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో శుక్రవార రోజు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించటం జరిగినదని జిల్లా కోఆర్డినేటర్ టి రామిరెడ్డి తెలియజేశారు. ఈ క్యాంపు లో దాదాపుగా 42 మందికి మహిళలు, యూత్‌కి ఉచిత ఆరోగ్య పరీక్షలు చేశారు. తరువాత క్షయ వ్యాధి అంటే దమ్ము జబ్బు, హెచ్ఐవి ఎయిడ్స్ ఎలా వస్తుంది ఎలా రాదు ముఖ్యంగా మనము రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి. యువకులకు వివరించటం జరిగింది. తరువాత సుఖ వ్యాధులు ఎలా వస్తాయి దానికి ప్రభుత్వము ఎక్కడెక్కడ సేవలు అందిస్తుందని తెలియచేశారు. దీనికి అన్నోజిగూడ పెద్దలు మహిళా సంఘాల ప్రతినిధులు యువకులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ ఆలీ గారి ఆధ్వర్యంలో జెడ్‌పిహెచ్‌ఎస్ బాయ్స్ హై స్కూల్ వద్ద శుక్రవార రోజు ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ, స్కూల్లో , ఇంట్లో, ఇంటి పక్కన పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అలానే వర్షాకాలం వచ్చింది అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిహెచ్‌ఎస్ బాయ్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ పాపి రెడ్డి, మాజీ వార్డు మెంబర్ రహీం, విద్యార్థులు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీను, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, మున్సిపల్ స్టాప్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త



**ప్రజాపక్షం/దమ్మాయిగూడ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ చైర్మన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగ్యూ వ్యాధులు పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.కాలనీలో టైర్లు, తొట్లలో నిల్వ ఉన్న నీళ్లను తొలగించారు.అదే విధంగా ఆర్‌జికె కాలనీలో వన మహోత్సవంలో భాగంగా 500 మొక్కలను నాటి 1153 పండ్ల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేశారు.ఇందులో కమిషనర్ రాజమల్లయ్య,కౌన్సిలర్ నానునాయక్,ఏఎన్‌ఎం,ఆర్‌పిలు,అంగన్‌వాడి టీచర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంజయ్ పార్కును ఆహ్లాదంగా తీర్చిదిద్దండి : కార్పొరేటర్ పన్నాల



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయటంతో పాటు వాకింగ్ ట్రాక్, వ్యాయామ సంబంధిత జిమ్ పరికరాలను ఏర్పాటు చేయటం ద్వారా అహ్లాదకర పరిస్థితులుండే రీతిలో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా సంజయ్ పార్కును తీర్చి దిద్దాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు కార్పొరేటర్ వినతిపత్రం సమర్పించారు.జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఈఈ హరిలాల్, డిఈ రవీందర్, ఏఈ స్రవంతి వివిధ విభాగాల అధికారులతో కల్సి డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ బస్తీలల సిసి రోడ్లు వేయాలని, కౌండిన్య భవన్‌లో పెండింగ్ పనులు, మోడరన్ దోభీఘాట్ నిర్మించాలని కార్పొరేటర్ కోరారు. కార్పొరేటర్‌తో పాటు పైళ్ల ప్రవీణ్, తండా వాసు గౌడ్, ఉస్మాన్ తదితరులు ఉన్నారు.

## ప్రతిభ కనబరచిన పోలీసులకు రివార్డులు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నేర పరిశోధనలో పోలీసు సిబ్బంది సాంకేతికను వినియోగించుకొంటూ ఫలితాలను సాధించటం ద్వారా ప్రజల మన్ననలను పొందగలుగుతారని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. ఇటీవల స్నాచింగ్ కేసుల్లో నిందితులను అరెస్టు చేయటంలో విశిష్ట ప్రతిభ కనపరచిన సిసిఎస్ సిబ్బందిని శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో రివార్డులతో సత్కరించారు. ఎల్‌బి నగర్, వనస్థలిపురం, సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధుల్లో నమోదైన మూడు స్నాచింగ్ కేసుల్లో నిందితులను 24 గంటల్లో పట్టుకొన్న రాచకొండ క్రైమ్ స్టేషన్ అధికారి సిహెచ్ శ్రీనివాస్, ఎస్ రాజ్‌కుమార్ (pc5817), ఎం.శాంతి స్వరూప్(pc5817)లకు రివార్డులు దక్కాయి.

## సిఎం రేవంత్‌రెడ్డికి రైతులు రుణపడి ఉండాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిఎం రేవంత్‌రెడ్డికి రైతులు ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని లక్ష్మాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కటికెల గోపి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనాతి కాలంలోనే రైతులకు మొదటి విడతలో ఏకంగా లక్ష రూపాయలు రుణమాఫి చేసిందన్నారు. రైతులు కాంగ్రెస్ పక్షాన ఉండాలని కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని చెప్పారు. కాంగ్రెస్ హాయాంలో రైతులకు పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతుందని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉద్దెమర్రి గ్రామంలో రైతు సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బండి జగన్నాదం, మాజీ అధ్యక్షుడు బాల్‌నర్సింహా, మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, నాయకులు తరులు పాల్గొన్నారు.

## భూకబ్జాదారుల ఆగడాలకు హద్దే లేదా?

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామరం లాలసాహెబ్ గూడకు చెందిన దారా పద్మావతితో కలిసి నేడు షాపూర్ నగర్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దారం పద్మావతీ మాట్లాడుతూ, సర్వే నెంబర్ 344/1,345/1లో మా సొంత భూమిలోకి వెళుతుంటే కెఎల్ యూనివర్సిటీ సెక్యూరిటి సూపర్‌వైజర్ సిబ్బంది రానివ్వలేదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో చెప్పగా ఎందుకు చెప్పారని వాళ్ళ సిబ్బంది కుమారుడు దారం నర్సింగ్ రావుపై భౌతిక దాడి చేస్తూ మాయాజమాన్యం మిమ్మల్ని చంపి పేగులు వేసుకోమన్నామని మళ్ళీసరి వస్తే చంపేస్తామని అన్నారన్నారు. ఈ విషయం కేస్ యాజమాన్యంపై కాకుండా సిబ్బందిపై వేశారని ఇప్పటికైనా న్యాయం చెయ్యాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ గతంలో కూడా గాజులరామరంలో విలేకరులపై, రెవెన్యూ అధికారులపై దాడులు జరిగినా కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల నేటికి ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని కావున కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే బాధితులతో కలిసి కమిషనర్ దగ్గరికి వెళతామన్నారు. అదే విధంగా దాడులు చేసిన సిబ్బందిపై, చేయించిన యాజమాన్యంపై హత్యాయత్నం కేసు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు దారం పద్మావతి, దారం నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, కోశాధికారి సదానంద, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బిసి-ఎలోకి మార్చాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి/మల్కాజిగిరి:** అత్యంత పేదరికం,దుర్భర పరిస్థితులతో వెనక బడి ఉన్న ముదిరాజులను బిసిడి గ్రూప్ నుండి బిసిఎ గ్రూప్‌లోకి పునరుద్ధరణ చేయాలంటూ మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహాసభ మల్కాజిగిరి తహసీల్దార్‌కు శుక్రవారం నాడు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ముదిరాజ్‌లతో ఏర్పాటు చేసిన మహాసభ ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, అధ్యక్షుడు చెరుకు సాంబరాజ్‌లు మాట్లాడుతూ తెలంగాణాలోని 56 శాతంగా ఉన్న బిసి జనాభాలో 13 శాతానికి పైగా ఉన్న ముదిరాజ్‌లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అత్యంత తక్కువ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తుండటం శోచనీయంగా ఉందన్నారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం ఇచ్చిన విధంగా అమలు చేయాలని కోరారు. ముదిరాజ్‌లకు అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీని ప్రభుత్వ ఏర్పాటు చేయటం హర్షించదగిందని, ఈ సొసైటీకి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. చెరువు, కుంటలపై, మత్స్య సంపదపై ముదిరాజ్, గంగ పుత్ర, గూండ్ల కులాలకు హక్కులు కల్పించి చట్టపరమైన ఆదేశాలు కల్పించాలని, తెలంగాణా మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి అవసరమైన నిధులు కేటాయించాలని, ఈ బోర్డుకు ముదిరాజ్‌లనే చైర్మన్‌గా నియమించాలని, 50 ఏళ్లు పైబడిన మతత్స్యకారులకు ఆసరా పెన్షన్లు ఇవ్వాలని, ప్రత్యేక గురుకుల పాఠశాల, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం చేకూర్చాలని వారు కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా తహసీల్దార్, కలెక్టర్లకు వినతి పత్రాలిస్తున్నామన్నారు. కటికల భిక్షపతి, వంశీ ముదిరాజ్, సంపత్ ముదిరాజ్, ప్రసాద్, కృష్ణమూర్తి, ఆంజనేయులు, రమేష్ ముదిరాజ్, సురేష్, పరశురాం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకారం

**పౌరసన్మానంలో చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/తాండూరు :** రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరని, రాజకీయాలకు అతీతంగా తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపి సహకారం అందజేస్తానని చేవెళ్ళ పార్లమెంట్ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులోని తులసి గార్డన్‌లో బిజెపి పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పౌర సన్మానంలో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారి గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కుల సంఘాలు, అసోసియేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎంపిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో ఖజానాలో సొమ్ము లేక ప్రభుత్వం ఇబ్బందులకు గురవుతుందన్నారు. దేశ ప్రధాని మోడీ వేస్తున్న నిధులతోనే సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆదాయంలో రూ.1.లక్ష 30వేల కోట్ల నిధులలో రూ.55వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు సరిపోతే మిగిత డబ్బులు గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టడానికే సరిపోతుందన్నారు. తెలంగాణలో మళ్ళీ వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని అన్నారు. పార్టీ సిద్ధంతాలను నమ్మి తాను బిజెపి పార్టీలో చేరానన్నారు. తనను ఆదరించి గెలిపించిన తాండూరు నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేష్‌కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణా ముదిరాజ్, తాండూరు అసెంబ్లీ ఇంచార్జీ రజనీకుమార్, జిల్లా అధికార ప్రతినిధిలి వెంకట్, సీనియర్ నాయకులు నరేష్ మహారాజ్, ఎంపిపి బాలేశ్వర్ గుప్తా, బిజెపి ఫ్లార్ లీడర్ అంతారం లలీత, కౌన్సిలర్‌లు లావణ్య, బాలప్ప, నాయకులు బంటారం భద్రేశ్వర్, సెన్‌సార్ బోర్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా రేవంత్ అడుగులు

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి**



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ ఆర్.గురునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలాలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొడంగల్ నియోజకవర్గానికి 5 సార్లు ఎంఎల్‌ఏగా ప్రాతినిధ్యం వహించిన నేను అప్పట్లో అధికారం అనేది అంతగా లేకపోయిందన్నారు. కాని రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో అడుగు పెట్టిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడుగా ఎన్నిక అయిన నాటి నుంచి రాష్ట్రంలో కొడంగల్ పేరు మారుమ్రోగుతుందన్నారు. అలాంటిది రాష్ట్రానికి సిఎం అయ్యే అవకాశాలు కూడా రేవంత్‌రెడ్డికి మెండుగా ఉన్నాయనే సంకల్పంతో ఆయన గెలుపుకోసం రాత్రింబవళ్లు కష్టపడి ఇక్కడ ఎంఎల్‌ఏగా గెలిపించుకున్నామని అన్నారు. రాష్ట్రానికి సిఎం అయిన తరువాత వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రేవంత్‌రెడ్డికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహాలో ఇనాడు రేవంత్‌రెడ్డి పరిపాలన చూస్తున్నానని అన్నారు. మొదటి విడతలోనే లక్ష రూణమాఫి చేసి రైతుల పాలిట దేవుడిలా మారడంటు జోష్యం చేప్పారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్, మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మునీర్, మాజీ జేడ్పీటీసీ ఎనుగుల భాస్కర్, తాజా మాజీ సర్పంచ్‌లు చిన్ననందిగా సాయిలు తదితరులు పాల్గోన్నారు.

## అమరదికుర్దులో రేవంత్ రెడ్డికి పాలభిషేకం



**ప్రజాపక్షం/బంట్వారం :** వికారాబాద్ జిల్లా మోమిన్‌ట్ మండలం అమరదికుర్దు గ్రామంలో ఏక కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణ మాఫీ చేసి రైతన్న అప్పుల పాలు కాకుండా మొదటి దఫాలో లక్షలోపు రుణమాఫీ అయిన లబ్దిదారులైన రైతులు రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పికర్ గడ్డం ప్రసాద్ కూమార్‌ల చిత్రానికి పటానికి శుక్రవారం పాలభిషేకం చేశారు.

## ఉపాధ్యాయులది సమాజంలో ఎనలేని స్థానం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** విద్యార్థులను ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దగలిగే ఉపాధ్యాయుల సమాజంలో ఎనలేని స్థానం ఉందని మౌలాలి కార్పొరేటర్ సునీత చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మౌలాలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి పదవీ విరమణ సభలో కార్పొరేటర్ దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దీర్ఘ కాలంగా ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన రామచంద్రారెడ్డి సిబ్బందితో సమన్వయం పాటిస్తూ ఉత్తమ ఫలితాలు దక్కేలా మార్గ నిర్ధేశం చేసి మన్ననలు పొందారన్నారు.

## పోలీస్‌స్టేషన్ సందర్శించిన డిసిపి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి శుక్రవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా డిసిపి కోటిరెడ్డి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి రాములు, డిఐ,ఎస్‌హెచ్ఓ, ఎస్ఐలు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

**చోద్యం చూస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు**



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మండల పరిధిలోని మల్లంపేట్ సర్వేనెంబర్ 170లో ప్రభుత్వ భూమిని ఖూనీ చేసి ఏకంగా పిల్లర్స్‌తో నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారి భారతి మే21న కూల్చివేశారు. ఓ వైపు రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్న బరితెగిస్తున్న భూకబ్జాదారులు కూల్చిన చోటే అక్రమనిర్మాణాలు చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఎక్స్ సర్వీస్ మెన్ ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్న, నిర్మాణాలు చేపట్టాలన్న జిల్లా కలెక్టర్ నుండి తప్పని సరిగా ఎన్‌ఓసి పొంది ఉండాలి. మల్లంపేట సర్వే నంబర్ 170/యులో ఎటువంటి ఎన్‌ఓసి లేకుండా 5ఎకరాల స్థలంలో ఇప్పటికే సుమారు రెండు ఏకారల స్థలంలో ఎస్ఎన్ నర్సింగరావు గార్డెన్ పేరుతో నిర్మాణాలు చేపట్టిన స్థానిక మాజీ సర్పంచ్, మరో150గజాలలో కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపడుతున్నారు. కూల్చిన చోటే అక్రమ నిర్మాణాలను చేపడుతుండడంతో సదరు నిర్మాణ దారునిపై క్రిమినల్ కేసులు బుక్ చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. మల్లంపేట సర్వే నంబర్.173/6, సర్వే నంబర్.173/8లో ఇంటి నంబర్ 319/4/L తో టీఎస్ బిపాస్ నంబర్.379658/డి యు ఎన్ డి/0241/24 పేరిట 287 గజాలకు అనుమతి పొందిన నిర్మాణదారుడు అధికారుల కల్లుకప్పి 170/యు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కన్నెత్తిచూడడం లేదు. తప్పుడు పత్రాలతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తుంది. మల్లంపేట సర్వే నంబర్ 170/6,170/8 పట్టభూమిలో 287 గజాలకు మున్సిపల్ అనుమతిపొందిన సదరు నిర్మాణదారుడు సర్వే నంబర్.170/యూ ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నదంటూ అదే గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మరికొందరు జూన్ 25 మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినా కోర్టులో కేసు పెండింగులో ఉందంటూ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.

## విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షుడు గొనె హన్మంత రెడ్డి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలం కేశవరం, అద్రాస్‌పల్లిలోని పాఠశాలల విద్యార్థులు 250 మందికి ఉచితంగా ఐడికార్డు, టై, బెల్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేదలైన విద్యార్థులు విద్యసభ్యసిస్తున్నారని వారికి ప్రోత్సహకరంగా రూ. 25 వేల ఐడి కార్డు, టై, బెల్ట్‌లను అందజేస్తున్నానని చెప్పారు.



# క్రీడ

## భారత్ శుభారంభం..

### పాకిస్థాన్‌పై ఘన విజయం



**దంబుల్లా:** మహిళల టీ20 ఆసియా కప్ మెగా టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. శ్రీలంకలోని దంబుల్లా వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై విజయ ఢంకా మోగించింది. 7 వికెట్ల తేడాతో గెలుపొంది టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసింది. 109 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు షెఫాలీవర్మ (40; 29 బంతుల్లో 6x4, 1x6), స్మృతి మంధాన (45; 31 బంతుల్లో 9x4) అదరగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.2 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్.. ప్రారంభం నుంచి దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓవైపు క్రీజులో నిలదొక్కుకుంటూనే వరుస ఫోర్లు, సిక్సర్లతో పాక్ జట్టుకు చుక్కలు చూపించారు. తుబా హసన్ వేసిన ఎనిమిదో ఓవర్లో మంధాన చెలరేగిపోయింది. హ్యాట్రిక్ ఫోర్ సహా.. ఐదు బౌండరీలు బాదేసింది. ఆ ఒక్క ఓవర్లోనే 21 పరుగులు రాబట్టింది. భయంకరంగా మారిన ఈ జోడీని సైదా అరూబ్ విడగొట్టింది. 9.3వ బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించిన మంధాన.. బౌండరీ వద్ద అలియా రిజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. తొలి డౌన్‌లో వచ్చిన హేమలత (14; 11 బంతుల్లో 3x4), షెఫాలీ వర్మ స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. హర్మన్ ప్రీత్ కౌర్ (5*), రోడ్రిగ్స్ (3*) లక్ష్యాన్ని పూర్తి చేశారు. పాక్ బౌలర్లలో అరూబ్ షా 2 వికెట్లు పడగొట్టగా.. నష్రా సంధు ఒక వికెట్ తీసింది. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. దీంతో పాక్ 19.2 ఓవర్లకు 108 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సిద్రా అమీన్ 25, టుబా హసన్ 22, ఫాతిమా సనా 22 పరుగులు చేయగా.. మిగతా బ్యాటర్లు నామమాత్రపు స్కోరుకే పరిమితమయ్యారు. టీమ్‌ఇండియా బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు తీయగా.. రేణుకా ఠాకూర్, పూజా వస్త్రాకర్, శ్రేయంకా పాటిల్ చెరో రెండేసి వికెట్లు తీశారు.

## ఒలింపిక్స్‌కు హై సెక్యూరిటీ

### పారిస్‌లో ఇండియన్ డాగ్ స్క్వాడ్ డ్యూటీలో 45వేల మంది పోలీసులు!



పారిస్ ఒలింపిక్స్ 2024 విశ్వ క్రీడల సంరంభానికి సమయం దగ్గరపడుతోంది. ముచ్చటగా మూడోసారి ఒలింపిక్స్‌కు అతిథ్యం ఇస్తున్న పారిస్, విశ్వ క్రీడలను ఘనంగా నిర్వహించాలని పట్టుదలగా ఉంది. ఈ విశ్వక్రీడల్లో పాల్గొనేందుకు 180+ దేశాల నుంచి అథ్లెట్లు పారిస్‌కు రానున్నారు. ఇక వివిధ దేశాల ప్రముఖులు, సెలబ్రిటీలు ప్రత్యక్షంగా ఒలింపిక్స్ క్రీడలు వీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో విశ్వక్రీడల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫ్రాన్స్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. భద్రత కోసం ఫ్రాన్స్ ఇప్పటికే, భారత ప్రభుత్వాన్ని సంప్రదించింది. ఒలింపిక్స్ భద్రత కోసం భారత ప్రభుత్వం సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కే 9 జాతి శునకాలను పారిస్‌కు పంపింది. ఈ శునకాలు ఇప్పటికే పారిస్‌లో భద్రతా విధుల్లో పాల్గొంటున్నాయి.

**పటిష్ఠ భద్రత:** ఒలింపిక్స్ క్రీడలను ప్రశాతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఆతిథ్య దేశాలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. 2000లో సిడ్నీ ఒలింపిక్స్‌లో భద్రత కోసం 250 మిలియన్ డాలర్లు ఖర్చు చేయగా, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు అయ్యింది. 2004 తర్వాత నిర్వహించిన ప్రతీ ఒలింపిక్స్‌లోనూ భద్రత కోసం ఖర్చు 1 బిలియన్ డాలర్ నుంచి 2 బిలియన్ డాలర్ల మధ్య ఖర్చు పెడుతున్నారు. ఇక కొవిడ్ సమయంలో ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు పొందిన జపాన్ కేవలం కరోనా పరీక్షలు, క్వారంటైన్‌ల కోసమే 2.8 బిలియన్ డాలర్లను ఖర్చు పెట్టింది. ఈ క్రమంలో 2024 ఆతిథ్య హక్కులు పొందిన పారిస్ కూడా భద్రత కోసం భారీగా నిధులు కేటాయించింది. పారిస్‌లో భద్రత కోసం ఫ్రాన్స్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తోంది. టెర్రరిస్టుల ప్రత్యేక స్థావరాలను గుర్తించే సామర్థ్యం ఉన్న బెల్జియన్ మలినోయిస్ జాతి శునకాలను పారిస్‌లో మోహరించారు. ఈ జాతి శునకాలు ఏదైనా అనుమానాస్పద ఉనికిని చాలా వేగంగా గుర్తిస్తాయి.

**రోజుకు 35 వేలమందితో:** పారిస్‌లో రోజుకు 30,000 మంది పోలీసు అధికారులతో భద్రత కల్పిస్తున్నారు. జూలై 26 నుంచి ఆగస్టు 11 మధ్య రోజూ దాదాపు 30,000 మంది పోలీసు అధికారులను మోహరిస్తోంది. సీన్ నదిలో ప్రారంభమయ్యే వేడుకల కోసం 45,000 మందితో భద్రత కల్పిస్తున్నారు. రోజూ కనీసం 35,000 నుంచి 45,000 మంది భద్రత సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు .

**పారిస్ భద్రతలో భారత్ మార్క్:** పారిస్ భద్రతలో భారత్‌కు చెందిన కె9 విభాగంలో 10 జాతి శునకాలు ఉన్నాయి. ఇందులో ఆరు బెల్జియన్ షెపర్డ్‌లు, మూడు జర్మన్ షెపర్డ్‌లు, ఒక లాబ్రడార్ రిట్రీవర్ జాతి శునకాలు ఉన్నాయి. ఒలింపిక్స్ నిర్వహించే సమయంలో ఇవి పెట్రోలింగ్ చేస్తాయి.పారిస్‌కు బయలుదేరే ముందు ఈ శునకాలకు 10 వారాలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

**భారత్ నుంచి:** ఈసారి భారత్ నుంచి ఒలింపిక్స్ కోసం 117 మంది అథ్లెట్లతో పాటు 140 మంది సహాయక సిబ్బంది యూరప్‌కు వెళ్లనున్నారు. భారత అథ్లెట్లలో 70 మంది పురుషులు, 47 మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. అథ్లెటిక్స్‌లో 29 మంది క్రీడాకారులు ఒలింపిక్స్‌కు ఎంపికయ్యారు.

# లీల

## కిరణ్ అబ్బవరం సినిమాకి ఆఫర్స్



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రమే 'క'. వరుస పరాజయాలు తర్వాత కొంచెం గ్యాప్ తీసుకొని ఈ యంగ్ హీరో ఈ సాలిడ్ సబ్జెక్టుతో వస్తుండగా ఈ సినిమా నుచి రీసెంట్‌గా వచ్చిన టీజర్‌తో మంచి ఫీడ్ బ్యాక్‌ని తాను సొంతం చేసుకున్నాడు. దర్శకులు సుజీత్ సందీప్‌లు తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ఇపుడు తెలుగు స్టేట్స్‌లో సాలిడ్ ఆఫర్స్ వస్తునట్టుగా వినిపిస్తుంది. మరి టీజర్ ఇంప్రెసివ్‌గా ఉండడంతో ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్రానికి 10 కోట్లకి పైగా బిజినెస్ జరుగుతున్నట్టుగా తెలుస్తుంది. మన టాలీవుడ్‌కి చెందిన ఒక లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమాని కొనుగోలు చేస్తునట్టుగా తెలుస్తుంది. మొత్తానికి అయితే కిరణ్ అబ్బవరం ఈ సినిమాతో బౌన్స్ బ్యాక్ అయ్యేలా ఉన్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తుండగా సామ్ సి ఎస్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే శ్రీచక్ర ఎంటర్టైన్మెంట్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మాణం వహిస్తున్నారు.

## 'ఉరుకు పటేల' ఫస్ట్ లుక్ విడుదల



హుషారు వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తేజస్ కంచర్ల. ఇప్పుడు మరింతగా ప్రేక్షకులకు దగ్గరయ్యే కథాంశాలతో సినిమాలు చేయటంపై తన దృష్టిని సారిస్తున్నారు. అందులో భాగంగా తేజస్ చేస్తోన్న తాజా చిత్రం 'ఉరుకు పటేల'తో ఆడియెన్స్ను అలరించబోతున్నారు. 'గెట్ ఉరికి ఫైడ్' సినిమా ట్యాగ్ లైన్. గురువారం మేకర్స్ 'ఉరుకు పటేల' ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. పోస్టర్ను గమనిస్తే తేజస్ కంచర్ల పరిగెడుతుంటే అతని వెనుక కత్తిని ఎవరో విసిరేసినట్లు కనిపిస్తుంది. మరో వైపు మంగళసూత్రం, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పాల క్యాన్ అన్నీ కనిపిస్తున్నాయి. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రమని తెలుస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంపొందించేలా ఉంది. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్ప వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## 'ఏజెంట్ జాన్ స్నో'గా మారిన రాజేంద్ర ప్రసాద్




యంగ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం రాబిన్ హుడ్ ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు వెంకీ కుడుముల డైరెక్ట్ చేస్తుండటంతో ప్రేక్షకుల్లో మంచి బజ్ ఏర్పడింది. ఇక ఈ సినిమాతో ఈ కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్ దగ్గర హిట్ కొట్టడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాను పూర్తి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా చిత్ర యూనిట్ రూపొందిస్తోంది. కాగా, ఈ సినిమాలో భారీ క్యాస్టింగ్ నటిస్తోంది. ఇందులో నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ కూడా ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆయన పాత్రను ఇంట్రడ్యూస్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో అలియాస్ జనార్ధన్ సున్నిపెంట అనే పాత్రలో నటిస్తున్నారు. ఆయన పర్ఫార్మెన్స్ ప్రేక్షకులను మరోసారి కడుపుబ్బా నవ్వించే విధంగా ఉండనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 20 న ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తు న్నారు.

## ఓటిటిలో అదరగొడుతున్న సుమంత్ అహం రీబూట్



మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఆహాలో వచ్చిన పలు ఒరిజినల్ కంటెంట్‌లో లేటెస్ట్ చిత్రం టాలెంటెడ్ నటుడు సుమంత్ నటించిన లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం అహం రీబూట్ కూడా ఒకటి. మరి ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రశాంత్ సాగర్ అట్లూరి తెరకెక్కించిన ఈ చిత్రం థ్రిల్లర్ ఆడియెన్స్‌లో బాగానే టాక్ తెచ్చుకుంది. అయితే ఈ సినిమా ఇప్పుడు ఓటిటిలో అదరగొడుతున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ జూలై 1న ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చిన ఈ చిత్రం ఇప్పటి వరకు రెండు కోట్ల స్ట్రీమింగ్ మినిట్స్‌ని క్లాక్ చేసినట్టుగా తెలుస్తుంది. దీనితో ఓటిటిలో ఈ చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ దక్కింది అని చెప్పాలి. సినిమా మొత్తం ఒక్క హీరో మీదనే కనిపించే థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సినిమాని థ్రిల్లర్ లవర్స్‌లో టాక్ రావడంతో కొందరు చూసేందుకు ఆసక్తి చూపించారు.

## బిల్కిస్ బానో కేసులో దోషుల పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ :** బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషుల పిటిషన్‌ను సుప్రీం కొట్టివేసింది. రెమిషన్(శిక్ష తగ్గింపు) వచ్చేవరకు తమకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా దోషులు సుప్రీ ంను ఆశ్రయించారు. కాగా అత్యున్నత న్యాయస్థానం శుక్రవా రం ఈ పిటిషన్‌ను నిరాకరించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం దీనిని పూర్తిగా తప్పుడు పిటిషన్‌గా పేర్కొంది. కోర్టులోని ఒక బెంచ్ జారీ చేసిన ఆర్డర్‌పై మరొక బెంచ్ ఎలా అప్పీల్ చేస్తారని ప్రశ్నించింది. కాగా దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రా జుభాయ్ బాబూలాల్ సోనీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరగా దానికి బెంచ్ అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో పెద్దఎత్తున చోటుచేసుకున్న మతపరమైన అల్లర్లలో బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురు సభ్యులు హత్యకు గురయ్యారు. 5 నెలల గర్భిణిగా ఉన్న బానోపై దుండగులు సా మూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో 11 మం ది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 14 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్నవారికి 2022లో గుజరాత్ ప్రభుత్వం రెమిషన్ మంజూరు చేసింది. దీంతో 2022 ఆగస్టు 15న వారంతా జైలు నుంచి వి డుదలయ్యారు. దీంతో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని స వాల్ చేస్తూ బానో సుప్రీం తలుపుతట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ.. వారి విడుదల చెల్లదని జనవరి 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండు వారాల్లోగా జైలు అధికారుల వద్ద లొంగిపోవాలని ఆదేశించింది.

## 2041 నాటికి ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా అసోం : సిఎం



**గువహటి :** తమ రాష్ట్రంలో ముస్లిం జనాభా ప్రతి పదేళ్లకు 30 శాతం పెరుగుతోందని, 2041 నాటికి వారే మెజారిటీ అవుతారని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ శుక్రవారం ప్రకటించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, గణాంకాల నమూనా ప్రకారం ఇప్పుడు అసోం జనాభాలో ముస్లింలు 40 శాతంగా ఉన్నారన్నారు. 2011లో అసోంలో 1.4 కోట్ల మంది ముస్లింలు ఉన్నారని, 2041 నాటికి, అసోం ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా మారుతుందని, ఇది వాస్తవమని, దీనిని ఎవరూ ఆపలేరు అని శర్మ నొక్కిచెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అసోంలో మొత్తం 1.07 కోట్ల ముస్లిం జనాభా ఉండగా, మొత్తం 3.12 కోట్ల మంది నివాసితులలో 34.22 శాతం ఉన్నారన్నారు. రాష్ట్రంలో 1.92 కోట్ల మంది హిందువులు ఉండగా, మొత్తం జనాభాలో 61.47 శాతంగా ఉన్నారని శర్మ చెప్పారు. ప్రతి పదేళ్లకు అసోంలో ముస్లింల జనాభా 11 లక్షలు పెరుగుతుందని... ఇది హిమంత బిస్వా శర్మ డేటా కాదు, భారత జనాభా లెక్కలు. ఇవన్నీ ప్రచురించిన డేటా అని సిఎం గుర్తుచేశారు. ప్రతి పదేళ్లకు హిందూ జనాభా 16 శాతం పెరుగుతోందని శర్మ చెప్పారు. ముస్లిం సమాజంలో జనాభా పెరుగుదలను తగ్గించేందుకు అసోం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన చెప్పారు. 'నిజుత్ మొయినా' పథకం విజయవంతమైతే, అమ్మాయిలు డాక్టర్లు ఇంజనీర్లు అవుతారు. వారు (పిల్లలకు) జన్మనివ్వరు' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద, అసోం ప్రభుత్వం బాల్య వివాహాలను నిరోధించే లక్ష్యంతో 11వ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు వచ్చే ఐదేళ్లపాటు బాలికలకు రూ.2,500 వరకు నెలవారీ స్టైఫండ్‌ను అందిస్తుంది. ముస్లింల జనాభా పెరుగుదలలో కాంగ్రెస్ కీలక పాత్ర కీలకమని సిఎం శర్మ అన్నారు. రాహుల్ గాంధీ (ప్రతిపక్ష నేత) జనాభా నియంత్రణ బ్రాండ్ అంబాసిడర్‌గా మారితే, ఆ పార్టీ చాలా వేగంగా పని చేస్తుంది, బ్రాండ్ అంబాసిడర్‌గా మారడానికి రాహుల్ పెళ్లి చేసుకుని 12 మంది పిల్లలకు జన్మనివ్వాల్సిన అవసరం లేదని, ముస్లింలు రాహుల్ గాంధీ చెప్పేది వింటారన్నారు.

## లోక్‌సభ ముందుకు ఆరు బిల్లులు

### బిఎసిని ఏర్పాటు చేసిన స్పీకర్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 22వ తేదీన ప్రారంభమై ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. సమావేశాలు జరిగే సమయంలో లోక్ సభలో ఆరు బిల్లులను ప్రవేశపెట్టే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. గురువారం లోక్‌సభ సచివాలయం విడుదల చేసిన బులిటెన్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నెల 23 నుంచి మంగళవారం ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ 2024–25 బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సభ ముందుకు ఫైనాన్స్ బిల్లు 2024ను తీసుకొస్తారు. అనంతరం సభా కార్యకలాపాలు వాయిదా పడతాయి. ఆ రోజు ప్రశ్నోత్తరాలు కానీ, జీరో అవర్ కానీ ఉండదు. మరుసటి రోజు నుంచి సభ ముందుకు విపత్తు నిర్వహణ సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, ఎయిర్ క్రాఫ్ట్ చట్టం1934లో ఉన్న అసందిగ్ధతలను తొలగించి మరింత స్పష్టత ఇచ్చేందుకు ఉద్దేశించిన భారతీయ వాయుయాన్ విధేయక్ 2024 బిల్లు, భారతీయ కాఫీ, రబ్బర్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన కాఫీ (ప్రమోషన్ అండ్ డెవలప్ మెంట్ )బిల్లు2024 , రబ్బర్ (ప్రమోషన్ అండ్ డెవలప్ మెంట్ )బిల్లు 2024ను సభముందుంచి ఆమోదించనున్నారు. ఇవేకాకుండా ప్రభుత్వం విషయ ప్రాధాన్యాన్ని బట్టి మరి కొన్ని బిల్లులనూ సభ ముందుకు తెచ్చే అవకాశం ఉంటుంది. వివిధ శాఖలకు సంబంధించిన డిమాండ్స్, గ్రాంట్స్‌పై చర్చించి అందుకు సంబంధించిన ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోద ముద్ర వేయనున్నారు. 2024–25 జమ్ముకశ్మీర్ బడ్జెట్ ప్రవేశ పెట్టి ఆమోదించనున్నారు. పార్లమెంటు సభ్యులు అత్యవసర ప్రజాప్రయోజన అంశాలను సభలో ప్రస్తావించడానికి ఆన్ లైన్ ద్వారా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన వాటిల్లోంచి ప్రతిరోజూ లాటరీ ద్వారా 20 మంది సభ్యులను ఎంపిక చేసి జీరో అవర్‌లో మాట్లాడటానికి అవకాశం కల్పిస్తారు. అయితే విషయ అత్యవసరతను బట్టి స్పీకర్ అనుమతి ఇచ్చిన వారు కూడా మాట్లాడేందుకు వీలుంటుంది. జూన్ 24 నుంచి జులై 2 వరకు జరిగిన 18వ లోక్‌సభ తొలి సమావేశంలో కొత్తగా ఎన్నికైన ఎంపిలు ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ సభ ఎన్నికల తరువాత నిర్వహించనున్న పూర్తిస్థాయి సమావేశాలు ఇవే. 18వ సమావేశంలో నీట్‌యుజి పేపర్ లీకేజ్ సహా పలు అంశాలపై ప్రభుత్వం, విపక్షాల మధ్య సభలో వాగ్వాదం జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్ సభ, రాజ్యసభ ఆమోదించాయి.



**బిఎసి ఏర్పాటు**

ఇదిలా ఉండగా.. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంటరీ అజెండాను నిర్ణయించే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎఎ)ని కూడా ఏర్పాటు చేశారు. లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీలో స్పీకర్‌తో సహా 15 మంది సభ్యులు, ఎక్స్‌అఫీషియో చైర్‌పర్సన్‌గా ఉంటారు. సభ్యులను స్పీకర్ నామినేట్ చేస్తారు. కమిటీ సాధారణంగా ప్రతి పార్లమెంటు సెషన్ ప్రారంభంలో, ఆ తర్వాత అవసరమైనప్పుడు సమావేశమవుతుంది. బిజినెస్ అడ్వైజరీ కమిటీని మొదటిసారిగా జులై 14, 1952న ఏర్పాటు చేశారు. కమిటీకి చైర్మన్‌గా ఓం బిర్లా వ్యవహరించనుండగా, సభ్యులుగా పిసి చౌదరి, నిషికాంత్ దూబే,అనురాగ్ ఠాకూర్, సంజయ్ జైస్వాల్, భర్తృహరి మహతాబ్, బైజయంత్ పాండా (వీరంతా బిజెపి సభ్యులే), గౌరవ్ గొగోయ్, కొడికున్నిల్ సురేష్ (ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ వారే), దిలేశ్వర్ కమైత్ (జెడియు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టిడిపి), సుదీప్ బంద్యోపాధ్యాయ (టిఎంసి), దయానిధి మారన్ (డిఎంకె), అరవింద్ సావంత్ (శివసేనయుబిటి), లాల్జీ వర్మ (ఎస్‌పి) ఉన్నారు.

## రైతులకు రుణమాఫీ 70 శాతం మందికి వర్తించడం లేదా?

### బండి సంజయ్ రాజీనామా చేయ్ మంత్రి పొన్నం సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు రుణమాఫీ 70 శాతం మందికి వర్తించడం లేదని బండి సంజయ్ అన్నారని, అది నిరూపించకపోతే తన పదవీకి రాజీనామా చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి సవాల్ విసిరారు. బండి సంజయ్ రైతులకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తుంటే భరించలేకపోతున్నారా? అని నిలదీశారు. రైతులకు నల్ల చట్టాలను తెచ్చి అణిచివేసే ప్రయత్నం చేసింది బిజెపి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. రైతులకు ఇంతపెద్ద రుణమాఫీ జరుగుతుంటే ప్రశంసించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని మండిపడ్డారు. దేశంలోనే ఒక రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేసింది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ స్థాయిలో రుణమాఫీ అమలు చేశారా అని ప్రశ్నించారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన గుజరాత్ రైతులకు వందల కోట్లు కేటాయించిన మీ ప్రభుత్వం తెలంగాణ రైతుల పంటలు నామా రూపాలు లేకుండా కొట్టుకుపోతే కనీసం ఒక్క రూపాయి అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు.

**గుజరాత్‌కు వందల కోట్లు, తెలంగాణకు ఒక్క రూపాయి ఇచ్చారా?**

గతంలో రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చి రైతులకు ఆత్మహత్యలకు కారణమైన ప్రధాని మోదీ ఈరోజు రైతులకు ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం జరుగుతుంటుంటే సమర్థించాల్సింది పోయి, సమర్థించకపోగా, విమర్శిస్తున్నారంటే అది సంజయ్ కుహనా బుద్ధి అని అర్థం అవుతుందని మండిపడ్డారు. తొలుత కేంద్రం నుంచి రాష్ట్రానికి సంజయ్ ఏం తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏం తెస్తారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. రైతులకు నల్ల చట్టాలను తెచ్చి అణిచివేసే ప్రయత్నం చేసిన మోదీ ప్రభుత్వానికి రైతుల గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. గుజరాత్‌లో భారీ వర్షాలు కురిస్తే రూ.100ల కోట్లు కేటాయించిన బిజెపి ప్రభుత్వం తెలంగాణ రైతాంగం భారీ వర్షాలకు పంట నామ రూపలేకుండా పోతే పంట నష్ట పరిహారం ఒక్క రూపాయి అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు.

**రైతులకు వెంటనే బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలి..**

తక్షణమే బండి సంజయ్ రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 2019 బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో 60 ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్ ఇస్తామని ప్రకటించారని ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. రైతుల మీద ఫసల్ బీమా భారాన్ని పెంచారని మండిపడ్డారు. ఎరువుల సబ్సిడిలో రూ. 75 వేల కోట్లు కోత పెట్టారని, కాంప్లెక్స్ ఎరువుల ధరలను రెట్టింపు చేశారని, అగ్రికల్చర్ సెస్ పేరుతో పంట ఖర్చులు పెంచారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ వ్యవహార శైలి చూస్తుంటే గురివింద గింజ నలుపెరుగదు అనే సామెతను గుర్తు చేస్తుందన్నారు. రైతులకు జరుగుతున్న కార్యక్రమాన్ని ప్రశంసించే ప్రయత్నం చేయాలని, అంతే తప్ప రైతులకు సంబంధించిన ఈ మంచి కార్యక్రమాన్ని విమర్శించే ప్రయత్నం చేయవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు

### ప్రమాద రహిత సంస్థగా సింగరేణి
### కార్మిక సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకుంటాం
### రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సిఎండి ఎన్.బలరామ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలను తక్షణమే తీసుకుంటామని సింగరేణి సంస్థ సిఎండి ఎన్.బలరామ్ ప్రకటించారు.హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతు సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ప్రతి కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైన వని, ప్రాణనష్టం జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అలాగే యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణను ఖచ్చితంగా పాటించాలని కోరారు. చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించమని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని.. అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణ అత్యం ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా జరిగిన ఈ సమావేశంలో గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి. నాణ్యమైన హెల్మెట్లు బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు, కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ , ఇతర నాయకులు అనేక సూచనలు చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మై సేఫ్టీ రీజియన్ 2 శ్రీ ఎన్.నాగేశ్వర రావు, ఇతర డి.జి.ఎం.యస్. అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు చేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు శ్రీ డి.సత్యనారాయణ (ఈ అండ ఎం) ఎన్ వి కె శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ పర్సనల్), జి వెంకటేశ్వర్ రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ ) రక్షణ చర్యలపై ప్రసంగించారు. సమావేశంలో ముందుగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు.